UNIVERSAL
LIBRARY
OU_204025
UNIVERSAL
LIBRARY

భాషాపోషక గ్రంథమండలి,

# ఈశ్వరసేవకులు

ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్

డాక్టరు ఖానుల—జీవితము

★

గ్రంథకర్త:—మహాదేవ దేశాయి

భూమికాకర్త:—మహాత్మాగాంధి

ఆంధ్రీకర్త:—ఉభయభాషా ప్రవీణ

కొత్త సత్యనారాయణ చౌదరి

సర్వస్వామ్య సంకలితము

౧-౪-౧౯౩౮

పి. పి. వర్క్సు-మదరాసు

"నా అహింసాసిద్ధాంతము ఇంచుమించుగ నాకు మతవిశ్వాసముగ మారిపోయినది. ఇంతకు మున్ను, నేను గాంధిజీయొక్క అహింసావ్రతమును విశ్వసించితిని. కాని నా రాష్ట్రములో అహింసాప్రయోగముయొక్క అపూర్వమగు విజయము నన్ను గట్టి అహింసావాదిగా బలపఱచినది. దైవము సరిచూచునేని, ఇక నా రాష్ట్రమెన్నడును హింసలో అడుగువెట్టదని ఆశింతును. నే నొక వేళ ఓడిన ఓడవచ్చును; హింసాతరంగములు నా రాష్ట్రమంతయు కప్పివేసినను వేయవచ్చును. అపుడు - అది నా దౌర్భాగ్యమనియే యెంచి తృప్తి ఒందెదను. కాని తక్కిన వారందఱికన్నను విశేషించి నా ప్రజలకు కావలసియున్న అహింసాసిద్ధాంతములో నాకున్న గాఢవిశ్వాసమును మాత్రము అది కదలింపనేరదు"

ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్

# భూమిక

ఖాన్ అబ్దుల్ గఫూర్‌ఖాన్‌తో కలసిమెలసియుండవలెనని నిరంతరము కాంక్షించుచుండును. అయితే గత వత్సరము కడపటి నెల దొరఁబడుటకు ముందు వఱకు అట్టి అవకాశము నాకు పొసగలేదు. కాని, వారు హాజారీబాగ్ జైలునుండి విడుదలయిన పదపడి కేవలము తమ్ముఁడేగాక అన్నగారగు డాక్టరు ఖాన్‌సాహేబు సయితము నా చెంతనుండు సౌభాగ్యము నాకొదవినది. పైఁగా అదృష్టము కలసివచ్చి, పోయిన డిసెంబరు ౨౩ వఱకు, వారు సరిహద్దురాష్ట్రము త్రొక్కరాదని ఆంక్ష కూడ సిద్ధించినది. కాంగ్రెసు—ఆదేశమునుబట్టి శాసనోల్లంఘనమును వారు తలపెట్టరయిరి. అద్దాన ఆ అన్నదమ్ములు వార్ధాలో సేఠ్ జమనాలాల్ బజాజ్‌యొక్క ఆతిథ్యము స్వీకరించిరి. ఈ తీరుగ వారితోడి సన్నిహిత సాహచర్యము నాకు సంప్రాప్తించినది. వారి వైఖరి యెఱింగిన కొలఁదిని నన్నెంతో వారు—ఆకర్షింపసాగిరి. వారి అఖండమయిన సత్యదీక్ష—బోళాతనము—

అత్యధికమగు ఓరాడంబరము నాకు అబ్బురము గొలిపి నవి. సత్యమును-అహింసను కేవలము రాజకీయ వైఖరిని బట్టియే గాక, పారమార్థిక దృష్టిగా వారు విశ్వసించిరని కూడ నేను గమనించితిని. కనిష్ఠసోదరుని దృష్టి గాఢమైన మతోద్రేకమందె పడుగుపేకలుగా నేయఁబడినదని గుఱుతించితిని, అయితే అది సంకుచితము కాదు; విశ్వప్రేమి యనియే నా కెఱుక అయినది. ఆతనికి రాజకీయము లన్నవి ఏవియైన ఉన్నవన్నచో అవి ఆతని మతమునుండి వెడలినవే అగును. ఇఁక, డాక్టరుకు అన్ననో రాజకీయములే లేవు.

ఈ సోదరులతోడ నాకు ఒదవిన ఈ పరిచితి, వీరినిగూర్చి లాఁతివారు అపోహములుపడిరను నిర్ణయము నకు వచ్చినది. అద్దాన వీరి జీవితమున గమనింపఁదగ్గ వన్నియు గమనించి, లోకుల యెట్టయెదుట వీరిని సాధారణ మానవస్వరూపమున పరిచయము కావించుచు, ఒక చరిత్ర తయారుచేయుమని మహాదేవ దేశాయితో మాట అంటిని. అందు రాజకీయముల ధోరణియు, ప్రభుత్వమునుగూర్చి విమర్శనయు వలదని నేనిచ్చిన సలహా. దాని ఫలితమే ఈ జీవితచరిత్రము. ఈ అన్నదమ్ములు తమ జీవితములందలి సంఘటనలనుగూర్చి మహాదేవ

దేశాయికి ఒసంగిన వివరములు సరిఅయినవి సత్యమయినవి అని యెఱింగి 'ఖుదాయీ ఖిద్మత్ గారులు' (ఈశ్వర సేవకులు) అను పలుకునకు వారు అర్హులగుదురో కారో పాఠకులే నిర్ణయింతురు గాక !

ఢిల్లీ
14 జనవరి 1935. — మోహనదాస కరమ్‌చంద్ గాంధీ

# ప్రస్తావన

ఝరీవేగమును బోలి క్రొంగ్రొత్తరీతులుగ దృశ్యమానమగు నేఁటి రాజకీయరంగమున విశేషముగ మన్నింపఁదగినవారిలో 'ఖాను సోదరు'లొకరు. వీరిలో డాక్టరు ఖాన్ సాహెబు వయసున పెద్ద యను విషయము కొందఱికి క్రొంగ్రొత్త. అమూల్యములగు నీ నాయక రత్నములను పుస్తకరూపముగ ప్రకాశింపఁజేసిన శ్రీ మహాదేవదేశాయి యెంతయు ధన్యుఁడు.

ఆంగ్లములోను-హిందీయందును శ్రీ మహాదేవ దేశాయి వెలయించిన ఈ చరిత్రమును ఎన్నఁడో పరికించితిని. నాయదృష్టమునఁ గాఁబోలు—ఇంత దనుక నియ్యది తెలుఁగున రాలేదని తెలిసికొని మిక్కిలి ఆనందము నొంది తోడ్తో అనువాదమునకుఁ గడంగితిని. అనువాదము జరుగు తఱిని ఖాన్‌సోదరుల జీవితమున కొన్ని మార్పులు వెలువడినవి. చదువరు లీ చరిత్రమును సాకల్యముగఁ జదివిన పిదప ప్రధానముగఁ బరికింపఁ దగ్గ అంశములు కొన్ని అనుసంధించితిని.

గాంధిమహాశయుని రాజకీయవ్యూహమునఁజేసి యావత్ప్రపంచ మబ్బురమందునటుల 'కాంగ్రెసు' నాయకులు ప్రభుత్వ పీఠముల కెక్కిరి. మనదేశమం దిట్టి సుకృత విశేషము కేవలము ఆఱు రాష్ట్రములకు మాత్రమే తొలుత చిక్కినది. అట్టి తఱి అయాచిత

ముగనే రాజప్రతినిధి ఒక్కనాఁడు మహాత్ముని రావించుకొని మంత్రి వర్గము నలిపెను. అద్దాన అప్పుడప్పుడే 'అబ్దుల్ గఫూర్ ఖాన్ సాహేబు' నకు స్వరాష్ట్రమగు 'సరిహద్దు' * నకుఁ బోవ స్వాతంత్ర్యము కలిగినది. అదే యదనున సరిహద్దురాష్ట్రములో అప్పటి మంత్రివర్గము కాంగ్రెసు—తాకిడికి ఉఱ్ఱూఁతలూఁగి చావుబ్రదుకులలోఁ దేలి పోవసాగెను. గఫూరు, జన్మభూమినిఁ గాలు పెట్టినతోడనె ఆ అమాత్యమండలి అదృశ్యమాయెను. నేఁడు సరిహద్దురాష్ట్రమునకు ప్రధాన సచివుఁడు డాక్టరు ఖాన్ సాహేబు. తక్కిన ఆఱు రాష్ట్రములతోపాటు—ఈ రాష్ట్రముకూడ త్యాగమూర్తుల అధ్వర్యమునకు తేఁబడినదను భాగ్యము ఈ ఖాన్ సోదరులకుఁ దక్కినది.

నేఁడు—ఈ సోదరుల సాంసారిక విషయములలో పెక్కు మార్పులు పొడమినవి. గఫూర్ ఖాన్ తనయుఁడు చదువు ముగియక మున్నె అమెరికానుండి అరుదెంచెను. ఖాన్ సాహేబుపుత్రునకు, సోఫియాసోమ్జీ (పరవనిత) ధర్మపత్ని ఆయెను. పై పరామరిక చాలమి ఈ అన్నదమ్ముల పంటచేలు బొత్తిగా పాడువడెను. తొంటి భాగ్యభోగ్యము లన్నియు సన్నగిల్లినవి.

ఇంతకుమున్ను ఖాన్ సాహేబు రెండువత్సరములకు హెచ్చుగ భారతశాసనసభలో సభ్యుఁడుగనుండి రాజకీయములలో రాణింపఁ జొచ్చెను. అపుడు భారతశాసనసభలో కర్షకపక్షమున కీతఁడధ్యక్షుఁడు. తెలుఁగునేలకు దీప్తితెచ్చిన 'ఆచార్య రంగ' మున్నగు నాయకులతోఁ గలసిమెలసి కర్షకులకుఁ గావలయు ప్రధానాంశముల నేమరక మిక్కిలి పాటుపడినాఁడు. ప్రధానామాత్యుఁడయి ప్రథమో

* పశ్చిమోత్తర సరిహద్దు రాష్ట్రమునకే 'సరిహద్దు రాష్ట్రమ'ని యీ గ్రంథమున వ్యవహారము.

అనువాదకుఁడు

పన్యాసమంచె 'రైతుజనసేవయే నా విధి' యని ముచ్చటించి నాఁడు.


1936—నుండి ఖాన్‌సాహేబు; 1936 డిసెంబరునుండి అబ్దుల్ గఫూరు'ను 'కాంగ్రెస్-వర్కింగ్ కమిటీ' సభ్యులయిరి. ఒకతూరి పెక్కుమంది కావలయునని పట్టుపట్టినను, 'కాంగ్రెసు-ప్రెసిడెంటు' పదవి తనకు వలదని గఫూర్ నిరాకరించినాఁడు.

వీరి సర్వతోముఖమగు ప్రతిభ—అద్భుతమగు నిర్మాణకార్య క్రమము—అనుస్యూతమగు దేశసేవ—అనుపమానమగు దైవచింత—అకుంఠితమగు సత్ప్రవర్తన—అమేయమగు క్రమశిక్షణ మున్నగు విశిష్ట గుణములు పెక్కులు ఇందు సవిశేషముగ చిత్రింపఁబడ్డవి. నేషనల్-కాంగ్రెసువృత్తాంతములతోపాటు త్యాగమూర్తుల ఉదంతమును గుర్తింపవలెనని ఉవ్విళులూరు నా తెలుఁగు సోదరులకు ఎఱుకపడుట కయి యిది అనువదించితిని. మూలగ్రంథములు రెండింటను ఒండొండ అలంతిమార్పులు కొన్నికొన్ని కానిపించినవి. అట్టిపట్టుల నాకు ఉచితమని తోఁచినట్టులే అనువాదమునకుఁ గడంగితిని.

ఇది అనువదించి ఈ తీరు తెచ్చుటలో నా శ్రమము వ్యయము మాట యెటులున్నను, అనువాదమున—ఇయ్యెడ నాకు చాలఁగా సాయపడిన నామిత్రుఁడు శ్రీ మల్లంపాటి మధుసూదనప్రసాదునకు విశేషించి ముమ్మొదట కృతజ్ఞత చూపనింతు. అడిగినదే తడవుగ అనువాదమునకు అనుమతియొసఁగి ఈకృషికి తోడుపడిన 'హిందూస్తాన్ టైమ్స్-డిల్లీ' వారి ఉపకృతి మఱువరానిది.

బహుధాన్య-ఉగాది
అమృతలూరు

కొత్త సత్యనారాయణ చౌదరి



శ్రీ ప్రొఫెసర్ యన్. జి. రంగ, బి-లిట్ (ఆక్స్‌ఫర్డ్)
యమ్. యల్. ఏ. (సెంట్రల్)
అఖిలభారత 'కిసాన్' సంఘ అధ్యక్షులు.

తెలుఁగునేలలో కలిగి ఉన్నతవిద్యలో
మెలఁగి దేశసేవలో మునిఁగి అఖిలభారత
విఖ్యాతి అందనేర్చిన నా తెలుఁగు
నాయకుఁడు

శ్రీ

ప్రొఫెసరు


**రంగనాయకులకు**

సగౌరవ సమర్పితము


సత్యనారాయణ చౌదరి

# వి ష య సూ చి


| | | | | |
|---|---|---|---|---|
| | | | | పుట |
| ౧ | సరిహద్దురాష్ట్రము | .... | .... | ౧ |
| ౨ | జననము—జననీ జనకులు | ... | .... | ౬ |
| ౩ | తొలిరోజులు | .... | .... | ౧౩ |
| ౪ | మతధోరణి | .... | .... | ౨౭ |
| ౫ | ఖుదాయీఖిద్‌మత్‌గారులు | ... | .... | ౩౭ |
| ౬ | దోషారోపణము—సత్యము | .... | .... | ౪౨ |
| ౭ | ఆంగ్లేయులు ఎఱుంగవలసినది | ... | ... | ౪౭ |
| ౮ | ఇంటెల్లపాది జైలులో | .... | ... | ౫౯ |
| ౯ | అన్నదమ్ముల విశిష్టగుణములు | ... | ... | ౬౬ |
| ౧౦ | మరల అసలు ఇంటిలో | ... | ... | ౭౪ |



ఖాన అబ్దుల్ గఫూర్‌ఖాన్, ఢా. ఖాన్‌సాహేబు



ఆఫ్గనిస్తాన్
చిత్రాల్
కాశ్మీర్
పెషావరు
అటక్
కోహాట్
బన్నూ
సరిహద్దు రాష్ట్రము
K. Brahmaiah

౧

# సరిహద్దు రాష్ట్రము

భారతవర్షమున పదునైదేండ్లనుండియు సాగుచున్న స్వరాజ్య సంపాదనాసంరంభము పెక్కు విషయములలో భూకంపమువంటి దనవచ్చును. అహింసాత్మకము కావుటను తొలిదానిలో మలిదానిలోని తీవ్రలక్షణములు కానరావు. కాని, భూకంపము భూమండలమును ఉఱ్ఱూఁత లూఁగించుతీరుగ, ఈ యుద్యమము జాతీయతామూలబంధమును గదలించివైచినది. తొలినాఁటి అపోహములు - అధికారమదాంధతలు నిశ్శేషముగ తొలఁగింపఁబడి నేలమట్టము కాకపోయినను, భూకంపముమూలమున ప్రకృతివైఖరి మారునటులు రాజకీయ దృక్పథము చాలవఱకు మారిపోయినది.

ఇరువదేండ్లనాఁడు జలియన్‌వాలాబాగ్ - బార్డోలీ - చౌరీచౌరాలను గూర్చి యెవ్వరెఱుంగుదురు ? చీరాలపేరాల - వేదారణ్యము - బోర్సద్ వీని యుదంత మెవ్వారి కెఱుక ? దండి - దర్సన- వడాల వృత్తాంతములను అచ్చటివారు - ఏ కొలఁదిమందియో తక్క తక్కినవా రేమెఱుంగుదురు ? భారతదేశస్వాతంత్ర్య సంగ్రామమునుగూర్చి చిత్రించు భావిచరిత్రకారునకు పైని పేర్కొన్న ప్రదేశములేకాక వక్ష్యమాణములు సయితము భూగోళపటములో అవి ఉన్నను లేకున్నను ఎంతో ప్రాముఖ్యము గోచరింపఁజేయును.

ఇఱువదేండ్లనాఁడు వానికే అంతఁగా ప్రాముఖ్యము లేనప్పుడు మొన్న 1930 లో మన కన్నుల యెదుటపడి, నాఁటినుండి మన మెఱింగినవి ఎఱుంగనివి ఎన్నో సంఘటనల మూలమున పొడుచు కొని వచ్చుదాఁక ఆ సరిహద్దురాష్ట్రమునకు మాత్రము ఏమి ప్రాముఖ్యము వచ్చియుండును ? మనవారిలో పత్త్రికాపాఠకులు - ఏకొలఁది మందికో సరిహద్దురాష్ట్రమునుగూర్చి స్పష్టపఱుపలేని తలంపులు కలవు. అందును ఆ రాష్ట్రము వాయవ్యమున ఆకసముమీఁది ఎఱ్ఱని మచ్చవోలె కన్పట్టును. దానిగూఱిచి ఏ తీరువర్ణనలు వచ్చినను రష్యా విషయమయి ఆంగ్లేయులు పడ్డ భయములు స్మృతికిఁ దవులుచుండును. సరిహద్దుజాతులపై శిక్షణార్థమై వెడలెడి దండయాత్రలనుగూర్చి బ్రిటీషువాని వర్ణనము చదువునపుడు చరిత్ర చదివెడి విద్యార్థికి కన్ను పొడుచుకొన్నను సత్యము కానరాదు. ఆ దండయాత్రలలోఁ గొన్ని క్లిష్టపరిస్థితులలో సరిహద్దుజాతులు తమ చెప్పుచేఁతలలో మెలఁగుటకయి వారికి కొంతవట్టు బ్రిటీషువారు సొమ్ము ముట్టఁజెప్పుటతో అంతమైనవి కలవు. ఎవరో ఒక మిస్ ఎల్లిస్ అను నాబిడ అపహరింపఁబడ్డదనుట అంతఁగా వ్యక్తపఱచునది కేవలము ఒక జాతియొక్క స్వభావమేగాదు ; పాలకజాతికి చెందిన వ్యక్తికి సంకటములు చుట్టుముట్టినపుడు బలిష్ఠమైన ఆ సామ్రాజ్యముయొక్క సర్వశక్తులు అందులకే వినియోగపడుననియే స్పష్టముగ చాటుచున్నది. అజ్ఞుఁడు - అనాగరికుఁడు అగు పల్లెటూరి మానిసి, సరిహద్దురాష్ట్రమని ఒక దేశము ఉన్నదనియు, అందుండి హెచ్చువడ్డీలకు సొమ్మిచ్చుచు పుచ్చుకొన్నవారిని బాధలపుచ్చు పఠాను వచ్చుననియు, ఆతఁడు అక్కటికము లేక ఎంతో వడ్డీసొమ్ము రాలఁగొట్టి అదే పోతగా పోయి మరల ఏరికిఁ జిక్కఁడనియు - ఇంతవఱకే యెఱుంగును.

కాని 1930 - ఆ తరువాతి సంవత్సరములలో ఉద్యమము చూపట్టినపుడు తక్కిన రాష్ట్రాలవారువలె తత్రత్యులును స్వరాజ్యమే తమ జన్మ - హక్కని గుఱుతింపఁగలిగినారు. తత్ఫలితముగ వారు అందఱికన్న మిక్కిలియు కష్టాలలో చిక్కుకొనిరి. ఖాను అబ్దుల్ గఫూర్ ఖాను - ఆతని అనుయాయులును ముమ్మొదట పదిమందికిఁ దెలిసినది 1931 లో కరాచీలో కాంగ్రెసు జరిగినపుడు. నిరాడంబరుఁడు - అమాయకోపి - భీమకాయుఁడు అగు పఠాను అహింసాదీక్ష వూనిన ఒక సంస్థకు చెందవచ్చుననియు, రెచ్చఁగొట్టు పట్టులలోను దౌర్జన్యరహితములగు చర్యలే చూపఁగలఁడనియు అనుట ఒక గొప్ప దివ్యమైన రహస్యోద్ఘాటనము. చిచ్చులో చేతులుపెట్టి అంతయు కాలునందాఁక అట్టె వెలికిఁదీయని సాహసగుణము స్పష్టపఱుపఁజాలు రోమన్ వీరుని యితివృత్తమును తలఁపులో పెట్టు పఠానువీరుల పరమసాహసగాథలను పెక్కింటిని జదివియుంటిమి.

ఒకతూరి పఠానుచోరుఁ డొక్కరుఁడు ఒకయింటఁ గన్నము వైచెను. అదే అదనున యజమానుఁడు మేలుకని కన్నములో చేతిని అట్టె పట్టుకొని వారా పీరా అని పెద్ద కేకలుపెట్టెను. తోడ్తో - ఆ పఠాను పట్టుపడుట రోఁతగా నెంచి తనచేతిని దానే త్రుంచివైచి ఆ మొండెము- ఆ గేస్తున కొసఁగి ఆతని కచ్చెరువు కలిగించి అదృశ్యుఁడాయెను !

పెక్కురు పఠానులు పాల్గొన్న 'సత్యాగ్రహ సంగ్రామము' సయితము, వారి ధైర్యసాహసాదికములను బెక్కింటి నిట్టివానిని ప్రకటించుట యెఱుంగుదుము; అయితే వీనియెడ మహోన్నతములగు నాదర్శము లుండుట మఱువరాదు. ఖాన్ సోదరుల జ్ఞాతి

బృందములోని, 'హాజీ శాహనవాజ్ ఖాన్' అను నాతఁడు జామీను సెక్షన్ క్రింద 1930 లో నిర్బంధింపఁబడెను. ఇంటి యిక్కట్టులనుబట్టి యాతఁడు ధరావత్తు చెల్లించి విడుదల కావలసివచ్చెను. ఆ యిక్కట్టు లెట్టివైనను - ఆతఁడీ తీరుగ విడుదల యగుట యాతని సన్నిహితులలో నొక్కనికిని రుచింపదాయెను. మీఁదుమిక్కిలి అట్టి సెక్షను నిరాకరించి తిఱుగ కారాగారమునఁ జేరుటయ విధ్యుక్తమని సలహా లొసంగిరి. అతఁడంతటఁ గొంతతడ వాలోచించెను:—తా నంతకు మున్ను విడుదలయయి కుటుంబమునకుఁ దెచ్చిన మచ్చను రద్దుసేయవలెనన్న మఱల చెఱలోఁ జొచ్చినంతమాత్రానఁ జాలదనియు, ఆత్మహత్యయే యద్దోసఁగునకుఁ దగ్గ శిక్షయనియు నెంచి, యదియే యొక కాగితమున వ్రాసియుంచి యేకాంతమున అసువులు పాసెను. సరిహద్దు రాష్ట్రములో బ్రిటీషు- పరగణాలలోఁ గాక, 'మాల్కండ్-ఏజన్సీ' ప్రాంతమునఁ గాఁపురముండువాఁడును- మతోపదేష్టయు - జమీందారును - ప్రధాననాయకుఁడు నగు 'సయ్యద్ - అబ్దుల్ - వాదూద్ బాదుషా' అను నతఁడు - ఆ సెక్షన్ మూలముననే మూఁడేండ్లు కారాగారమునఁ జేరవలసివచ్చెను. 1931 వ, యేఁట తాత్కాలిక సంధిసమయమున నయిత మాతఁడు విడుగరకు నోఁచుకొనఁడయ్యె. ముప్పున నొచ్చియున్న యాతని తండ్రి, తన యసువులు రాలిపోకమున్ను, ఒకతూటి తనయునిఁజూడ ఉబలాటపడి ధరావత్తు చెల్లించివైచెను. తన విడుదలకై తండ్రి యొనర్చిన విధానమునకు తనయుఁ డెంతో ఉగ్రుఁడయ్యె. ఇట్టిది ఘోర పరాభవమని యాతఁడెంచి యది సైఁపఁజాలక, తండ్రి తల్లడిల్లుననియైనఁ దలంపక అప్పుడే కాల్చుకొని చచ్చిపోయె.

ఇట్టి వీరాధివీరులను వెలయింపఁజాలు అకుంఠిత ధైర్యము కల యీ జాతినిగూర్చి, యితోధికముగాఁ దెలిసికొనుట కెవ్వరు నువ్విళ్లు

లూరరు ? స్టేట్ ఖైదీలుగా నయి, హజారీబాగ్ జైలునుండి
యిటీవల విడుదలనెందిన **ఖా**న్ సోదరుల యనుపమానమగు నత్యంత
పరిచయ సౌభాగ్యమును దక్కించుకోఁగలిగితిని ; తన్మూలమున
వారి ప్రకృతి చిత్రమును సమగ్రముగ గుఱుతింపఁజాలితిని. ఇట్టి
పరిచయభాగ్యమే వీరియెడ నా కంతకుమున్న వెలసిన మక్కువను
పెంపొందింపఁజేసినది. వారి జీవితములోని విశేషాంశములు **గుఱు**
తింపను నా వేయు ప్రశ్నములకు వారు చక్కఁగా నవకాశ మొసఁ
గిరి. విస్మయానందములలో నన్ను ముంచివైచిన వారి కథలలో నొక
కొన్నియంశములనైన పాఠకుల కెఱుకపఱచి, యా యానందము
పంచి యీయక తీరదు. ఈ సోదరులు కారాగార విముక్తి
నొందియు సరిహద్దురాష్ట్రము చొఱరాదను దొరతనమువారి
యాంక్ష జగమెఱిఁగినదే. నాకుఁ దోడుగ చదువరులు సయిత మీ
చరిత్రను జదివినపిదప దొరతనపుఁ జేఁతల కబ్బురమందక మానరు.

౨

# జననము—జననీజనకులు

కనిష్ఠ సోదరుఁడగు గఫూర్ ఖాన్ నాతో నిటులనియె:—'నేను పుట్టిన యేఁడు మాత్రమే నాకు గుఱుతు. చాంద్రమాన ప్రకారము జ్యేష్ఠమున నా జన్మమని తెలియునుగాని నేఁటిరీతిగ తేదీలు తెలియనేరవు.

'జ్యేష్ఠమా!' అయినచో నయ్యది మాకును గలదే అని ఆశ్చర్య చకితుఁడనయి యంటిని.

ఖాన్ సోదరులు:—'ఔనౌను, జ్యేష్ఠమే. మీలోను మాలోను మనకుఁ దెలిసినవానికన్నఁ దక్కినవి పెక్కింట సమానత్వము కద్దు; ఆచారవ్యవహారములు-రీతిరివాజులు మీకునుమాకును ఐక్యము తేఁగలవు. అదియటుండె. అన్నింటికన్న ముఖ్యముగ శతాబ్దులనుండి మా ప్రాంతమున బౌద్ధమతము ప్రచుర ప్రచారమున నుండెననుట మఱువరానిది. బౌద్ధకాలికములగు వన్నెచిన్నెలకు మా జిల్లా పెట్టినది పేరు. కొన్ని యూళ్లపేరులు, హైందవులకు బౌద్ధులకు అంకితమై ఒప్పియున్నవి. 'పశ్తో-' అను మాబాసలో పెక్కు శబ్దములు సంస్కృతము నుండియే సంగ్రహింపఁబడ్డవి'.

అన్నగారగు డాక్టరు ఖాన్సాహేబు 1883 లోను, తమ్ముఁడు ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్ 1890 లోను జన్మించిరి. వీరిది ఖాన్ కుటుంబము; అది ముహమ్మద్జయిజాతికిఁ జేరినది.. 'జయి' అనుటకు శబ్దార్థము పుట్టుట. అది వంశద్యోతకము, ఖాన్శబ్దమునకు నాయకుఁడని యర్థము; 'సరిహద్దు'లోని జాతులన్నియు పూర్వపురుషుల నామధేయములను బట్టియే వెలసియున్నవి.

ఖాన్ సోదరుల తండ్రియగు ఖాన్‌సాహేబ్ బెహరాంఖాన్-'ఉత్మాంజయి' అను ఊరికిఁ బెద్ద. ఆ ఊరు పెషావరు జిల్లాలోని చెరసద్దా తాలూకాకుఁ జేరియున్నది. పెషావరునుండి చెరసద్దాకు ఇరువది మైళ్ల దూరము. చెరసద్దాకు రెండు మైళ్లలో స్వాత్ నదీ తీరాన రమణీయమైన చోట ఉత్మాంజయి గ్రామ మున్నది. దీనికి పశ్చిమముగ సుమారు- ఇరువది మైళ్లవఱకు 'మోహమండ్' జాతుల ఆవాసస్థానములు కలవు. ఆఫ్గనిస్థానము పోవలెనన్న నదే త్రోవ. ఇట్టి వాతావరణమున పుట్టి పెరిగిన ఖాన్‌సోదరులు స్వాభావికముగనే ప్రకృతిని ప్రేమించువారైరి. నవనాగరికతకు ఆయువు పట్టగు పట్టణములన్న వారికిఁ గిట్టవు; అయితే, అందు అగ్రజుఁడు డాక్టరు ఖాన్‌సాహేబు చదువులలోఁ జాలభాగము ఇంగ్లాండులోనే జరపినాఁడనియు, దరిదాపు పదియునొక్కేండ్లు విదేశములలోఁ గడపినాఁడనియు మరువఁ గూడని మాట. మా సంభాషణలోఁ దఱచుగ, ఆ కొండలు- ఆ యేఱు—ఆ చిన్న ద్వీపము వైపునకే వారి ధ్యానము పరువెత్తెడిది. అక్కడ ఒక విధమైన చిన్న యాశ్రమమును నెలకొల్పిరి. ఏనాఁటికైన గాంధిజీని అచ్చోటికిఁ దమ యతిథిగాఁ దీసికొని వెళ్లవలయునని వారి యుబలాటము. ఒకతూరి మహాత్మునితో వారిటులనిరి:—'మహాత్మాజీ, మీ ఆశ్రమము అక్కడనే ఉండవలెను. దానికన్న రమణీయము ప్రశాంతమునగు వాతావరణము మఱెక్కడనుండ నేరదని మేమనుకొందుము. పెషావరు కొండ చఱియలలో పెక్కురకములగు పండ్లు దండిగ ఉండును. అట మీ శరీరపు తూకముకూడ తప్పక హెచ్చునని మాతలంపు'. వారు, తమ చెఱకుఁ దోఁటలు, ఆవులు, గేదెలు, శ్రేష్ఠమగు మీఁగడపాలు-వీనిఁగూర్చి హెచ్చుగఁ జర్చింతురు. అచ్చోట ఆవుపాలు ప్రత్యేకముగ వెన్నకును గేదెపాలు తక్కిన వన్నింటికిని వాడఁబడుచుండును. కాని

నేఁడా తోఁటలు దొడ్లు ఎక్కడ నున్నవో వాని స్థితి యెట్లున్నదో మేమెఱుంగమని నిట్టూర్చి పలికిరి. ఆ నిట్టూర్పులు తెలియఁ బుచ్చునది వారి ఓటమినిగాని నిరాశనుగాని కాదు; బందీ కృతుఁడగు ప్రతి మనుజుఁడును అత్యంతము స్వాభావికముగఁ జూపఁజాలు అభిజన సంమోహామే.

కాని, మనము ప్రస్తావించునది వారి తండ్రిగారి కథ. ఆ అన్నదమ్ములు తమ తండ్రిగారినిగూర్చి నాకు వినిపించినపుడు తోడనే 'పటేలు' సోదరుల తండ్రి వైఖరి తలంపునకు వచ్చినది. పటేలు సోదరులయు, ఖాన్ సోదరులయు తండ్రు లిరువురును మతాభిమానులు. ఇద్దఱు తొంబదియేండ్లకు పైఁగా బ్రతికిరి. బిడ్డల పెంపకములో నిర్వురు దాదాపొకటియే. ఇదియే వీరిలోఁగల పోలిక. పటేలు సోదరు లొకవిధముగ సంపూర్ణమగు స్వయంశక్తిచే ఉన్నతికి వచ్చిరి. ఖాన్ సోదరుల అభ్యుదయము అట్టిదే యని చెప్పఁజాలము. ఖాన్ సోదరుల తండ్రి జమీందారీతరహాగా ఒకయూరికంతకు పెద్ద. బిడ్డ నింగ్లాండు పంపుటకు చాలినంత సొమ్ము ఆతనికడఁ గలదు. పటేలు సోదరుల మాట చూతమా, తమంత తామె చదువు సంధ్యలకోసము చూచుకోవలెను. పటేలు సోదరుల తండ్రి, సంసారి యనుటకంటె ఒకవిధముగ సన్న్యాసి యనియే యనవలయు. ఖాన్ సోదరుల తండ్రి ప్రకృతి అట్టిది కాదు; ఏమందురా! ఎనుబదవ యేఁడు దాఁటిన పిదప 1919 లో ఆతని కడగొట్టు బిడ్డను సర్కారువారు పట్టఁగా తత్‌క్షణమె తానుగూడ జైలుకే సిద్ధమయ్యెను.

'ప్రకృష్టమగు ఆధ్యాత్మిక తత్త్వమున, మా మాతాపితలు ఆదర్శకభూతులని మాచిత్తమున హత్తుకొనిపోయినది. ఇరువురకు బడిలోని వ్రాఁతకూఁతల చదువులు లేనేలేవు. వారి జీవితము భౌతికమున

కన్న ఆధ్యాత్మికమున హెచ్చుగ మొగ్గియుండును. సమాజు ముగిసిన పిదపఁ దలఁచుగ మా అమ్మ నిశ్చలచిత్తయయి ప్రశాంతముగఁ గూరుచుండి ధ్యానమగ్న యయ్యెడిది. అంతటి దైవచింతగల వ్యక్తులను నే నెన్నఁడు చూచియుండలేదు.

ఇఁక మాతండ్రికి ఆయన జీవితములో ఎంద కెండలో మిత్రులే తప్ప శత్రువు ఒక్కఁడును ఏరుపడలేదు. పేరెందులకుఁగాని, అసలు మాసన్నిహితులలోనే, నా కత్యంత ముఖ్యమగు బంధుకోటిలోనే పెక్కుమంది శత్రువులు కలరు; వారు వ్యవహారముల పట్ల మాతండ్రి యెడ అపచార మొనర్చి కడకు గుర్తించి పశ్చాత్తాపతప్తులయి యాయన హితాభిలాషులలో ముఖ్యులుగా మారిపోయిరి. అసలు, పగతీర్చుకొనుట యన్నదే యాయనకు సరిక్రొత్త. మోసగించుటయే అమర్యాదగాని, మోసగింపఁబడుట కాదని యాయనకు గట్టి నమ్మకము. ఆయనమాటలలో నిజాయితీ కలదు; కిట్టనివారు సయిత మాయనను నమ్మకపోవుట లేదు; ఆయన చెప్పినది కాదనఁగల సాహసము వారికి మొదలే లేదు. వందల తరబడి జనము- ఆయనయొద్ద ధనము దాఁచుకొని దానికెన్నఁడు 'రసీదు' అను మాటయే యెత్తెడివారు కాదు; ఆయనఖాతా యెన్నఁడు మునిఁగిపోవదని వారికిఁ దెలియును. ఆయన యేనాఁడును అధికారుల ప్రాపకములకై యిచ్చకములు పలికి తిరిగినది లేదు. ఎంతగొప్ప యుద్యోగికిని ఆయన యన్నచో అడలు. పెద్దపెద్ద బ్రిటీషు-ఉద్యోగులుకూడ 'బాబూ' అని పిలుచుటయేగాదు—ఆయనకసమ్మతమగు పని చేయవలసిన పట్ల చాలఁగా సంకోచపడెడివారు.'

ఆయన యెందాఁక బ్రతికెను? మన స్వాతంత్ర్య సమరములో ఆయన యభిరుచి యెట్టిది—అని నేనడిగితిని.

'1926 లో తొంబదియైదవయేఁట ఆయన పరమపదించెను. స్వాతంత్ర్యసంగ్రామములోని అభిప్రాయ మాయన గుర్తించినాఁడని యనఁజాలను గాని, సర్వతో ముఖముగ సంస్కారపక్షపాతి యని ఘంటాపథముగఁ జెప్పవచ్చును. ఆరోజులలో మౌల్వీలు—ముల్లాలు ఆధునిక పాఠశాలలకు పిల్లలను బంపు ప్రజలను కొఱకొఱ చూచెడి వారు. ఈయన కా జోలియే లేదు. పదపడి రౌలట్ చట్టపు టాందోళన వచ్చిపడఁగా నే నందుఁ జొచ్చితిని. తత్ఫలితముగ తత్క్షణమే నాకు జైలు తయారు. ఏప్రియల్-6వ తేదిని ఉత్మాంజయీ గ్రామమున పెద్దసభ జరిగెను. లక్షకుపైఁగా జనము వచ్చి కూరుచుండిరి. అందు మా తండ్రియు హాజరు. నన్నుఁ బట్టినపిదప మఱి కొందఱినిగూడ ఇందులో ఇఱికింప వ్యూహములు వెడలినవి. పక్షము రోజులదాఁక నాయునికి యెక్కడున్నది ప్రభుత్వము తెలియనీయ లేదు. పిదప ముఖ్యుఁడగు ఒకపోలీసు- ఆఫీసరు రాయబారము పూని ముదుసలియగు మాతండ్రియొద్దకు వచ్చెను. వచ్చి 'బాద్‌శాహు'* ను జంపివేసెదరు' అని మాతండ్రిని బెదరింపఁజొచ్చెను.'

బాద్‌శాహునా? అని నేను ప్రశ్నించితిని.

అవును, నేనే ఆ సమయమున బాద్‌శాహను. నన్ను అట్లని లోకము పిలిచెడిది—అని గఫూర్ ఖాన్ ముసిముసినవ్వుతో ప్రత్యుత్తరించెను.

ఈ విషయము యూదుల చక్రవర్తిని దలపించుచున్నదని నేనంటిని.

'ఇది మీ ప్రేమ పూర్వకమగు మంచిమాట లెండు. సరే! నాకుఁ గఠినశిక్ష విధించెదమను బెదరింపుతో మా తండ్రిని గడ గడ లాడించుటయే వారి కోరికయై యుండును.'

* బాద్‌శాహ్ - చక్రవర్తి.

అయితే, తుద కేమయ్యెను?

కుటుంబములో పెక్కురతోపాటు మా తండ్రియు జైలు త్రొక్కవలసివచ్చెను.

వార్ధకములో ఈ నిర్బంధము ఆయన నెంత కలవర పెట్టినదో?

లేదు, లేదు. పట్టువడి నావద్దకే వచ్చుటవలన ఆయన యెంతో ఆనంద మందినాఁడు. అపుడే ఆయననోటనుండి హఠాత్తుగ నీ మాట వెలువడినది.—'నను నిర్బంధించుట యెంతో సంతోషవిషయము ; ఇది యిట్టిది కాదేని ఎన్నేండ్లకో నినుఁజూచుట ! ఏరి కెఱుక ? '

ఆయన జైలులో నున్నది యెన్నాళ్ళు?

ఇంచు మించు మూఁడు మాసాలకుపైఁగా. అంతే సర్ జార్జి రూస్ కేపల్ అను నతఁడు పఠానులను సంతృప్తిపఱచి వారిని వశ్యులుగఁ జేసికొను పంథ త్రొక్కియుండుటచే నేనుగూడ ఆఱు నెలలకు మించి జైలులో నుండలేదు.'

ఆ వృద్ధు 1926 లో దేహము చాలించెను. ఆయన జన్మించిన దెన్నఁడో వారికిఁ దెలియదు. ఆయన ప్రాయము శతమానమునకు మించకపోయినను సుమారు అంతకు రావచ్చునని వారి యూహ. ఏమందురా! తండ్రి యిదమిత్థమని తెలియఁజేయలేకపోవచ్చును; గాని ఆయనకు 1857 వ నాఁటి సిపాయి కలహముగూర్చి చక్కగా గుర్తు కలదు. అప్పు డాయనకు నిండు జవ్వనము. అట్టి విషమపరిస్థితులలో పఠానుల ప్రవర్తనము అంతగా శ్లాఘనీయమని యాయన మన్నించి యుండలేదు. ఆ నాఁడు మా పెదతండ్రి, చెరసద్దాలో దొరతనపు ఖజానా కాఁపుదలకై యేర్పడిన సేనకు ముఖ్యనాయకుఁడయి ఆంగ్లజాతి కమూల్యమగు సేవ యొనర్చినాఁడని తండ్రిగారివలన వింటిమని ఖాన్ సోదరులు నాతో ముచ్చటించుతఱిని వారి ముఖసీమను లజ్జాసంకోచము లావరించెను.

సిగ్గుపడఁదగ్గ విషయ మిందేమున్నది ? పండిట్ మోతీలాలు, తన తండ్రి పెద తండ్రియు సిపాయి తిరుగు పాటులో ఆంగ్లేయులకు సాయము చేసిరని నాతో నుడివినటులు జ్ఞాపకము.

'ఏమైనఁగానిండు; ఆ తిరుగుపాటులో సిక్కులయు పఠానులయు ప్రవర్తన అంతఁగా నచ్చలేదు. ఆ ప్రవర్తనమే మన్నింపఁదగ్గదైనచో చరిత్ర మఱొకతీరుగ వెలసియుండెడిది.'—అని డాక్టరు ఖాను పలికెను.

ఆ రోజులే వేరు. చరిత్రప్రసిద్ధములైన యిట్టివి రెండు గొప్ప కుటుంబములు స్వాతంత్ర్య సంగ్రామమున సర్వస్వము ఆహుతి యొనర్ప ప్రతిన వూనుట యేమంత తక్కువసంగతి ?

'నిజమే ! బాగున్నది. కాని, మేమొనర్చిన పాపమునకు ప్రాయశ్చిత్తమే యున్నచో అంతకుఁ గొంతయయిన ఈ ప్రతిజ్ఞ పనికిరావచ్చును.'

జనకుని నిస్సీమమగు నౌదార్యము-కష్టసహిష్ణుత-ప్రేమపూర్వక ప్రవృత్తి పదే పదే తలపోయు ఖాన్ సోదరుల ఉత్సాహాతిరేకమును స్మరింపక ఈ అధ్యాయమును ముగింపఁజాలను. పుట్టువుఁదొట్టి ఖాన్ సోదరు లిట్టి అహింసాప్రవృత్తి నేర్చిరన్న తండ్రిగారి గుణ ప్రకర్షయే అద్దానికిఁ దగ్గ కారణము.

# 3

## తొలిరోజులు

ఇఁక నీ సోదరుల బాల్యదశను జూతము. అజ్ఞానాంధకారబంధురమైన ఆ మాఱుమూలదేశములో ఈ సోదరు లే తీరుగ విద్యావ్యాసంగ మొనర్చిరో, వీ రెట్లు స్వాతంత్ర్యసంగ్రామములోఁ జొఱఁబడిరో యెఱుంగుట కెంతో యువ్విళులూరితిని.

అబ్దుల్ గఫూర్—ఇటులనియె:—'మా ప్రాంతాలలో విద్యావ్యాసంగ మెటులు నిషేధింపఁబడెనో చెప్పియుంటిని. మసీదు బడులలో మౌల్వీలు, కురాను పఠించునపుడే లౌకిక విషయములలోఁ గూడ కొంత జ్ఞానము కలిగెడిది. కాని, ఆంగ్లేయు లరుదెంచిన పిదప ఆ బడులకు బదులుగ మఱికొన్ని 'స్కూళ్లు' వెలసినవి. అవి యున్నచో చాలమందికి కంటకముగా నుండుట కద్దు. అయితే, మా తండ్రిగారి కా పట్టింపులేదు. కావుననే పెషావరు-మిషన్ స్కూలులో మమ్ములను జదువవేసెను. అన్నగారు పంజాబు యూనివర్సిటీలో మెట్రికులేషన్ పరీక్ష యిచ్చి యేఁడాదిపాటు బొంబాయి గ్రాంటు మెడికల్ కాలేజిలోఁ జదివి డాక్టరు పరీక్షకై యింగ్లాండు వెళ్లిరి. అన్నగారి యీ యింగ్లాండు పయనము కులమువారిలో ఒకవిధమగు ఎద్దడి తెచ్చిపెట్టినది. ఆయన తప్పక క్రైస్తవమతములోఁ గలసిపోవుననియు, యావజ్జీవ మాదేశమందే ఆయన ఉండిపోవచ్చుననియు, ఆంగ్లకన్యను పెండ్లాడవచ్చుననియు వారందఱి భీతి. మా జనకుఁడు మాత్రము ఉదార హృదయుఁడు కావుటను తన బిడ్డ చదువుసంధ్యల కడ్డుపడనని గట్టిగఁ జెప్పివైచెను. దురదృష్టవశ

మున నేను 'మెట్రిక్యులేషన్ నెగ్గలేనయితిని. ననుఁగూడ ఇంగ్లాండు పంపుటా అను ప్రసక్తి వచ్చినది. నిస్సందేహముగా నేను సీమ చేరి యుండెడివాఁడనే; కాని యపుడే మా కుటుంబములో ఇర్వురు మువ్వురు చనిపోవుటవలన ఉన్నతవిద్యకోసమయి నాతలంచిన విదేశగమనము అశుభముగా భావింపఁబడియె. మూఢనమ్మకముల వల్లను గృహచ్ఛిద్రముల మూలమునను ముఖ్యమైన ఆ రెండేండ్లు అట్టే వమ్మైనవి. ఇంతలో మా అన్నగారి ఆంగ్లయువతీవివాహ వార్త రూఢియని తేలఁగానే నా యింగ్లాండుపయనపుమాట అంత టితో అంతరించినది. నాఁటితో నా విద్యావ్యాసంగమునకే స్వస్తి చెప్పఁబడ్డది.'

తమ్ముఁడు మిషన్ స్కూలులోఁ జదివినది తక్కువకాలమే అయినను దాని ఫలితము చూపకపోలేదు. అపుడు ఆ స్కూలుకు ప్రిన్సిపాలు రెవరెండ్ విగ్రామ్. ఆతఁడన్న శిష్యులెంతో మక్కువ చూపుటకు ఆతని పవిత్రచరిత్రము-ఆత్మత్యాగము కారణములు. ఈ సోదరు లిర్వురును నేఁటికిని బద్ధశ్రద్ధతో నాతనిని పదేపదే తల పోసెదరు. తన ప్రిన్సిపాలు తాను నమ్మిన మతవిషయములో ఏ తీరుగ దీక్షవూనెనో అట్లే తానుగూడ జాతీయ సేవలో మునిఁగి తీరవలెనని అబ్దుల్ గఫూర్ అభినివేశము. ఇంగ్లాండుపయనము మాట కట్టిపెట్టుటకు పూర్వము తాను జాతీయ సేవలో చొచ్చుటకు మునిముందు సేనలోఁజేరి సైనికునిగాఁ బేరువొందవలెనని గట్టిగా తలపోసెను. వస్తుతః ఈతఁడు పఠానువంశసంజాతుఁడు కావు టను, సంపన్నకుటుంబములోనివాఁడు అగుటను సేవలోఁజేర నీతఁ డంపుకొన్న దరఖాస్తు మంజూ రయినది. 'మిల్టరీ రేంకును'గూర్చి ఖాన్ సాహేబు ఆశయమిది—'అందులో వ్యామోహమన్నది లేక పోలేదు. మహోన్నతపదవులలో వెలయు పెక్కుమందితో నాకు

పరిచితి కలదు. వారిని గాంచినప్పుడు నేనుగూడ ఆంగ్లేయుల కద్దిగ అనువగు పదవులలో మెలఁగుటకు అర్హుఁడ ననియే అనుకొనెడి వాఁడను. అయితే, అల్లా అన్యథా తలఁచినాఁడు. ఒకనాఁడు నేను సేనలోఁ బనిచేయు నొకానొక మిత్రునిఁజూడ నేగితిని. అదే యాదనున తక్కువ పదవిలోని యొకానొక బ్రిటీషు-ఆఫీసరువల్ల ఆ మిత్రుఁడు దుస్సహమయిన పరాభవము పాలగుట నాకనులార నేను జూచితిని. ఈదృశ్యమే మిల్టరీ జీవితమునుండి నేను వైముఖ్యము పొందుటకు కారణమయి, ననుఁ గాపాడినది. పదపడి ఒక యేఁడాది పాటు అలిఘర్‌లోఁ గడపితిని. ఇదే నా ఉర్దూభాషావ్యాసంగమునకుఁ ద్రోవచూపిన మున్మొదటి మెట్టు. మౌలానా జఫర్ ఆలీ ఖాన్ వెలువఱుచు 'జమీందారు'అను దిన పత్త్రికను, మౌలానా అబుల్ కలాం అజద్ ప్రకటించు 'అల్ హిలాల్' అను ఉర్దూవార పత్త్రికను శ్రద్ధాభక్తులతోఁ జదువసాగితిని. ఇందు రెండవది దౌర్భాగ్యవశమున యుద్ధపు రోజులలో అణఁచివేయఁబడినది. ఇవే నా రాజనీతిశిక్షకు తొలిరోజులు. 1911 నుండియు జాతీయ విద్యయన్న నాకెంతో మక్కువ. అప్పుడే మా రాష్ట్రములో జాతీయ పాఠశాలలు స్థాపించుటలో నాదే ప్రధానపాత్ర. మహాసంగ్రామము ముగిసిన పిదప మన సేవకు ప్రతిఫలముగ రౌలట్‌చట్టము దాపురించినది. దాని నడ్డుకొనుటలో మేము నిస్సందేహముగ మహాత్మాజీ ఆందోళనలోఁ జొఱఁబారితిమి. ఆ రోజులలో మా ప్రాంతమందంతటను అత్యద్భుతముగ అభూత పూర్వమైన హర్‌టాల్ జరిగినది. అప్పుడే, వెనుక చెప్పినటులు మా ఉత్‌మంజయీలో ఆ ఏప్రియల్ ఆఱవ తేదిని లక్షకుఁ దక్కువలేని మహాసభలో మా తండ్రి మూఁడు కాళ్ల ముదుసలి సయితము హాజరగుట సంభవించినది. ఇది సత్యాగ్రహోద్యమపు ప్రత్యక్షకార్య మేదియుఁ గాదు. అటులయ్యు నీ

సమావేశమే దొరతనమువారికి కొఱకొఱగా కన్పట్టినది. ఇcక వెంటనే నన్ను పట్టిరి. అయితే విచారణ యన్నది లేదు. నన్నిటులు ప్రశ్నించిరి.

'నీవు పఠానుల బాద్‌శాహవా ?

'అదేమో నాకుc దెలియదు. మా జాతికి విధేయుcడగు ఒక సేవకుcడ ననియే నాకుc దెలియును. అదిగాక యిట్టి చట్టములను మాత్రము మేమొప్పము.'

రాయబారిగా వచ్చిన 'జిర్గా' నను సమీపించి, ఎన్నో విధాల బెదరింపసాగెను; ఎన్నెన్నో కారణాలు గుదిగ్రుచ్చి నచ్చcజెప్పc దొడంగెను. అందులో ఒకటి యిది:—'మీ ప్రాంతాల జారీచేయc బడ్డ ఫ్రాంటియర్ క్రైమ్స్ రెగ్యులేషన్ - ఈ రౌలట్ చట్టమునకు ఏమైన తీసిపోవునా? అట్టిదగు రెగ్యులేషన్‌కే, పఠాను లెట్టి ఆందోళనను జేసి యెఱుంగరు. అట్టి స్థితిలో రౌలట్ చట్టమునకు, విరుద్ధమైన ఈ ఆందోళనలో మీరు చేయిపెట్టుట ఏమంత బాగుండును ? బ్రిటీషు—ఇండియా, ఈ పఠానులకోసమయి యెట్టి ఆందోళనను జరిపి సానుభూతి చూపనప్పుడు, అట్టి కృతఘ్నులయిన బ్రిటీషు—ఇండియా వారికై సానుభూతి చూపవలెనని ఉత్కంఠ పఠానుల కెందులకు?'

అయితే యీ కారణా లెవ్వియు నామీcదc బనిసేయలేదు. నేను ఇసుమంతయు చలింపలేదు. అద్దాన పెక్కుమంది మిత్రులతోపాటు నేను జైలులో దూరవలసివచ్చెను?'

తొలిసారి నీవు పట్టువడినపుడు జైలులో నిన్నెట్లు చూచిరో యెఱుంగcగోరుదునని నేనంటిని.

'అసలు నేను మామూలు ఖైదిని కాదు; గొప్ప అపాయకరుcడగు ఒక ఖైదీనcట. సంకెళ్లతో నన్ను జైలులో వైచిరి. జైలులో



డా. ఖాన్ సాహెబు, పుత్రుఁడు జాన్. ఆంగ్లపత్ని
(మహాయుద్ధములో, డా. ఖాన్ సాహేబు పనిచేయుచుండగా తీసిన చిత్రము)

ఉన్నంతవఱకు బేడీలుకూడ వేసియుంచిరి. నేఁటికన్న ఆనాఁడు నా శరీరముఉరుము రెండురెట్లు హెచ్చు. తూకము 220 పౌనులకు తగ్గదు. నాకాళ్లకు అనువయిన బేడీలు అసలు లేనేలేవు. నా కోసమే ప్రత్యేకముగఁ జేయించిరేమో నాకుఁ దెలియదు. వాని కోసము చాలఁగా శ్రమపడిరి. అవి నా కాళ్లకు, ఒత్తుకొనిపోవు టచే వేసినపుడెల్ల మడమలపైని నెత్తురు వఱదలయ్యెడిది. అది చూచినపుడు అధికారుల కేమాత్రము చింత కలిగెడిది కాదు. పైఁగా దీని కలవాటుపడుటలో నీ కెంతో కాలము పట్టదులే యని పలికెడి వారు. ఇదేమియుఁ జాలనట్లు, తీవ్రమైన మఱొక నేరములోఁ గూడ నన్నిఱికింప దుర్మార్గమగు పన్నాగము పన్నిరి. మా యూరిలో ఒక పఠానుని తంతితీఁగలు తెగనఱకెనని శిక్షించి నా యొద్దకే చేర్చి, యతనితో నీతని నెఱుంగుదువా యని ప్రశ్నించిరి. ఎఱుఁగుదునని యాతఁడని, మఱియు నీయనప్రోత్సాహమునఁ జేసియే యీ యాందోళనలోఁ జేరితినని కూడఁ జెప్పెను.

'సరే మంచిది! తంతితీగెలు నఱుకుమని కూడ నీతఁడు చెప్ప లేదా?' అని వా రనిరి.

లేదండీ యని యాతఁడు గట్టిగఁ జెప్పివైచెను.'

అయితే అప్పటికి మీ అన్నగా రేమిచేయుచున్నారని సకుతూహలముగఁ బ్రశ్నించితిని. లండనులో అప్పుడు సెంట్ థామస్ హాస్పిటలులో యమ్. ఆర్. సి. యస్..డిగ్రీని తీసికొని యుద్ధమునకు వెళ్లెనని ఆయన చెప్పెను. యుద్ధము ముగిసినపిదప సరిగా నిక్కడ ఆందోళన వెలువడిన వేళలో ఆయన ఫ్రాంసులో పనిచేయు చుండెను.ఇండియానుండి యాతని కొక్క యుత్తరము నయితము చేరదయ్యె. జన్మభూమికిఁ జేరవలెనని యాతఁడు ప్రయత్నిం

చెను గాని, ప్రయాణపు టనుమతికై 1920 లో లండనులో ఆఱు నెలలు వేచియుండవలసివచ్చె. ఈ తీరుగ నాతని తండ్రి - తమ్ముఁడు- బంధువర్గము నిర్బంధింపఁబడి జైలులో నున్నతఱి ఆతఁడు ఫ్రాంసులో బ్రిటీషునౌకరిగా నుండిపోవలసి వచ్చెను. ఇక్కడి వార్తలు బొత్తిగా నక్కడికిఁ దెలియనీయరైరి. మాతృదేశమునకు మరలినపిదప నెంతో కష్టముమీఁదట ఆయన యుద్యోగమునకు రాజీనామా యిచ్చుటకై అధికారు లనుమతించిరి. అన్నగా రిక్కడికిఁ జేరి డాక్టరీ ప్రాక్టీసు పెట్టినపుడే తమ్ముఁడు కాంగ్రెసునకు- కాంగ్రెసుసిద్ధాంతములకు పాటువడవలెనని యెంతో వేడుక పడుచుండెను. ఒకతూరి గాంధిజీతో నాతఁడు ప్రస్తావించుతఱి నిటులు వచించెను:— "మహాత్మాజీ, కష్టసహనమువల్లఁగాని అంతగా వివేకము కలుగ నేరదు. ఈ కారాగారపు టనుభవము మున్నగునవి లేనిచో అసలు నే నెట్లుండునో యని యిపు డిప్పు డనుకొనుచుందును. ఈ మొదటి రెండు జైలు - అనుభవములే నాజీవితమునకు అగ్నిపరీక్షవంటివి. ఏమందురా, మొట్టమొదటినుండియు క్రమశిక్షను భగవంతుఁడు నాకు ప్రసాదించినందుల కాయన కెంతో కృతజ్ఞుఁడను."

ఖాన్‌సాహేబు 1920 లో నాగపూర్ కాంగ్రెసులో హాజరయ్యెను ; మఱియు అప్పుడే ఖిలాఫత్ - ఆందోళనలో ప్రధాన పాత్రధారి యయ్యె. కాని పదపడి రాష్ట్రీయశాఖలోఁ దన యధ్యక్ష పదవిని నదలివైచి, ముహాజరీనులకు* నాయకుఁడయి ఆఫ్గనిస్థానము వెళ్లి వచ్చుటలోఁ జెప్పఁదరముగాని యిక్కట్లలో చిక్కుకొనవలసి వచ్చెను. అప్పటికే తొంబదియేండ్లకుఁ దక్కువలేని మా ముదుసలి

* ఖిలాఫతు - ఉద్యమములో, ఈ అస్వతంత్ర దేశమున ఉండరాదని లాఁతి దేశమునకు తరలిపోవ సంకల్పించిన ఒక సంఘము:-

అనువాదకుఁడు

తండ్రియు, ఆ ముహాజరీనుల యాందోళనలోఁజొచ్చుట కుత్సాహ పడె''నని ఖాన్ సాహేబు చెప్పుచు మఱల నిట్లనియె:— "ఆవిషయమున నేనెంతో జోక్యము తీసికొని తండ్రీ, నీ ఆరోగ్యము కోసము కాకపోయినను తుదకు పిత్రార్జితము కొఱకైన నీవీ కోరిక మానుకోనలయునని పట్టు వట్టితిని. వస్తుతః ఆయన మా కన్న బలశాలి. అట్టి వార్ధకములోఁగూడ ఆయనయే మా కన్న హెచ్చు నడక నడచెడివాఁడు. తుద కెంతో బలవంతమున అందుండి ఆయనను మఱలింపఁ గలిగితిమి.' అన్నేండ్లువచ్చిన ఆ వృద్ధజనకుని శౌర్యపూరితమగు నిశ్చయమును వెలిపుచ్చుటకును, ఆ చిన్న సోదరుఁడు ఆతని యనుయాయులు పడ్డకష్టాలు ప్రకటించుటకును మాత్రమే యీ ప్రస్తావన తెచ్చియుంటిని.

1921 లో ఫ్రాంటియర్ రెగ్యులేషన్ యాక్టులోని సర్వశక్తి సంకలితమైన 40 వ సెక్షన్ వల్ల గఫూర్ ఖాన్ మఱలఁ జెరలోఁ జేరవలసివచ్చెను. ఈతూరి నిర్బంధములోఁ జెప్పఁదగ్గ కారణా లెవ్వియు లేవు. అతఁడు నాగపూర్ కాంగ్రెసునుండి మరలివచ్చినపిదప నిర్మాణ కార్యక్రమమునంకఁ గన్నువైచె. తనఊరగు ఉత్మంజయీలో జాతీయ పాఠశాల యొండు నెలకొల్పి తచ్ఛాఖలను రాష్ట్రమంతటను ప్రాకింపఁ బ్రయత్నించెను. అందు సత్యాగ్రహ ధోరణి యేదియు లేదు. ఈకార్యక్రమమే యాతనికి స్ఫురించుటఁజేసి యది నెరవేరనలెనని యావచ్ఛక్తిని వినియోగింపఁ జూచెను. కాని,యదియే అధికారుల కోపతాపములకుఁ జాలిన సామగ్రి యయ్యెను. జిల్లాలలో నాతఁడు తిరుగరాదని దొరతనమువా రడ్డుపెట్టి సెక్యూరిటీ కోరిరి. అది యాతనికిఁ గిట్టలేదు. చీఫ్ కమీషనరు-సర్ జాన్ మాఫీ, అతనిచే నేతీరుగనయిన ఆసంస్థను మూయింపవలెనని యాతని తండ్రివద్ద పీఠము వెట్టెను. ఇది యాంగ్లేయులకు వ్యతిరేకకృత్యమని ఆవృద్ధునివద్ద

ఆ కమీషనరు చెప్పినమాట. పైఁగా నిట్లని ప్రశ్నించెను—'ఇతరుల కెవ్వరికిని పట్టని యీపాఠశాలను స్థాపించుటలో నీబిడ్డ కెందులకింత పట్టుదల?.' తండ్రియుఁ దనయునివద్ద నీ ప్రస్తావన తెచ్చెను.

'బాబూ, ఒక్కమాట. మాటవరుసకు ప్రజలందఱు నమాజు చేయుటలో శ్రద్ధచూప మానిరని యనుకొందము. అప్పుడు నా బాగుకై నమాజు మానుకొనుమని నీవుకూడఁజెప్పెదవా? లేక, యెటులైన నీమతము ప్రకారమే ప్రవర్తింపుమని పలికెదవా?'.

'లేదు, లేదు. ఎవ రేమి చెప్పినను జెప్పనీ! నేనెప్పుడును నీమతము విషయమున మాత్రము అడ్డు చెప్ప జాలను.'

'అయితే మంచిది; జాతీయవిద్యావిషయముకూడ అంతే. నేనే గనుక నమాజును త్యజించితినా ఆ పాఠశాలను విడచినట్లే భావింపవలె.'

'ఓ ! అదియా కథ. నీవు చెప్పినదే నిజము.'

ఈ తీరుగ, సర్ జాన్ సంకల్పము వీసరపోయెను. తత్ఫలితముగ, పఠానుపిల్లలకు వారి యిచ్ఛవచ్చిన పధకములో పాఠశాల పెట్టెనని అపరాధమెంచి, అబ్దుల్ గఫూర్‌కు మూఁడేండ్లు కఠినశిక్షను ప్రభుత్వము ప్రసాదించెను.

అనుభూతములగు ఇట్టిజెలు- ఇక్కట్లు 1919 లో అతఁడు చేపట్టిన దీక్షకు సంపూర్తి సమకూర్చినవి. ఇది చాలఁగా డెందమును స్పందింపఁజేయు గాథ. ఆయిటుకు గదులలో ఒంటరియెత్తులు- నెలలతరబడి కాలుసేతుల సంకెళ్లు- కర్కశములగు కారాగారపు పనులు, ఇంక ఏమి కావలె ? ఈ నిర్బంధము లాతని ఒళ్లు గుల్లచేసి వైచినవి. 55 పౌనులదాఁక తూకము తగ్గె. రక్తపిత్తవ్యాధి- నడుమునొప్పి సర్వదా ఆతనిని ఎడఁబాయలేని జతగాండ్రు ఆయెను. కాని యీ

పరీక్షలు ఎంతెంత కఠోరములుగా కాఁజొచ్చెనో అంతంతగా నీతని ఉత్సాహాగ్ని ప్రజ్వలితము కాసాగెను. వాదించి ఒప్పింపఁజూచుట-నొప్పికలిగింప నుంకించుట యిట్టివి యెవ్వియు నాతని యుత్సాహాత్తి రేకమును ఉన్మూలింపఁ జాలవయ్యెను. ఒకతూరి సర్ జాన్ మాఫీ, ఖాన్ బహదూరు అబ్దుర్ రహీంఖాను ముఖతః అతని కిటులు కబురు పంపెను:—'ఉత్కంజయీూ స్కూలు విషయమయి నాకెట్టి ఆపత్తియు లేదు; అయితే నీవు మాత్రము గ్రామాలలోఁ దిరుగరాదు. ఇదే నా యీప్సితము. ఇందుల కియ్యకొందువా ఇపుడిప్పుడే జైలునుండి విడుదల'. కాని యతఁడు దీనిని నిరాకరించినాఁడని వేఱుగాఁ జెప్పనక్కఱలేదు.

ఇప్పుడు- ఈజైలు కాఁపురములోని నైతికసరణి- ఆధ్యాత్మిక దృష్టినిగూర్చి కొంచెము హెచ్చుగ వ్రాయను మనసగుచున్నది. ఆతని అనుభవములను నివేదించు కథలను నేను విన్నపుడు, ఆతని ధీరత- జైలులో మేలుబంతియగు ఆతని మనుగడ నాకెంతో ముచ్చట గొలిపినవి. ఆతఁడొక ఆదర్శక-ఖైదీ. జైలుసూత్రములను రేఖామాత్రమేని జవదాఁట మనసు వోవనివాఁడు. ఇచ్ఛకాలు అన్న సుతరాము కిట్టదు. తన సిద్ధాంతముల నెన్నఁడు విడువ నొల్లఁడు. అధికారులలోఁ గొందఱు తమ విధ్యుక్తధర్మములకు విరుద్ధముగఁగూడ ఇతనిపట్ల కఱకుతనము తగ్గించుటకుఁ గనిపట్టుకొని యుండెడివారు.

కాని యట్టిపని సేయవలదని యాతఁడు బతిమాలును. జైలులో ఆతఁడు చేయవలయు పనులను తామే హృదయపూర్వకముగఁ జేసి పెట్టుటకును, లేక అతఁడు చేయనక్కఱలేని యనుమతిని పైనుండి తెచ్చుటకును చిరకాలశిక్షితులు కొందఱు సిద్ధపడుట కద్దు. "అసత్యము నేనెన్నఁడు పలుకలేనని యిదిగో స్పష్టముగాఁ జెప్పుచుంటి"

నని ఆతఁడు అట్టివారిని మందలించెడివాఁడు. ఇప్పటివలె అప్పుడును జైళ్లలో నీచాతినీచములగు లంచగొండితనములు మెండుగ నుండెడివి. పనులు తప్పించుకొనుటలో అనుమతులు- శిక్షల తగ్గింపులు సులభముగాఁ గొనివైచుటకు కావలసినన్ని పథకములు. ఈపద్ధతు లేవియు ఖాన్‌సాహేబునకు రుచింపవు. ఇట్టివి విసర్జించివేయుఁడని తాను కలసికొన్న శిక్షితులకు ఉద్బోధించుచుండును. ఈ లంచాలతో మీచేతులు మురికిచేసికొనకుఁడని ఆ దౌర్భాగ్య- సిఫాయీలకుఁ గూడ సలహా లొసఁగెడివాఁడు. ఒకప్పుడు ఒక సిఫాయి అతనితో దీనముగ నిట్లనియె:—'మఱొకవిధముగా నయినచో మాజీవితము గడపుకొనుట దుస్సాధమని తోఁచుచున్నది.'

'నీవేమి చేయవలయునో నేను జెప్పను; అయితే నీవు చేయునది మాత్రము నైతికముగా తప్పని నొక్కి- వక్కాణింతును.' అని ఖాన్‌సాహేబు సమాధానము. తత్ఫలితముగ ఆ సిఫాయి తత్‌క్షణమే ఆ నౌకరికి తిలోదకము లర్పించెను. ఈఘటన అధికారవర్గమునకు సహింపరానిదిగ ఆయెను. ఇందు రాజకీయముగ ప్రాముఖ్యము ఎట్టిదియు లేకున్నను స్వార్థపరులు కొందఱు అర్థాని నంటఁగట్టిరి. ఇది ఖాన్‌సాహేబుయొక్క- నైతికప్రభావమయ్యె, జైళ్లలో నిట్టిది పనికిరాదని వారి భావన. అప్పుడే ఆజైలునుండి ఆతనిని పంజాబులో ఒక జైలుకు బదలీ చేసిరి. అయితే అచ్చట ఇతరరాజకీయ శిక్షితులతోఁ గలసియుండు అదృష్ట మాతనికి అబ్బినది. ఇచ్చటఁగూడ ఈ ఆదర్శక- ఖైదీ తన నియమబద్ధజీవితమునే అవలంబించి యుండెడివాఁడు. సరిహద్దురాష్ట్రపు- జైలులో అధికారు లెయ్యది సహింపఁజాలక పోయిరో ఆ యంశమందలి ప్రాశస్త్యము ఇచ్చటి తోడి-ఖైదీలకు ఆకళింతకు రాకపోయె. కాని యీతఁడు తన దృక్పథమును మార్చుకోవలసిన యవసర మేదియు కానిపింపలేదు. 'ఒకతూరి నీవు

నీ సిద్ధాంతమును విడనాడితివేని సత్యమునే కాదు, ఆత్మగౌరవమును గూడ మంటఁగలిపినట్లే. శాసననిషిద్ధములయిన వస్తువులను జేపట్టుటలో వెనుదీయనివారు తుదకు ఆత్మగౌరవమునకు స్వస్తిచెప్పెద రనుట నే నెఱుంగుదును-' అని యతఁడు నాతోఁ బలికెను. కాని, పంజాబులోని ఈ కారాగారవాసము ఆతనికి ఆధ్యాత్మికానుభవమును మిక్కిలిగాఁ గూర్చినది.

హిందూ-సిక్కు స్నేహితులతో నీతఁడు యావజ్జీవసంబంధము నెలకొల్పుకొని వారిమతము విజ్ఞానమునుగూర్చి వ్యాసంగము చేయసాగెను. అతఁడు నాతో నిటులనియె:—'ముమ్మొదట గీతను పఠించిన దిచ్చటనే; అట్లే గ్రంథసాహెబు * బైబిల్ కూడ నిచ్చటనే చూచితిని. ఏతన్మతావలంబకులగు ఈ మిత్రులకు నే చేయఁగలదానిలో ఈ వ్యాసంగము తక్కువలోఁ దక్కువయని తలంతును. వారి మతగ్రంథముల జోక్యమే నేను పెట్టుకొనియుండనిచో వారిని జక్కాగా అర్థము చేసికొనను వలనుకాదు. వారి నెయ్యమువిలువ గుఱుతించుటయుఁ బొసగనేరదు. అయితే గీతమాత్రము నాకప్పుడు బుఱ్ఱ కెక్కలేదని చెప్పక తప్పదు. పౌనఃపున్యముగ పఠించితిని. దానికిఁదగ్గ మేధాసంపద-గ్రహణశక్తి బహుశః అపుడు నాబుఱ్ఱకు లేవేమో! అండమానుదీవులనుండి అరుదెంచిన పండిత జగత్ రాము మూలముననే నాకు 1930 లో అసలు గీత అర్థమయినది. గీత అన్న ఆతనికెంతో భక్తిప్రపత్తులు. అతఁడే నాకు గీతలో అంత చొఱవ చేసినవాఁడు.' ఈతనిని ప్రశంసించు మిత్రమండలి యెద్దానిని ముద్దు ముద్దుముగఁ బిలుచుకొందురో, ఈతఁడన్నఁ గిట్టనివారు దేనిని దేలికగఁ జూతురో-అట్టి 'సరిహద్దుగాంధీ' యను బిరుదము ఆనాఁటి

* సిక్కుల ఉద్గ్రంథము.

నుండియే వచ్చినటులు తోఁచుచున్నది. ఇతఁడు గాంధిజీ జీవితమును సవిమర్శకముగఁ జదివినాఁడు. ఆయన జీవితములోని ఘట్టములను అనుకరింపను ఇతఁడు సర్వదా సంసిద్ధత చూపుచుండును. జైలులో నీతఁడు వారమున కొకతూరి ఉపవసించుటయే కాదు, వారమున కొక్కరోజు మౌనముకూడ ఉండెడిది. ఇదే చాలు ఇతనికా బిరుదము అబ్బినదనుటకు. మహాత్మాజీకి వింతవింతలయిన బిరుదములు ప్రసాదించుటలో సనాతనపరాయణు లెటులు వెనుదీయలేదో యటులే మతావేశగ్రస్తులగు మహమ్మదీయు లీతనిని 'హిందు'వనికూడ ఈసడించెడివారు.

1924—1926 ఆనడుమరోజులు చాల చెడ్డవి. అదే హిందూ మహమ్మదీయ-సంఘర్షణ తీవ్రరూపము దాల్చిన తరుణము. అప్పుడు చెలరేగిన ఉద్ధృతములగు ఉద్రేకములు ఇసుమంతయు నతనిని అంటలేదు. సంకుచితములగు మతచర్యలకుఁ గడుదవ్వుగ నుండువాఁడు. అతఁడట్టి మతావేశచర్యలు నిరాకరించిన సందర్భములు పెక్కులున్నవని చెప్పవచ్చును. అబ్దుల్ గఫూర్ నాతో ఒకతూరి యిటులనెను:-"మతముయొక్క ప్రాశస్త్యమును అందలి మానవులసంఖ్యను బట్టి నేనెంచను. ఆచరణములో లేని మతవిశ్వాసము అదొక లెక్కలోనిది కానేరదు. సదాచారము, శ్రద్ధ, ప్రేమము- ఇవియే ఇస్లాం మతమని నా గాఢవిశ్వాసము. ఈ సుగుణములు లేక తాను ముసల్మానునని చెప్పుకొనుట గానమాధురిలేని 'బ్యాండు' మ్రోతవంటిదే యగును. మానవుఁడు ముక్తిని పొందవలెనన్న ఏకేశ్వరోపాసన-సత్క్రియాచరణ- ఇట్టివే చాలునని కురాన్ - శరీఫ్ వక్కాణించుచున్నది."

ఇంతకు అతఁడు నైష్ఠిక - ముసల్మానుల కెవ్వరికిఁ దీసిపోవువాఁడు కాఁడు. ఒక్క నమాజుకుఁగూడ అతఁడు ప్రాలుమాలినటులు

నేను భావింపను. నైష్ఠికాభాసులగు నీ మహమ్మదీయులలోకన్న అతనియందే భ్రాతృతాగుణము హెచ్చుగను స్వాభావికముగను కద్దు. అగ్రసోదరుఁడు అనేక సంవత్సరములు అన్యదేశాలలోఁ గడపి వివిధజాతులకు మతములకుఁ జెందిన వ్యక్తులతో మైత్రి పొందియుం డెను. అద్దాన అతనికి విశాలదృష్టి అబ్బినది. అయితే పిత్ర్యమగు మతాభిమానము స్వీకరించుటలో తమ్మునికేమాత్రము తగ్గిపోవఁడు. తఱచుగా నాతఁడు తమాషాకు నా బదులుకూడ మా సోదరుఁడే నమాజు చేయునని పలుకుచుండును. కాని సత్యమైన మతధోరణికి ఆక్షేపకరముగ నెద్దియేని చెప్పిరా ఆతఁడెంతో నొచ్చుకొనును. ఒకప్పుడు నేను గాంధిజీ ఉపవాసవ్రతమునుగూర్చి ఖండనచేసిన ఒక వ్యాసమును ఆ సోదరులకుఁ జూపితిని. అది సనాతనపరాయణుఁడగు ఒక మహమ్మదీయుఁడు వెలువఱచు వారపత్రికలోనిది. అపుడు వారి నిటులు ప్రశ్నించితి :- 'అయితే ఇస్లాంమతము, నేఁడు ఆచరణలో నున్న శాస్త్రవిహితమగు ఉపవాసమునే అంగీకరించుచు తక్కిన ఉపవాసములను నిషేధించెనా యేమి ?'

'శాస్త్రోక్తమైన ఉపవాస మనఁగా ఆ వ్యాసకర్త యుద్దేశ మేమో తెలిసికోవలెనని ఉన్నది.' అని వారనిరి. ఆ లేకరి వ్రాఁతను బట్టి ఇస్లాంమతములో విహితమైన అసలు ఉపవాసమనఁగా నిది:— పగలు బొత్తిగా నేదియుఁ దినరాదు; త్రావరాదు. సూర్యాస్తమయము-ఉదయములోపల ఆవ్రతము విరమింపవలె. అని నేను వివరించితిని.

ఛీ ! అది పట్టిది ! ! అని యించుక ఆవేశపడి ఆ కనిష్ఠసోదరుఁ డిటులు వచించెను:—'నామట్టుకు నేను గడచిన ఆగష్టులో గాంధిజీ ఉపవసించిన ఆ యేడు రోజులును ఉప్పుకలిపిన నీటిని సాయంసమయములఁ బుచ్చుకొనుచు ఉపవసించితిని. ముసల్మానులలో అధిక

సంఖ్యాకు లాచరించెడి ఉపవాసవ్రతమే నిజమైన ఉపవాసవ్రతమని యనుట ఇస్లాం మతమును ఎక్కిరించుటయే. పైగంబర్ సాహేబు పూర్తిగ అహోరాత్రములు ఉపవసించెను. మానవ దౌర్బల్యమును గమనించి ప్రొద్దు క్రుంకిన పిదప భుజించుటకు మనకుమాత్రము అనుమతి యొసంగెనని నేను నమ్మెదను. మతప్రవర్తకుఁడు ఆహారముతో అక్కఱపట్టదు. అతనికి 'అల్లా' యే ఆధ్యాత్మిక భోజనము అందించువాఁడు. అట్టిది సామాన్య మానవులకు అందుపాటు కాదు; వారికి 'అల్లా' విషయములో అనువగు విశ్వాసము లేదుగా మఱి! నేను ప్రతివారము మౌనవ్రతము పూనుటఁబట్టియు గీతాపఠనము చేయుటఁ జేసియు నన్ను హిందువని అనుట యెటులుండునో అంతలో నిదే ఈ పత్రికా విమర్శనముకూడ.'

౪

# మతథోరణి

ఇప్పుడు వీరి మతవిశ్వాసమునుగూర్చి పరిశీలింతము. అసలు ఖాను సోదరుల అత్యధికశక్తికి హేతువేదియో; వారు హిందూ-మహమ్మదీయుల ఐక్యమునకై పరిశ్రమించుటకు ఏది మూలమో అది గుఱుతించుట హైందవులకు ముస్లిములకు అత్యావశ్యకము. ఒకప్పుడు మహాత్మాజీ, మాటవెంబడి డాక్టరు ఖానుసాహేబుయొక్క ఆంగ్ల భార్యనుగూర్చి ముచ్చటించుచు ఆమె ఇస్లాంమతమును కయికొనెనా యని ప్రశ్నించెను.

'ఆమె ముసల్మానో- క్రిస్టియనో- ఆవిషయము నేను చెప్ప లేనన్నచో మీకాశ్చర్యము కలిగితీరును. ఆమె యెన్నడును మతము మార్చుకోలేదని అంతవఱకు నాకుఁ దెలియును. ఆమె స్వీయమతము అదేదైనను అవలంబించుటకు స్వతంత్రయే. ఆ విషయమై నేనామెను అడుగనైన అడుగలేదు. అయిన నేనెందులకు అడుగవలెను ? సతీపతులు తమతమ మతములనే ఏల అంటియుండరాదు ? పరిణయము-ఒకరి మతవిశ్వాసమున ఎందులకు పరివర్తనము చేయవలెను ? ఇదిగో! ఇది విన్నచో మీ రాశ్చర్య పడెదరు. మొన్ననే మా అన్నగారిబిడ్డ (ఖాన్‌సాహేబు పుత్రుఁడు) లండను మెట్రిక్యులేషన్ ప్యాసయి ఆక్స్‌ఫర్డ్ పోవుటకు సిద్ధముగానుండి యేదో ఒక ఉత్తరములో-ఇక్కడి పిల్లలందఱు నన్ను క్రిస్టియన్‌గా లెక్క-కట్టుచున్నారు; వీండ్రకు నేనేమని చెప్పవలయునో అంతు పట్టకున్నదని వ్రాసినాఁడు' అని అబ్దుల్‌గఫూర్ ప్రత్యుత్తరించెను.

ఓహో, 'అట్లాగా' అని అబ్బురపడి గాంధిజీ యిటులు పలికెను:—'ఆమెనుగూర్చి మీ చెప్పినయది విని నేను విస్మయా నందములు వొందితిని. అయితే తక్కిన ముసల్మాను లేమందురో. పెక్కుమంది యీవిషయమున మీవలె అభిప్రాయపడెదరా ?

'లేదు-పెక్కుమంది అటు లనుకొనరని నాకు తెలియును! కాని, వాస్తవమునకు లక్షలో ఒక్కరికిఁగూడ ఇస్లాంమతము నిజ తత్త్వము తెలిసియుండదు. అదే మనలోఁ జాలఁ గలహములకుఁ గారణము. ఇటు-అటు స్వార్థపరులు కొందఱు విభిన్నత్వమును - విశేషమైన ఆవేశమును వింతవింతలుగ రగులుకొల్పుచున్నారు. అయ్యో ! మన మెంతగా అధఃపతనము చెందితిమి!! 1930 లో గుజరాతుజైలులో ఉన్నపుడు నేను నా హిందూ సోదరులతో పరిచితి చేసికొన నిశ్చ యించితిని. మేము ఒకళ్ల కొకళ్లము అర్థము చేసికొనను, బోధింప వలంతులగు విజ్ఞులవద్ద గీత - కురాన్ క్లాసులు ఏర్పఱచుకొంటిమి. కొన్నాళ్లు ఈ క్లాసులు నడచినవి. కాని తుదకు గీత క్లాసులో నే నొక్కరుఁడను; కురాన్ క్లాసులో ఒక్కమిత్రుఁడును మాత్రమే మిగిలి పోయితిమి. ఆ మిత్రుని పేరిప్పుడు మఱచితిని. అందువలన అంతటితో ఆ పాఠములు కట్టిపెట్టవలసివచ్చెను. అయితే మాయిరువురము నేను హిందువనియు, అతఁడు ముసల్మాను అనియు పెద్ద అపనిందమాత్రము నెత్తికిఁజుట్టుకొంటిమి. కాని నేను గీతను మానలేదు. అద్దానిని మూఁడు పర్యాయములు అధ్యయనము చేసితిని. మతము లన్నింటను తన్మతా వలంబకులను అట్టె ఆకట్టి యుంపఁగల శక్తియుక్తు లున్నవను సంగతి మనము గుఱుతింపఁ జాలకపోవుటఁబట్టియే యీకలహము లన్నియు నిట్లు దాపురించుచున్నవని నేను తలంతును. ఈశ్వరుఁడు అన్ని జాతులవారికి అన్ని దేశములవారికి అవతారపురుషులను పంపునని యు వారే ఆయాయి జాతులకు ప్రవక్తలనియు కురానులో విస్పష్టముగఁ

జెప్పఁబడ్డది. ఈ ప్రవక్తలందఱు కురానులో వర్ణితులగు పూజనీయ వ్యక్తులే (అహలేకితాబ్) అయియుండిరి; కాని, హైందవులుకూడ ఆ పూజనీయులగు (అహలే కితాబ్) యూదులకు- క్రైస్తవులకు ఏమాత్రము తగ్గరు.'

'అయితే అది నైష్ఠిక - ముసల్మానుల అభిప్రాయము కాదుగా ?'

'అవును; నాకుఁ దెలియును. అసలు, కురాన్ శరీఫ్‌లో హైంద వులయు వారి ఉద్గ్రంథములయు సందర్భములు ఉల్లేఖింపఁ బడకుండు టకు కారణము వినుఁడు:—అందు ఉదాహృతమయిన పట్టిక కేవ లము మచ్చును ఇచ్చునదేకాని సర్వథా సమగ్రము కానేరదు. ఈ తిరుగుడు వారు గుఱుతించినవారు కారు. కురాన్ శరీఫ్‌లో ఈ సిద్ధాం తము మాత్రము సూచితము:—ఎవ రెవరికి ఆర్షగ్రంథములు (ఉద్గ్రంథ ములు) ఉన్నవో వారెల్లరు 'అహలే కితాబ్' శ్రేణికి చెందినవారే అయ్యెదరు. మతమును ప్రవర్తనను శాసించు ఉద్గ్రంథములు కలవారు సయితము ఆసిద్ధాంతమునకే వత్తురని నేను నిస్సంశయముగ నమ్ము దును. అన్నిమతములకు మూలసిద్ధాంతము ఒక్కటే అనికూడఁ జెప్ప వచ్చును. అందందు ఒండు రెండు విశేషాంశములు విభిన్నముగ నుండుటయు కద్దు; ఏమందురా ! ప్రతిమతము తన జన్మభూమి యందలి వాతావరణమును జీర్ణించికొని యుండును.

ఒక చిన్నతార్కాణ చూడుఁడు. ఇస్లాం హిందూమతములు రెండును పరిశుభ్రముపట్ల నొక్కి చెప్పుచున్నవి. అందు- ఆ రెండిం టికి ఆవంతయు భేదము ఉండలేదు ; ఉండఁబోదు. కాని ఆచరణలో మాత్రము ఒకటికొకటి యెదురు. ఇస్లాములో దంతధావనకు ఎండు పుల్లలే వాడవలెనని ఉన్నది. అప్పుడే కోసిన పచ్చనిపుల్లలను హిందూ

మతము అనుమతించుచున్నది. హిందూమతమున అనుదినము ఒకతూరి గాని హెచ్చుగఁగాని స్నాన సంధ్యాదు లుండవలెనని విధి. వారమున కొకతూరియైన స్నానము మానకుఁడని ఇస్లాముబోధ. దీనివలనఁ దేలిన దేమి ? హిందూమతము నీటి కేమాత్రము లోటులేని గంగానదీ ప్రాంతమున ఉద్భవించినదనియు; ఇస్లాము కొన్నిరోజులపాటు నీటికి ఒక్క-చుక్క-యైన నోఁచుకోని చవుటిపఱ్ఱలో జన్మమెత్తె ననియు స్పష్టమగుచున్నది. ఇఁక సారాంశమిది :—ఇస్లాము, అనుదినము స్నానముచేయు ముసల్మానునిఁగానీ, పచ్చిపుల్లతోనే పల్లు తోముకొను సాహెబునుగాని దండన చేయదు. భిన్నభిన్నమతములు విధించిన ఆచరణలయొక్క- భేదమునకు ఆయాయిమతముల ప్రత్యేక జన్మస్థలాదికమే కారణమని పిండితార్థము. అద్దాన నేను ఎవ్వరి మతము జోలికిని బోఁదగదు. సర్వప్రపంచమున కొక్క-టే మతము ఎన్నఁడు చేకుఱునో నేనూహింపలేను. ప్రతి జాతియు తన మతము మూలముననే శక్తిని సమకూర్చుకోవలెను, గాని వేఱొకజాతిమతమును విఘ్నపఱచుటలో ఫలితము ఉండనేరదు.'

అయితే ఉపర్యుక్తవిషయములనుబట్టి యీ సోదరుల దృష్టిలో ఆయాయిజాతులు అట్టే విడివిడిగా నుండితీరవలెనని అర్థము చెప్పరాదు. చెప్పిరే పో ! అంతకన్న ప్రమాదము మఱేదియు లేదు.

'ప్రతి - రైల్వేస్టేషనువద్దను హిందువుల నీరు - ముస్లిములనీరు, హిందువుల టీ - ముస్లిముల టీ, అను కేకలను వినలేక చచ్చిపోవుచుంటిమి. పదేపదే అనుటలో వాంద్రకు విసుగుకూడ లేదు. హిందూ- ముస్లిములలో ఒకఁడు మఱొకని పాత్రనుండి నిర్మలమయిన నీరమును పుచ్చుకొనుటలో ఆపత్తి యెందుల కుండవలెను ?'

ఈ విషయమునఁగానీ మఱేవిషయమునఁగానీ నిర్బంధములు కొఱగావని గట్టిగాఁ జెప్పుటలో గఫూర్ ఖానుని మించినవారెవ్వ

రును లేరు. అతఁడు 1922 లో డేరాగాజీఖాన్ జైలులో ఉండఁగా జరిగిన ఒకానొక సంఘటన ప్రస్తుతము ఉల్లేఖింప నుల్లాసము కలుగు చున్నది. లాఁతివారి మనస్సు నొవ్వనాడకుండుటలో గఫూర్ ఖానునకుఁ గల శ్రద్ధను దెలుపుటకే యీ ప్రసక్తి. శాకాహారు లగు తోడిఖైదీలకు రోఁత లేకుండుటకే అప్పుడతఁడు ఆఱు మాసములు మాంసమును మానివైచెను. అంతలో ఆరోగ్యము భగ్నమాయెను. పండ్లు ఊడిపోవలెనని కోఁక లేనిచో మాంసాహార మునుగూడ పుచ్చుకొనితీరవలెనని డాక్టరు గట్టి సలహా ఇచ్చెను. తప్పని సరి అగుటచే అతఁడొప్పుకొనియె. కాని మాంసమువంటక కములో ఒక్క చిక్కు వచ్చిపడినది. మామూలు వంటయింటనే మాంసముసయితము వండవలెనని సూపరింటెండెంటు ముదల అయ్యెను. ఆయింట వంట చేయించి శాకాహారులయిన తోడిఖైదీలను హైరాను పెట్టుటకన్న తాను మానుకొనుటయే లగ్గని ఖాన్‌సాహేబు ఉగ్గడించెను. అప్పుడే సూపరింటెండెంటు మంచిగా మఱొక్కచోట మాంసమును వండించుటకు వీలు కలిగించెను. మిత్రులను నొప్పింప రాదను ధోరణి, ఖాన్‌సాహేబుపట్ల ఎందనుక పరిణమించినదో యిది వినుఁడు:—1931 లో శ్రీ దేవదాసుగాంధి ఈసోదరులయింట అతిథిగా ఉన్నతఱి ఇంటెల్లపాదికి ఆ నాలుగురోజులు మాంసమువంట మాని వేయఁబడెను. అటులే హైందవులు సయితము ముసల్మానుల ఆచారములపట్ల ఆదరణ చూపవలెనని ఆతని యాశయము; అది నిజముకూడ. 1922 లో డాక్టరు సలహా మీఁదట ఆతఁడు మాంసము తీసికొనవలసి వచ్చినతఱి హిందూ-సిక్కు స్నేహితులు కొందఱు దానిని సైఁపఁజాలకపోవుట శోచనీయము. ఈ అసహిష్ణుత మన వినాశమునకు మూలము. 'పరస్పరభావములలో మనము మన్నన చూపనిది హిందూ - ముసల్మానుల యైక్యము సమకూర్పఁ

జాలము' - అని ఆతఁడు నాతో లెక్కలేనన్ని సారులు నొక్కి-చెప్పినాఁడు.

కాని నేఁటి పరిస్థితులు లేతీరుగ నున్నను, వర్తమానధోరణి యెంత అయోమయముగ నున్నను హిందూముస్లిముల యైక్యములో ఈ అన్నదమ్ముల విశ్వాసము ఏమాత్రము చెదరి పోలేదు. ఆ యైక్యము ఒనఁగూడు ననుటలో వారి కేనాఁడు అనుమానము లేదు. అద్దానిని సిద్ధింపఁ జేయుటకై యిరుతెగలపెద్దలును త్యాగము చేయవలసి యుండు నని వారి యుద్దేశము.

అబ్దుల్ గఫ్ఫారు ఒకప్పు డిది వినిపించెను:— 'మేము ఒక తూరి......వెళ్లినపుడు మసీదు- అధికారియైన మౌల్వీని ఒక్కనిని గలసికొంటిమి. హిందూ - ముస్లిముల పొందుగూర్చి నేను ప్రబోధింపఁగా నన్నతఁడు గట్టిగా నిట్టులు మందలించెను:—

“ అయ్యో ! ఎంత అర్థములేని పని. వాండ్రందఱు విగ్రహారాధకులు. వాండ్రతో మనకు పొత్తు ఏటిది ? నీవు ఇస్లాముబోధలకు ఎదురు నడక నడచుచున్నటులు పొడకట్టుచున్నది.”

నా జవా బిది:—వారు విగ్రహారాధకు లయినచో మనమో ? మన 'గోరీల పూజ' మాట యేమి ? ఈశ్వరుఁ డొక్కరుఁడే యని వారును విశ్వసించినపుడు మనకన్న దైవభక్తిలో వారెటులు తీసి పోయెదరు ? హిందూ ముస్లిముల పొందు అగుననుటలో నీవు నైరాశ్యము నొందనేల ? సత్యమైన ప్రయత్న మెన్నఁడు ఆఱిపోయినది లేదు. అదిగో ! ఆ పొలముకేసి చూడుము ! అక్కడ విత్తిన విత్తనాలు కొన్నాళ్లదాఁక నేలలో 'గర్భితమై'యుండవలెను. పిదప మొలక యెత్తును. అంతఁ గొంతకాలమునకు పెరిగి పెద్దవై హెచ్చుగ సస్యాదికమును ఇచ్చి తీరును. మంచి విషయమునఁ జేయు ప్రయత్న మెద్దియైనఁ గానీ ఇట్టులే తుట్టతుదకు కొనసాగుట తథ్యము.'

మఱొకయెడ ఈ సోదరులను పత్రికాసంపాదకుఁడగు ఒకానొక ముసల్మాను కలసికొని పైని మాల్వీ అడిగినటులే యిటులు ప్రశ్నించెను:— "ఇసుకనేల దున్ననేల ? ఈ హైందవుల నెన్నఁడు నమ్మి యుండరాదు. శివాజీసంగతి యెఱుంగరా మీరు ?

అంతలో పెద్ద సోదరుఁడు అప్పుడప్పుడే కచ్చితముగ అతని కిటులు జవాబిచ్చెను:— "అయితే శివాజీనిగూర్చి యెఱుంగుదు నని నీవనుకొందువు !! ఒక హైందవుఁడు వచ్చి ఔరంగజేబును తిట్టిపోయుచు ముసల్మానుల నెవ్వరిని అసలు నమ్మరాదని అన్నచో నీ వే మందువు ? అవును గాని, మిత్రమా, శివాజి - ఔరంగజేబు లిరువురు ఎన్నఁడో పోయిరి. వాండ్రనుగూర్చి మన కిపుడు తగవు లాట తగదు. మహాత్మాగాంధిజీనిగూర్చి మ తేమను నెదవు ? ఆయన మీఁద విశ్వాసము ఉంచుచున్నపుడు ఇఁక చిక్కేమి యుండును ? మా అన్నదమ్ము లిర్వురము విశ్వసనీయుల మై నప్పుడు మమ్ము నమ్మఁడని హైందవుల నడుగుటలో తప్పేమున్నది ? ఒకజాతి మెఱుగులు నిరూపింప వలె నన్న ఆ జాతిలో చెడ్డరకములను గాక ఉత్తములగు వ్యక్తులనే ఉట్టంకింపఁ దగును.

ఒకతూరి పిన్నసోదరుఁడు గాంధిజీతో నిటులు ప్రస్తా వించెను:— "మహాత్మాజీ, తాము తలపెట్టిన హరిజనోద్యమము నెడఁ గూడ అటనట సందేహములు వెలువడెనఁట. 'యరవాడ-పాక్ట్'- ఆ 21 రోజుల ఉపవాసమునకును అపార్థములు దొరలి తమ్ము కుల తత్వవాదులలో జమకట్టుటయు వింటిమి. మే మట్టి విమర్శనా ధోర ణిని దవ్వుగా నెట్టివైతుము. మీ యీ యుద్యమము కేవలము మానవకల్యాణమునకే వెలసియున్నది. ఒకే మతములో ఒకఁడు తన అనుయాయులను అంటరానివారుగాఁ జూచుట అన్యాయ్యము.

మహాత్మాజీ, మేము జైలునుండి మిమ్మిపుడు అభినందించుచు తంతి వార్త అంపుట తమకు గుఱుతు కావచ్చును. అయితే మీ ప్రత్యుత్తరము మాకు అందుటలో కొన్నాళ్లు పట్టినది లెండు."

అపుడు ఇద్దరు పకపక నవ్వుకొనిరి.

వారి యుపవాసమును మెచ్చుకొనుటయే కాదు — తాము మాంసము త్యజించి తీరవలెనని గట్టిపట్టు పట్టిరి. నాఁటినుండి మాంసమును జైలులో ముట్టనేలేదు. జైలువెలుపల సయితము ఈ విధానమునే పాగించిరి ; అయితే ఒక్కొక్కరి యింట మాత్రముముని ముందు తెలియకయే మాంసము వండి వడ్డించినపుడు 'మినహాయింపు' కలిగెడిది. గత - ఉపవాసములో గాంధిజీతో పాటు ఆ చిన్న సోదరుఁడు ఉపవసించుటయేకాక, నిరీహాబుద్ధితో తానా వ్రతమున మఱొకవస్తువునుగూడ నిషిద్ధకోటిలోఁ జేర్చుకొనెను. అది ఆతనికి అత్యంతప్రియమైన తేనీరు. 'అది త్రావనినాఁడు నాకు తలనొప్పి సిద్ధము. అది పుచ్చుకొనునపుడెల్ల హెచ్చుభాగము పుచ్చుకొనుటయే అలవాటు. అదేమి వింతయో గాని, నా ఉపవసించినవేళలలో అది మానివైచినను అంత బాధాకరముగ ఉండెడిది కాదు. అద్దాన ఇసుమంతయు సంకోచపడక దానిని విడనాడితిని'—అని నాతో ఒక నాఁ డాతఁడు ముచ్చటించెను. కాని, అన్నగారు తమ్ముని ఆరోగ్యముపట్ల ఆదుర్దాపడుచు తఱచుగా నాతని నిరీహాబుద్ధికి అసమ్మతి చూపెడివాఁడు. అది యెంతో సహజమే గదా ! 1919 లో 220 పౌనుల బరువు తూఁగిన ఆతఁ డిపుడు - ఏ 170 పౌనులకో దిగివచ్చెను. అది అంతయు జైలు పెట్టిన భిక్షయే.

ప్రకృత మనుసరామః—

వారి భావనలో ఇస్లాము సంకుచితమైన మతము కానేరదు. 'నిజమైన ముస్లిమే గనుక అయినచో అటులు ముస్లిముగా నుండుటఁ

బట్టియే - ఆ మనుజుఁడు, హిందూ - ముస్లిము - ఐక్యమునకు, ఇండియన్ నేషనల్ కాంగ్రెసుకు పాటుపడువాఁ డగును' అని వారి గట్టి నమ్మకము. 1931 లో ఒక మహాసభలో - ఆతఁడిటు లుపన్యసించెను:— "కాంగ్రెసు పేరే నా ముసల్మాను సోదరులలో కొందఱికి భీతావహముగా నుండుట నాకెంతో ఆశ్చర్యము. కాంగ్రెసు కేవలము హిందూ- సంస్థ అనియు, అందువలన అద్దానితో సంబంధ మక్కఱ లేదనియు వారి తలంపు. వస్తుతః కేవల జాతీయ దృక్పథము కల ఈ కాంగ్రెసుసంస్థనుగూర్చి చిత్రించుటలో ఇంత కన్న అపసవ్యమైన తెలుగు మఱిదియు లేదు. కాంగ్రెసు సంస్థ యొక్క విధానము - నిబంధనలు - ఉద్దేశములు - ఆదర్శములు చక్కఁగాఁ జదువుఁడని నాసోదరులకు మనవి. వెయ్యేల, ప్రజలను దాస్యమునుండియు పరపీడనమునుండియు ముక్తి పొందించుటయే కాంగ్రెసు పరమ లక్ష్యము. దీనినే యింకొక తీరుగఁ జెప్పినచో—లక్షల కొలంది అన్నాతురులకు పేదసాదలకు కూడుగుడ్డ ఒసంగఁజూచుటయే కాంగ్రెసు సంకల్పము. ఇస్లాంచరిత్రమును మీరు చదివి చూడుఁడు. మన పైగంబర్ సాహేబుల వారి ధ్యేయమేమో గుఱుతింపుఁడు. అది, బాధితులను అత్యాచారములనుండి కాపాడుట, పేదసాదలకు అన్నవస్త్రము లిచ్చుట. అద్దాన కాంగ్రెసు లక్ష్యము మతప్రవక్త లక్ష్యము ఒక్కటియే గాని అన్యథా కాదు. అది ఇస్లామునకు విరుద్ధమును గాదు.

సూర్యతేజమువోలె ఇది యింత సుస్పష్టముగా కంటికిఁ గానుపించునపుడు కాంగ్రెసుకు ముసల్మాను లెటులు దవ్వుగ వైదొలఁగఁ జూతురో నాకర్థము కావుట లేదు.

ఇఁక, అహింసాసిద్ధాంతమునకు వత్తము. ముసల్మానుగానీ నావంటి పఠానుగానీ ఈ సిద్ధాంతము నేకీభవించుటలో అబ్బురము

లేదు. ఇదేమి నవీనసిద్ధాంతమూ కాదు. పదునాలుగువందల యేండ్లనాఁడే పైగంబర్ సాహేబులవారు మక్కాలో ఉన్నంత కాలము ఇది అనుష్ఠించినదే. నాఁటినుండి బాధితుల నుద్ధరింపఁ బూనువా రెల్లరు ఇది ఆచరించుచునే యుండిరి. కాని, మహాత్మాజీ దీనిని మన ముందు పెట్టినపుడు - అతఁడు నవ్యసిద్ధాంతమునో నూతనాయుధమునో ప్రయోగించు చుండెనేమో అన్నంతదాఁక మనము మఱచి యుంటిమి. విస్మృతమైన మతమును పునరుద్ధరింపను, పతితమైన ఒకజాతియొక్క కష్టాలు గట్టెక్కింపను, ఈ సిద్ధాంతము జాతియెదుట పెట్టఁగల గౌరవము గాంధిజీకి దక్కినది.

ఈ స్వాతంత్ర్యసంగ్రామము, హిందూ - ముసల్మానుల కిర్వురకును ముక్తి కలిగించుటకే అని ఆ యిరుతెగలవారికిని నేను జెప్పుచున్నాఁడను. ఈ పోరాటములో హైందవులు తాము పాల్గొనుట మఱెవ్వరిని ఉద్ధరించినటులు కాదు; ముసల్మానులు వీరితోఁ గలసి మెలసి పనిచేయుటయు వేఱెవ్వరిని బ్రతికించుటకుఁ గాదు. మనలో మనలను వేఱువేఱు చేయు ఘట్టములు ఇప్పటికే చాలినన్ని ఉన్నవి. హిందూదేశవాసులగు మీరు కృత్రిమమైన 'ఆఫ్గన్' సమస్య అనెడి గగ్గోలు ఎఱింగియే యుంటిరి. ఇటీవల, హిందూ రాజ్యము—సంపన్నుఁడగు హైందవుఁడు, విద్యాధికుఁడగు హైందవుఁడు, జాతీయవాదియగు హైందవుఁడు—వీరి పరిపాలనము-అనెడి సమస్య వినియే యుంటిమి. హిందూరాజ్యముగదా యిది యని నన్ను హెచ్చరింప వచ్చువారికి ఇదిగో! ఇది నా సమాధానము:—బొత్తిగా పరాయివాని క్రింద బానిసీలయి బ్రతుకుటకంటె ఇరుగుపొరుగువారికి అణఁగి మణఁగి యుండుటయే లగ్గు."

౫

# ఖుదాయీ ఖిద్మత్గారులు

**1924** లో జైలునుండి వచ్చిన పిదప ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖాన్, సంఘసంస్కరణకు సంబంధించిన ప్రశాంతమైన పనులలో మగ్నుఁడాయెను. అయ్యు, కాంగ్రెసు వివిధసమావేశములకును హాజరయి తీరెడివాఁడు. నిరాడంబరమయిన ఆవేషభాషలను బట్టియు, నిక్కులేమియుఁ గానరాకుండుటఁజేసియు పదిమందిలో గణన కెక్కకపోవుట అంత ఆశ్చర్యము కాదు. అయితే అతని రాష్ట్రములో మాత్రము అందఱి నోళ్లలో మెలఁగక తప్పలేదని ముందే విని యుంటిమి. 1921 లో అతఁడు, ఉత్మంజయీలో జాతీయ పాఠశాల యెటులు నెలకొలిపినది మన మెఱుంగుదుము. అసంఖ్యాకు లగు సేవకులను తయారుచేసి, అహమదాబాదులోని గుజరాతీ విద్యాపీఠము 1932 లో ఏ దశ అనుభవించెనో, అట్టి దుర్దశ చవిచూచిన పాఠశాల యిదియే. ఈ సేవకులే కొన్నేండ్ల పదపడి 'ఖుదాయీ ఖిద్మత్ గార్ లు' అని వ్యవహృతమగు గొప్పసంస్థకు బీజమని నుడువఁదగును. ఖాన్ సాహేబు ఈశ్వరోపాసకుఁడు కావున, తన స్వయంసేవకాదళమునకు ఇంకొక పేరు ఊహింపలేకపోయెను. 'ఖుదాయీ ఖిద్మత్ గార్' అనుటకన్న అత్యంత సమీచీనమయిన పేరు వేఱుగ ఏదియు నేరుకొన వీలులేదు. పఠానులను స్వైరవిహారములనుండి లూటీలనుండి మఱలించుట-వారికి విద్యావ్యాసంగము సమకూర్చుట-వివాహాదికములలో వ్యయము తగ్గింపఁజూచుట-ఇట్టివి ఆ సంస్థయొక్క పనులు. మున్ముందట, కేవలము సంఘసంస్కరణ

కనువగు చేఁతలకే ఈ స్వచ్ఛందసేవకులు ఉద్దేశింపఁబడిరి. ఖాన్ సాహేబు, కాంగ్రెసు—సంపూర్ణకార్యక్రమము కొనసాగించుటకయి ఈ చిన్న సేవకాదళమును సమగ్రమైన రాజకీయసంస్థగా మార్చుటకు నిశ్చయించినది 1929 లోనే. అట్టి యీ సంఘమునకు 'ఎఱ్ఱచొక్కాల దళమ'ని పేరువెట్టుట వేఁపికి వెఱ్ఱి యెత్తెనని ముందు మాట అని కాల్చివేయుటను పోలియున్నది. దేశభాషలో అనభిజ్ఞులగు అధికారులు కొందఱికి జాతీయము రమణీయమునగు 'ఖుదాయీ ఖిద్మత్ గారు'లను నామము శ్రుతికటువుగ ఉండి ఉండవచ్చును. సంఘసంస్కరణకు ఉన్ముఖమయిన ఏ యుద్యమ మందైనను విప్లవమును చూచుటకు సిద్ధులగు అధికారులకు ఎఱ్ఱ చొక్కాలదండులో విప్లవమే పొడసూపినది. ఆ దండునకు తొలుత తెల్లని ఖాదీదుస్తులే యూనిఫారముగ ఉండెనఁట. అయితే అవి అంతలో మాసిపోవువునని తెలియఁగానే కావిరంగు దుస్తులుగ మార్చుచేయ నిశ్చయించుకొనిరి. అది కేవలము రక్తవర్ణ మనుట పొసగనే పొసగదు. సోవియట్ రష్యాలోని ఎఱుపువన్నెకు ఈ వన్నెకు పొత్తు లేనేలేదు.

ఖుదాయీఖిద్మత్ గారులు సాగించుచున్న కాంగ్రెసు-కార్యక్రమము విదేశవస్త్రశాలలు మద్యపానశాలలు మున్నగువాని వద్ద 'పికెటింగ్'చేయుట. అనుదినము, వారు 'మిల్టరీ'-పద్ధతిలో శిక్షితులగుచుండిరి. కాలినడకను కడుదవ్వుఁగా అరుగుట కూడ ఒక విధి. లాటీలతోపాటు ఆయుధములన్నియు నిషిద్ధములు. ఎంత కఠోరమైన శిక్షకును వారు వశ్యులే. అతి స్వల్పమైన అవిధేయత చూపినఁగానీ, ఆజ్ఞాభంగము చేసినఁగానీ దళమునుండి వెళ్లవలసినదే. స్వయంసేవకులు ఈ దండులో చేరునాఁడు పవిత్రమైన యీ ప్రతిజ్ఞను దీసికొని తీరవలెను:—

1. ఈశ్వరునెడ జాతిపట్ల జన్మభూమియందు భక్తిప్రపత్తులు చూపుట.

2. సర్వదా దౌర్జన్యరాహిత్యము పాటించుట;
3. తాము కావించు సేవలకు ప్రతిఫల మపేక్షింపమి;
4. జంకుగొంకులు పోనాడి ఎట్టి త్యాగమునకయ్యు సంసిద్ధుఁడగుట;
5. నిష్కల్మషమగు జీవితము కలిగి యుండుట.

**1930**—ఏప్రియల్‌లో ఏనూఱులకన్న ఎక్కువగ **ఖుదాయీ** ఖిద్మత్‌గారులు లేరు. కాని, ఖాన్ సాహెబు నిర్బంధమే ఆ యుద్యమమును వృద్ధిపఱచినది. ఆ కాల్పులు లెక్కలేనన్ని లాఠీ కాండలు ఆ ఉద్యమమును అణఁచివేయఁజాలక పోవుటయే గాదు. ప్రత్యుత దానిని లోకప్రియముగ చేయఁగలిగెను. ఈ లాఠీప్రయోగములు, కాల్పులు—వీని వివరముల జోలికి పోనొల్లను. అందులకు వలయు సాక్ష్యసామగ్రి అంతయు సిద్ధమైనను, దానిని విచారింపఁదగిన అవకాశ మున్నను నేఁడా గొడవ ప్రజల యెదుట తలపెట్టరాదు; ఏమందురా! నేఁడు సత్యాగ్రహమహోద్యమము విరమింపఁబడి వీలునుబట్టి అయ్యది తిరుగ తలయెత్తకుండునటులు తన్మూల పురుషుఁడే మార్గములను అన్వేషించుచున్నాఁడు. స్వయంసేవకాదళము - ఆ అన్నదమ్ములు నిరపరాధులని నిరూపించుకొనుటకయి చేసినట్టియు ప్రభుత్వనిషిద్ధము లయినట్టియు ప్రకటనలలోని వాఙ్మూలమును సమర్థింపఁజాలిన గ్రంథము ఆ సోదరులవద్దఁ జాలఁగలదు. పెద్ద సోదరుఁడు నాతో వివరించిన పెక్కు దురంతములకు అతఁడే ప్రత్యక్ష సాక్షి; కాని సత్యాగ్రహోద్యమము ప్రకృతము స్థగితమయి యుండుటఁజేసి ఆ సోదరుల సమ్మతితో ఇపుడు ఈ విషాదఘట్టమును తెఱచాటు చేయుటయే నాకు భావ్యము.

అయితే ఒక్క సంగతిమాత్రము ఉల్లేఖింపక తప్పదు. ఈ స్వయంసేవకులపయిని దౌర్జన్యరూపమగు దోషము అధికారరీత్యా ఆరోపింపఁబడ్డది. **1930** నుండి **33** వఱకు 'ఎఱ్ఱచొక్కాల దండు'

దౌర్జన్యము ఉపయోగించినటులు ఒక్క ప్రత్యక్షనిదర్శన మయినను చూపఁబడదయ్యెడి. 1930 ఏప్రియల్‌లో పెషావరుసంఘటనలు అధికార-అనధికార విచారణలకు లోనయినవి. సులేమాన్ కమిటి —పటేల్ కమిటి—ఈ రెండింటి రిపోర్టులందును, అచ్చటి విషాద సంఘట్టనలనుగూర్చి రక్తము గడ్డకట్టునటులు వర్ణనలు ఉన్నను, ఇందు ఒక్కదానియందైనను అధికారులు సేకరించిన సాక్ష్యమందైనను, ఖుదాయీఖిద్‌మత్ గారులు—అనిగానీ; ఎఱ్ఱచొక్కాలదళము-అని గానీ ఉదాహృతమే కాలేదు. ఆ దళమునుగూర్చి దొరతనమువారు ఆరోపింపఁగలిగిన యంశము 1930 మే నెలలో ఆ రాష్ట్రమున చీఫ్ కమీషనరు చేసిన యీ ప్రకటనలో గుఱుతింపవచ్చును:—

"ఎఱ్ఱచొక్కాలు దాల్చు కాంగ్రెసు - స్వయంసేవకులు మీ గ్రామాలలో చొఱకుండ మీరు అపుదల చేయవలయును. వారు ఖుదాయీఖిద్‌మత్ గారుల మని (ఈశ్వర సేవకులు) చెప్పుకొందురు. వస్తుతః వారెల్లరు గాంధీసేవకులే. వారు బోల్షివిక్ దుస్తులు దాల్తురు. బోల్షివిక్ రాజ్యములో ఉన్నదని మీరు వినియున్న వాతావరణమునే వారును సృష్టింతురు."

వారు బోల్షివిక్కులే గాని మఱేమియుఁగాదను ఈ ప్రకటన లోని వాస్తవికార్థ మదేమో చెప్పుట చాలఁ గష్టము. కాని, ఏప్రియల్ 23 నాఁటి విషాదఘట్టము పిదప వెలువడిన అసంఖ్యాకములగు ప్రభుత్వ ప్రకటనలలో ఒక్కటియైనను, వారిని అపరాధులనుగా, నిరూపింపఁజూచినటులు లేదు. ఫాదర్ ఎల్విన్ 1932 లో తానొనర్చిన ఆ కొలఁది పర్యటనములో అధికారులను చూచెను. అధికారులు ఖుదాయీఖిద్‌మత్ గారులకు వ్యతిరేకముగ చెప్పిన దంతయు ఇదిగో! ఇది:—

1. జిల్లాలలోని కొందఱు పోలీసు—ఆఫీసరులను భంగపఱచుట—బండబూతులు తిట్టుట;

2. టోలు రప్పలు పేడ గీడ వారి కారులమీఁద విసరి వైచుట ;

4. టోలు రప్పలు వైచి కోహట్ వద్ద కాల్పులకు కారకు లగుట.

ఈయుద్యమము కేవలము అహింసాత్మకమే కావున, ఈదోసములు అలంతివి అని ఒప్పరికింపరాదు. కాని, దొరతనము బాధ్యతగల నాయకుల నందఱను అరెస్టు చేయుటఁ జేసి ఇట్టి అపరాధములు మానుటకయి విధించిన హామీలు రద్దుచేయఁబడ్డ వను సంగతి మఱువరాదు. మఱియు వీరజాతియగు ఈ పఠానులమీఁద క్రుమ్మరించిన భయంకరములగు పరాభవములు భంగపాటులు తలంచుకొన్న, ఈ ఈ నేరము లేవియు ఒక లెక్కలోనివి కావని గమనింపవలయును. జైలు విమోచనమునకై ఎట్టిచోక్కాల-ఖైదీలు ఇచ్చిరని చెప్పుచున్న పెక్కు క్షమార్పణములనుగూర్చిన గాథలు నే నిచ్చట చర్చింపవలెనా? అట్టి చర్చను ఎత్తుకొన్నచో రెండవపక్షమునకు చెందిన విస్తృతమైన ప్రకటనలోని తర్కమునకు, దించును. అది యీ గ్రంథ దృష్టికి మించిన విషయము. ప్రథమప్రకరణమున ఉదాహృతు లయిన ఆ యిరువురు వ్యక్తులు, క్షమార్పణముకన్న నిజముగా తక్కువ పరాభవమగు 'ధరావత్తు చెల్లించుట' ను సైఁపఁజాలక అసువులు విడనాడిరని మనము వినియున్నప్పుడు- ఈ కథ అసంగతమని అవిశ్వసనీయమని చెప్పినఁ జాలును. వీరపురుషులగు పఠానులు జైళ్లలోను వెలుపలను అనుభవించిన ఆ కష్టాలు, కోల్పోయిన ఆ స్థిర-చర-ఆస్తులు, ఉత్తేజకరమైన ఘట్టనలలోఁగూడ చూపెట్టిన అబ్బురమగు ఆ ఓరిమి-వీనిగూర్చి యెన్నఁడుగానీ సమగ్రమైన సత్యమైన ఉదంతము వ్రాయుట పొసఁగునేని అది యే జాతికైన గర్వింపఁదగు మన్నింపఁదగు గ్రంథము కాఁగలదు.

౬

# దోషారోపణము—సత్యము

అయితే, ఇఁక ఖానుసోదరుల అపరాధ మేమి? అధికారప్రకటనము లన్నియు జ్యేష్ఠ సోదరుఁడు డాక్టరు ఖానువిషయమయి మౌనము పూని యున్నవి. దొరతనమువారి కన్నులలో మెలఁగెడి ఒకానొక వ్యక్తియొక్క అన్నగారయి యుండుటయే ఆయన అపరాధ మంతయు అన్నటులు కన్పట్టుచున్నది. ఇఁక, చిన్నసోదరునిపై ఉన్న దోషారోపణములు ఇవిగో ! చూడుఁడు ;—

(1) గాంధిజీ రౌండుటేబుల్ కాన్ఫరెన్సుకు పోయినపుడు కాంగ్రెసు వర్కింగ్ కమిటి కోరిన తీరుగ ఈతఁడు కాంగ్రెసు-ఉద్యమమును నడుపుచు జిల్లాలలో హెచ్చుగ సంచారము చేయుట.

(2) నిషేధపుటాజ్ఞలను నిరాకరించి పల్లెటూళ్లలో ప్రచారము సేయుట; మసీదులలో మతబోధ లను వంకతో రాజకీయోపన్యాసము లొసఁగుట.

(3) భూమిసిస్తు-నీటితీరువ ఈయవలదనియు, సర్కారువారి కాలువల నీరు అక్కరలేదనియు ప్రజలకు ప్రబోధించుట.

(4) ఎఱ్ఱచొక్కాల దండు, ఒక విప్లవసంఘము. బ్రిటీషు జాతిని ఈదేశమునుండి బలవంతముగ వెడలఁగొట్టుటయే, వారిలక్ష్యము. ఖాన్‌సాహేబు వారి సాయముతో సరిహద్దుపరగణాలలో ప్రచారము సల్పుచున్నాఁడనుట.

(5) పెషావరులోని కాంగ్రెసు ప్రచారము మొహమన్డ పరగణాకుఁగూడ ప్రాకిపోవుట.

(6) ప్రావిన్షియల్ కాంగ్రెసుకమిటి, 1931 ఒకటవ-డిసెంబరు నాఁటి ప్రధానమంత్రిగారి ప్రకటనను నిరసించి, భారతదేశ స్వాతంత్ర్య-తీర్మానమును మఱల ప్రతిపాదించుట; దర్బారుకై రావలయునని చీఫ్ కమీషనరు అంపిన పిలుపును ఈ అన్నదమ్ములు-అనాదరించుట.

(7) దౌర్జన్యరాహిత్యసూత్రమందే ప్రాముఖ్యమీయఁబడినను, ఏదో ఒక గొప్ప సంఘటనను నిరీక్షించుటకును-అందులకై ఐకమత్యము పాటించుటకును-సంగ్రామముగా వర్ణింపఁబడ్డ ఆపోరాటము సాగింప సిద్ధముగా నుండుటకును ప్రజలలో ఉత్తేజము కలిగించుట.

(8) సంధి-తాత్కాలికమే అని ఖాన్‌సాహెబు సర్వదా అనుట.

(9) మీరట్‌లో-ఒకానొక కాన్ఫరెన్సులో తాను-కాంగ్రెసు, బ్రిటీషువారిని-ఇండియానుండి వెడలఁగొట్టుట యనెడి ఒకే లక్ష్యము కలిగియుండుటఁజేసియే తాను కాంగ్రెసులో చేరితినని చెప్పుట.

(10) ఖుదాయీఖిద్మత్ గారులు పంచాయతీలు పెట్టి కేసులు పరిష్కరించి తీర్పులు దిద్దుచు, తాము సాక్ష్యముల నిచ్చుటలో నిరాకరణ చూపుచు-ఈ తీరుగ 'లా' శాఖను హస్తగతము చేసికొనుట.

ఇందు, ౧-౬-౭-౯ ఆరోపణలకు ఖాన్‌సాహెబు చక్కగా ఒప్పుదల చూపును. ఇయ్యవి విశిష్య ఆతనికే చెందిన నేరములని అనుట కెవ్వఁడును ప్రయత్నింపఁడు. ఈ నేరములలో చిక్కిన పెక్కురు నాయకులిప్పుడు స్వేచ్ఛగానున్నారు. వారికెవ్వియు నిషేధపుటుత్తరువు లన్నవి లేవు. కొన్ని సందర్భములలో ఆతఁడు పన్నులనిరాకరణబోధించి

నది వాస్తవమే. అయితే ఆతఁడటులు చేసినది అపుడు ఆ నిరాకరణోద్యమము ఉండికాదు; ఆపాలము-ఆసాములు అట్టి పన్నులు చెల్లింపఁజాలని పరిస్థితులలో ఉండుటఁబట్టియే. తానుమాత్రము తన పన్నును చెల్లించివైచినాఁడు. ౨, ౪, ౫-ఆరోపణములు బొత్తిగా నిరాధారములు. సాధారణపుచట్టమును బట్టియే ఖాన్‌సాహేబును 'ప్రాసెక్యూట్' చేయుటకు ప్రభుత్వమునకు అవకాశమున్నది. సర్వదా తాను దౌర్జన్య ప్రచారము చేసెననిగాని అద్దానికి సుముఖత చూపెననిగాని ఉన్న దోషారోపణమును గూర్చి అతఁడు తీవ్రముగా ఖండించి, తానే అటులు చేసియున్న ఉద్యమము అవశీలగ దౌర్జన్య భూయిష్ఠమై ఉండెడిదనియు, అది అటులు పరిణమింపలేదనియు ప్రకటించెను. ఆఖరినేరము ఎఱ్ఱచొక్కాల దండునకు మొహనతు అగునేగాని న్యూనము ఇంతయుఁగాదు; మీఁదుమిక్కిలి అది, ఆ ఉద్యమము ఎంత సుష్ఠుగ నిర్వహింపఁబడ్డదియు, ఎఱ్ఱచొక్కాల దళము కోర్టులను నిరాకరించిన అసహాయోద్యమపు సిద్ధాంతమును ఎంత చక్కగా కొనసాగించినదియు తేటతెల్లము సేయుచున్నది. ఈ సిద్ధాంతమును పరరాష్ట్రీయులుకూడ పాటించిరేకాని ఎన్నఁడు నెఱవేర్చినది లేదు.

తొమ్మిదవ ఆరోపణ ఆమూలాగ్రము ఆలోచింపఁదగ్గది. ఏమందురా! 1931 లో గాంధిజీ కోరినమీఁదట, 'హోంసెక్రెటెరీ' అబ్దుల్ గఫూర్‌ఖాన్ సాహేబును చూచినపుడు అతనియొద్ద ప్రస్తావించినది ఈ మీరట్-ఉపన్యాస మొక్కటియే. అతని ఉపన్యాసములకు అధికారుల అనువాదము లనిపించుకొన్న కొన్ని అసభ్య ఘట్టములు ఇవిగో చూడుఁడు;—

“నాబొందిలో ప్రాణములుండునేని ఇంగ్లీషువారు నాయీదేశమును ఏలకుండ చూతును; దేవుని కృపచే విజయము పొందెదను.

"నా జాతికి ద్రోహముచేసి కాంగ్రెసులో చేరితినని నాప్రజలు నామీఁద నేరము లారోపించుచున్నారు. కాంగ్రెసు, బ్రిటీషు వారికి ప్రతికూలముగాఁ బనిచేయు ఒక సంస్థ. బ్రిటీషుజాతి, కాంగ్రెసునకు పఠానులకు ప్రతిస్పర్థి. అద్దాన నేను అందుఁజేరి బ్రిటీషుజాతి పీడ వదలించుకొనుటకయి దానితోఁ జేయి కలిపితిని. ఈ *ఫిరంగీల వ్యూహములకు మన మెన్నఁడు మోసపోవరాదు.

"మాకు (ఎఱ్ఱచొక్కాల దళము-కాంగ్రెసు) ఉన్నవి రెండు లక్ష్యములు. ఒకటి—దేశమును దాస్యమునుండి విడిపించుట; రెండవది—పేదసాదలకు కూడుగుడ్డలు ఒనఁగూర్చుట.

"స్వాతంత్ర్యము చేకుఱువఱకు నిదుర పోవలదు. తుపాకులకు బాంబులకు నీవు బుగ్గి అయినను మానె; ముంచుకొనిపోయినది లేదు. నీకే, పౌరుషమున్నచో యుద్ధరంగమునకు సిద్ధపడి నీ యిక్కట్టులకు మూలకందమగు ఇంగ్లీషువాండ్రతో పోరాడుము. కాంగ్రెసు-అన్నది ఆంగ్లేయులకు ప్రతికూలమైన ఒక సంస్థ. ఆంగ్లేయులు, కాంగ్రెసు - పఠానులు ఇర్వురకు శత్రుపక్షమువారు. అది యెఱింగియే యేను కాంగ్రెసులోఁ గలసిపోయితిని."

ఇంతకు మున్ను ఒక అధ్యాయమున అతని బార్డోలీ-ఉపన్యాసములో కొన్ని అంశములను ఉదాహరించి యుంటిని. వానితో ఈ భాగములను పోల్చి పరిచూడుఁడు. మీరట్‌లోను - సరిహద్దు రాష్ట్రములోను ఒసంగిన ఉపన్యాసములలోనివి యీ పై భాగములు. ఆవీరుఁడు-అట్టి సత్యవాది-అంతటి హృదయమిచ్చి పనిచేయువాఁడు అగు ఆ ధీరపురుషుఁడుకాదా ఈ రెండుతెగల ఉపన్యాసములలోను స్వీయదృక్పథమును విప్పి చెప్పుచున్నది? ఈ భాగములలో అతఁడు నిప్పులు సెఱుగువాఁడుగాఁగాక, వికారమైన అసహ్యమైన

* తెల్లజాతులవారు

అనువాదమునకు పాత్రము కాలేదా? నిజముగా నాతఁడు 'లడాయి' మాటలే మాటలాడును గాని ఆ రోజులలో అటులు ఎవరు మాటాడి యుండలేదు? నాఁడుగాదు, నేఁడుగూడ ఎవ్వరటులు మాటలాడరు? అయితే అది, దొరతనమువారు నిరాధారముగ ఆరోపించినటులు బ్రిటీషువారిని బలాత్కారముగ తోలివైచుటకుఁ గాదు; అనువాదమున సయిత మంగీకరించినటులు తుపాకులకు బాంబులకు గురియయి బుగ్గి కావలసివచ్చుటఁజేసియే అది యట్లగుట.

ఆ 'సంధి' సమాచారమన్న ఉద్యోగిబృందమునకు కడుపు మంటగ నుండెడిది; అందును విశేషించి సరిహద్దురాష్ట్రీయులలోని అధికారులకు మఱీ కంటకముగాఁ దోఁచెను. నాఁడు నేఁడు కూడ, ఎఱ్ఱచొక్కాలదండు దౌర్జన్యపంథలో దిగినదనిగానీ, ఖాన్ సాహేబు దౌర్జన్య సిద్ధాంతమును ప్రచారములో దించుచున్నాఁడని గానీ కాదు దొరతనమువారి ఆరాటము; అయితే తాము చవి చూపిన కఠోరమైన బాధలు సయితము వారిలోని దౌర్జన్యరేఖలను రెచ్చగొట్టలేదనియు, అచ్చముగా వారు గాంధీ సేవకులే అయిపోయిరనియు, (ప్రభుత్వ ప్రకటనలో ఇది సుస్పష్టమే) సరిహద్దు గాంధికి పూర్తిగ విధేయులయి ఉన్నారనియు- ఇదియే పాపము!! ప్రభుత్వమువారి ఉడుకుఁబోతుతనము.

౭


# ఆంగ్లేయు లెఱుంగవలసినది

ఇప్పుడు మనము పరిశీలించిన నేరములు ఇంతకు మూఁడేళ్ల నాఁటివి.

నిరాధారములయిన ఆ నేరములకు మూఁడేండ్ల కారాగారవాసము చాలినంత శిక్ష కానటులు, ఖాన్ సాహేబు నాక్షేపించువారిలో ఇటీవలివాఁడగు సర్ మైకేల్ ఓ డయ్యర్, 'మార్నింగ్ పోస్టు' పత్రికలో ఒక వ్యాసమున మఱికొన్ని నేరము లారోపించుచు, విద్రోహులకు ఆ నియమిత స్వేచ్ఛను ప్రసాదించినందులకు దొరతనమువారిని నిందించెను. తన తొలిరోజులు సరిహద్దురాష్ట్రములోఁ గడపి, ఆ రాష్ట్రమును- ఆ రాష్ట్రపు నాయకునిగూర్చి ప్రభుత్వమున కన్న తనకే మిన్నగఁ దెలియునని వాదించి, ఈ 'ఎక్స్-కమీషనరు' ఆ సోదరులకు విప్లవవాదముతో ముడివైచి వారినిగూర్చి మఱికొన్ని విశేషాంశములను త్రవ్వి తలకెత్తఁజూచినాఁడు:— "గాంధిగారి అహింసాసిద్ధాంతమును అపహసించుచున్నను; ఆంగ్లేయులను సాగనంపుటలో దాపురము లేకయె చాటుచున్నను ; సరిహద్దురాష్ట్రమున 'సోవియట్'- శిష్టముపైని 'కమ్యూనిస్టు- రిపబ్లిక్కు'ను స్థాపింపఁ దలపెట్టుచున్నను, గొప్పసాహసి ఆఫ్గన్ విప్లవవాదియు అనఁదగు అబ్దుల్ గఫ్ఫార్ ఖాన్ సాహేబును 'సరిహద్దుగాంధి' అని వ్యవహరించుచున్నారు?" నిశ్చయముగా ఈ వ్రాఁతలు సర్కారువారి ఆరోపణలకు పునర్ముద్రిత ప్రచురణములవంటివి. సర్ మైకేల్ యొక్క సొంత సొమ్ము-పాకముపట్టిన విషమువంటిదియు నగు దీనిముందు అధికారుల ఆరోపణలు పట్టి నిర్జీవములు. కాని, ద్వేషపూరితమగు దోషా

రోపణయను సౌధము ఎట్టి పునాదిమీఁద కట్టఁబడినదో గుఱుతిం చుఁడు. ఆ 'డయ్యర్ సేనాని' ఏమనెనో వినుఁడు:— "అబ్దుల్ గఫూర్, మన ప్రతిస్పర్థులగు సరిహద్దుజాతులతో సన్నిహిత సంబంధము కలిగియున్నాఁడు. ఇటీవల పెక్కుతూరులు 'మొహామన్దులను-అఫ్రిడీలను-లాఁతిజాతులను' రెచ్చఁగొట్టి పెషావరుమీఁదికే దండెత్తఁ జూచినవాఁడును, మన దీర్ఘవిరోధియునగు 'తురంగజాయి' హాజీకి సాక్షాత్తు ఇతఁ డల్లుఁడు."

ఇప్పుడు అసలు విషయములకు వత్తము. అబ్దుల్ గఫూర్‌కు ఆతని ద్వేష్టయగు డయ్యర్‌కు ఎంత సంబంధబాంధవ్యము లున్నవో అంతలోనివే గఫూర్‌కు తురంగజాయిహాజీకి ఉన్న చుట్టరికములని మునిముందు నన్నుఁ జెప్పనీయుఁడు ; ఖానుసాహేబు మామగారు రజ్జార్‌కు చెందిన సుల్తాన్ మహమ్మద్‌ఖాన్. ఆతఁడు ఆమరణాంతము జే. పి. (జస్టిస్ ఆఫ్ ది పీస్) ఆతని సేవలను ఖానుల కంటెఁగూడ ప్రభుత్వాధికారులే లెస్సగ ఎన్నఁగలరు. అట్టియెడ సర్ మైకేల్‌దొర, హాజీకి ఖాన్‌సాహేబు మామగారికి ఎట్టులు ముడి వెట్టెనో ? అదేమో నేను వివరించి తీరవలెను. హాజీ, తురంగజాయి ఊరికి చెందినవాఁడు ; అది ఖాన్‌సాహేబు గ్రామమగు ఉత్‌మంజయీకి చాల దగ్గఱ. 1911 లో సాంఘికసేవకై సాధనములుగా సొంత స్కూళ్లను స్థాపించినపుడు హాజీ పదిమందికి ఎఱుక అయ్యెను. ఆ రాష్ట్రమున జాతీయవిద్యలో మార్గదర్శకుఁడయిన హాజీతో అబ్దుల్ గఫూర్ నిరాతంకముగ చేయి గలిపెను. ఇది బహుశః సర్ మైకేల్ ఆ రాష్ట్రములో జూనియర్ సివిల్ సర్వెన్ట్‌గా ఉండుతఱి జరిగి యుండును.. పిదపఁ గొన్నాళ్లకు ఈ హాజీ చండప్రచండమగు ప్రసిద్ధికి వచ్చియుండుటఁజేసి ఆతనికి ఖానుకు ఉన్న పూర్వపరిచయమును గూర్చి తనకున్న జ్ఞానమును దుర్వినియోగము సేయుట భావ్యమనియే



పండట జవహారలాల్ నెహ్రూ, డా. ఖాన్‌సాహేబు,
పండిట్ జీవనలాల్ కాట్జూ
(లండనులో 1910 లో తీయఁబడిన చిత్రము)

మైకేల్ దొర భావించెను ; మఱియు కన్నులకుఁ గట్టినట్టులు చిత్రించుటకోసమయి సత్యమును పాఱఁదోలుట పాపమని తలంపకుండుటచే ఆతఁడు ఖాజీని ఖానుకు మామగా బనాయించినాఁడు. హాజీ యొక్క దశావిశేషమునుగూర్చి ప్రస్తావించుట కిది అదను గాదు ; కాని, 1915 లో హాజీ పాఠశాలలు మట్టుపెట్టఁబడ్డవనియు, ఆతఁడు స్వగ్రామమునుండి పలాయితుఁ డాయెననియు, నాఁటినుండి తిరుగ నెన్నఁడు రానేలేదనియు నిది మాత్రము చెప్పితీరవలెను. అతఁడు 1919 లో ఆంగ్లేయులకు ప్రతికూలముగ ఆఫ్గనులకు మద్దతుగా ఉండినటులు తెలియుచున్నది. అబ్దుల్ గఫూర్ ఖాను, 1921 లో ఖిలాఫత్ ముహాజరీనులను ఆఫ్గనిస్థానమునకు తరలించినపుడు రాకపోకలలో హాజీని దారిలోఁ గలసికొనెను. కాని, నాటినుండి యిప్పటివఱకును అబ్దుల్ గఫూర్ ఆతని చూడనులేదు ; అతనిగూర్చి వినను లేదు.*

హాజీని గూర్చిన కథ అది. ఇఁక ఖాన్ సాహేబుకు సరిహద్దు జాతులతోడి సంబంధ మదేదో విచారింతము. సరిహద్దుపరగణాలను గూర్చి కొద్దివిషయములను ముందు గమనింపవలయును. అవి పర్వత ప్రాంత భూములు. అయిదు బ్రిటీషుజిల్లాలకు ఆవల బెలూచి-హిందూకుశ్ వఱకు అవి అంటియున్నవి. స్వతంత్ర ప్రదేశమని ఆ భాగమునకు పేరు. విస్తీర్ణములో అది ఆ బ్రిటీషుజిల్లాలకు దరిదాపు రెండింతలు ; జనసంఖ్యయు అంతే. పఠాను లెల్లరు కొలఁదిభేదముతో

* కొండజాతులకు నాయకుఁడగు ఈ తురంగజాయ్ హాజీ మొన్ననే 14 డిసెంబరు 1937 తేదిని చనిపోయెను. ఆ జాతులకు ఈతనిపట్ల అత్యంత గౌరవాదికములు కలవు. ఈతని వయస్సు 105 యేండ్లు. 1912 నుండియు, బ్రిటీషు ప్రభుత్వముతో ఈతఁడు పోరాడుచునే యుండెను. ఈతని నిర్యాణమువలన ఆ జాతులకు తీరనికొఱత యేర్పడినది:--

అనువాదకుఁడు.

పష్తోభాషను మాటలాడుదురు. స్వతంత్రదేశమను- ఆపేరు అన్వర్థక ము కాదు. ఏమందురా, బ్రిటీషుజిల్లాల గవర్నరే ఈ భాగమున అధి కారము చలాయించు గవర్నర్ జనరల్ యొక్క ఏజంటు. అద్దాన సరిహద్దుజాతులవారు చదరంగపు పలకమీఁది పావులకంటె తామే మియు మెఱుఁగుగాదని తెలుచుగాఁ దెలిసికొనియే యుండిరి. వారొక విధముగ మోటువారుగను, ఒకరి మాట వినని వారుగను గావచ్చును ; కాని, తమ పరిసరములలో పరిఢవిల్లు ప్రబోధమును గుఱుతింపలేనంత మూఢులు మాత్రము కానేరరు.

ఒక పఠాను కోపోద్రిక్తుఁడు కాకయే నవ్వుచునే లాఠీ పోటులు తినుట యన్నది యీజాతులవారికి వింత అయిన ఉదంతము. ఇట్టి దృశ్యమే ఇరుగు పొరుగు మఱికొందఱికిఁగూడ ఉద్యమమునఁ జేరవలయునను శ్రద్ధ కలిగింపఁజాలినది. మఱియు ఆజాతికే ఆ మత మునకే చెందిన దోఁపిడికాండ్రు కొందఱు మిత్రులుగా ఉండి తాము సర్దారులక్రింద అణఁగిమణఁగియుండుటను, వస్తుతః దాస్యమున పెనవైచి యుంచిన ఆంగ్లేయుల క్రింద బానిసీలుగ పడియుండుటను త్రోసిరాజనుటలో విస్మయ మేమియు లేదు. వర్తమానయుగమున ప్రజాబాహుళ్యములోని అజ్ఞానమును ఆధారముగాఁ గయికొని ఆట లాడఁదలంచుటకన్న గొప్ప మూర్ఖత మఱిదియు ఉండఁబోదు. ఒకటి కొకటి దగ్గఱివియగు మలకంద్-బాజౌర్-స్వాత్ భాగములనుండి ఆ జాతులవారు తమ బిడ్డలను 1921 లో తాను నెలకొల్పిన ఆజాద్ స్కూళ్లకు పంపించెడివారనియు, బ్రిటీషు జిల్లాలలోని తోడి సోదరుల సుఖదుఃఖములలో తమ సుఖదుఃఖములను కొంతవట్టు మేళవింపఁ జేసెడివారనియు ఖాన్ సాహేబు నాతో నుడివెను. వారిలోఁగొందఱు ఖుదాయీ ఖిద్మత్ గారులతోఁ గలిసి గత- ఆందోళనలో జైలుకు పోయియుండిరి. కాని, యీ పరగణాలకు ఆవలిజాతివారిలో

ఏమియు సంచలనము కలుగలేదు. ఈజాతులవారి నెల్లరను శాంతి ప్రియులుగాఁ జేసి సరిహద్దురాష్ట్రము నంతయు ఒకే సూత్రముక్రింద నడిపింపవలయునను తన ఉద్దేశమును అబ్దుల్ గఫూర్ ఎన్నఁడు దాఁచినది లేదు. కాని, అది ఒక కల ఆయెను. అతఁడు సరిహద్దును దాఁటుటకుఁగూడ అనుమతి లేకపోయెను. 1931 లో శ్రీ దేవదాసు గాంధి, ఆ రాష్ట్రము చూడనేగి ప్రపంచమంతకు అత్యంత సుందరములగు దృశ్యములను చూపఁజాలిన చకధరా-బ్రిడ్జిని చూడఁగోరి నపుడు-ఖాన్‌సాహేబు తన అతిథికి అలంతియగు ఈ ముచ్చటనే తీర్చు భాగ్యమునకు నోఁచుకొనఁడాయెను. ఈ వంతెన, మలకండ్-ఏజెన్సీగుండ పోయెడి ఒక పెద్దరోడ్డునకు ఆవల నున్నది. తాను, అబ్దుల్ గఫూర్ ఖాను కేవలము అందలి దృశ్యములను చూచుకొనుటకే అటకు పోఁదలఁచితిమని అచ్చోటి అధికారులకు శ్రీ దేవదాసు గాంధి స్పష్టపఱచెను; ముందుగా ఏర్పాటులు లేకుండెనన్న వంకతో అది అదను గాదని అధికారులు త్రోసిపైచిరి! ఆ జాతులను గూర్చి నేఁడు మనము వినునది యంతయు వారి దోఁపిళ్లకు బ్రిటీషుజిల్లాలు తఱచుగా గురి అగుచున్నవను మాటయే. బందిపోటులు దోఁపిడులు జరుగునప్పుడు, ఖుదాయీ ఖిద్‌మత్ గారు ఆత్మరక్షణార్థమయి బల ప్రయోగము పాటింపవచ్చునా యని గాంధిజీని ప్రశ్నించునంతటి భక్తి తాత్పర్యములను, అహింసయందు విశ్వాసమును అబ్దుల్ గఫూర్ ఖాన్ కలిగి యున్నాఁడను సంగతి సర్ మైకేల్ ఓడయ్యార్ గుర్తెఱుంగుఁగాక ?

ఖాన్‌సాహేబు, బహిరంగముగానే గాంధిజీయొక్క అహింసా సిద్ధాంతమును అపహసించునని సర్ మైకేల్-దొర చేసిన ప్రకటనలో ఎంత అసత్యవర్ణనము ఉన్నదో-1931 లోని ఖాను సాహేబుప్రకటనవలన స్పష్టమగుచున్నది. ఇంతకుమున్ను

సర్కారు రిపోర్టు ఒకటి ఘోషించినటులు తక్కిన రాష్ట్రములకన్న తన రాష్ట్రము ఘాతుకమైనదన్న సంగతి యెన్నఁడు ఖాన్ సాహేబు కాదనఁడు. కాని, దానిని ఘాతుకత్వమున తక్కువదిగాఁ గావింపను, వలనుపడెనేని దౌర్జన్యమును హత్యలను ఆమూలము పరిహరింపను అహింసావ్రతము తాను అవలంబించితినని కూడ ఖాన్ సాహేబు ఘంటాపథముగాఁ జెప్పియున్నాఁడు. అల్లరులు చెలరేగెడి ఆ రాష్ట్రమునకు అహింసావ్రతము తక్క మఱిదియు శాంతిని ఒనఁగూర్పదు. హిందూదేశమున సత్యాగ్రహము ఆచరణకు వచ్చుటకు మున్నె ఎన్నఁడో ఈ సిద్ధౌషధమును ఖాన్ సాహేబు కనిపెట్టియుండెను.

1931 లోనే ఖాన్ సాహేబు చెప్పియున్నదియు, 1931 జూన్ 11 వ తేదీనాఁటి 'యంగ్-ఇండియా'లో ఆతని సొంతమాటలతో ప్రచురితమయినట్టియు ఈ క్రింది విషయములనుబట్టి ఆతని సత్యమును-సముత్సాహమును సద్భావముగల యే వ్యక్తియు గుర్తింపలేకపోవఁడు;—

"నా అహింసాసిద్ధాంతము ఇంచుమించుగ నాకు మతవిశ్వాసముగ మారిపోయినది. ఇంతకు మున్ను నేను 'గాంధిజీయొక్క అహింసావ్రతమును విశ్వసించితిని. కాని, నా రాష్ట్రములో అహింసా ప్రయోగముయొక్క అపూర్వమగు విజయము నన్ను గట్టి అహింసావాదిగా బలపఱచినది. దైవము సరిచూచునేని, ఇఁక నా రాష్ట్ర మెన్నఁడును హింసలో అడుగు వెట్టదని ఆశింతును. మన పేరు ప్రతిష్ఠలు రూపుమాపు రక్తపాతపు పోరితములవలన దౌర్జన్యములోని దుష్ఫలిత

ములు లెస్సగా మనకు బోధపడుచున్నవి. మనకు మన స్వభావమందే హింసాతత్త్వము కావలసినంత. అద్దాన అహింసావ్రతమున అభ్యాసము పొందుట మనకే చాల మంచిది. మఱియు, పఠాను వశ్యమగునది ప్రేమకు తర్కమునకు మాత్రమే కాదా ? ఆతని హృదయమును లోపఱచికొంటివా నీతో ఆతఁడు నరకమునకైన వచ్చి తీరును. కాని, స్వర్గమునకైనను జబరుదస్తీతో ఆతని తీసికొని పోఁజాలవు. పఠానుపై ప్రేమప్రభావము అట్టిది. తన కితరులు ఏతీరుగఁ జేయవలయునని తలంచునో అటులే తాను సయితము లాఁతివారికిఁ జేయవలయునని పఠానులను నేను తెలియఁగోరెదను. నేనొకవేళ ఓడిన ఓడవచ్చును; హింసాతరంగములు నారాష్ట్రమంతయు కప్పివేసినను వేయవచ్చును; అపుడు—అది నా దౌర్భాగ్యమనియే యెంచి తృప్తి నొందెదను. కాని, తక్కినవారందఱికన్నను విశేషించి నా ప్రజలకు కావలసియున్న అహింసాసిద్ధాంతములో నాకున్న గాఢవిశ్వాసమును మాత్రము అది కదలింపఁజాలదు."

ఇపుడు, ఖాన్ సాహేబు కుటుంబమునుగూర్చి కొంత ప్రస్తావింతము; ఇది విన్నచో ఆకుటుంబమునకు ఆంగ్లేయులమీఁద ఉన్నవను కొను ప్రతికూలభావములయు ప్రతికూల చర్యలయు అపోహలన్నియు విడిపోఁగలవు. ఈ కుటుంబములో ముఖ్యులయిన కొందఱిని చదు

వరి కెఱింగింతును. డాక్టరు ఖానుకు ఆంగ్లపత్ని ఉన్నదని పాఠకున కిదివఱకే తెలియును గదా. భర్త జైలులో పడుటకు మున్ను ఆమె హిందూదేశమందు ఉండఁగా ఆమె యిల్లు (ఇపుడు ప్రభుత్వము వారిచే కొద్దివెలకే కైకొనఁబడినది) పెక్కురు అధికారులతోపాటు వివిధమిత్రమండలికిని ఆశ్రయభూతము ఆయెనన్న సంగతి చదువరి యెఱిఁగియుండక పోవచ్చును. అప్పటి గవర్నరు కల్‌నల్ సర్ రాల్ఫ్‌గ్రిఫిథ్ యొక్క భార్య ఆమెకు అత్యంతము నెచ్చెలిగ ఉండెడిది. కల్‌నలుగూడ డాక్టరుకు తఱచుగ అతిథిగ ఉండాట కద్దు.

డాక్టరు ఖాన్‌సాహేబు బిడ్డలలో ఒకఁడు ఇప్పుడే లండను మెట్రిక్యులేషన్ ప్యాసయి ఆక్స్‌ఫర్డ్‌లో చదువ తలపెట్టుచున్నాఁడు. ఆతని కూఁతురును, ఒక మాసము క్రిందటిదాఁక డాక్టరు ఖానుభార్య అదుపులో ఉన్న అబ్దుల్‌గఫూర్‌ఖాను కూఁతురును ఇరువురు ఒక ఇంగ్లీషుస్కూలులో చదివియుండిరి. డాక్టరు ఖాన్‌సాహెబు యొక్క పెద్దబిడ్డ (మొదటిభార్య కొడుకు) సాదుల్లాఖాన్, చదువు పూర్తిచేసి లా ఉబరో ఇంజనీయరింగ్ కాలేజినుండి సివిల్ ఇంజనీయరింగ్ డిగ్రీ పుచ్చుకొని 1930 లో ఇంగ్లండునుండి తిరిగివచ్చినాఁడు. రెండవబిడ్డ, ఇప్పుడు ఇండియా అంతట తన 78 రోజుల నిరశనవ్రతము మూలమున విఖ్యాతికి వచ్చిన ఉబేదుల్లాఖాన్, మదరాసుకాలేజిలో తోళ్లపరిశ్రమలో పరిశ్రమించి అందు ఉన్నతవిద్య పడయుటకై ఇంగ్లాండు పోవలెనని ప్యాస్‌పోర్ట్ సంపాదించెను. కాని, అంతలో ఆతఁడు పన్నుకట్టలేదను కారణమున అరెస్టు కావింపఁబడియె. అబ్దుల్ గఫూర్‌ఖానుబిడ్డలలో జ్యేష్ఠుఁడు అబ్దుల్ గనీ, చక్కెఱ పరిశ్రమలో నేర్పుకోసమయి ఇంగ్లండులో రెండేండ్లును అమెరికాలో మఱికొన్నేండ్లును కాలము గడపినాఁడు. పిత్రార్జితములగు ఎస్టేటు-భూములలో ఆ విద్యను ఉప

యోగమునకు లేవలయుననియే ఆతని సంకల్పము; కాని, ఇప్పుడు ఆ 'ఎస్టేటు' ఆర్డినెన్సు రూలుక్రింద చిందరవందర ఆయెను. అతఁడు కొన్నాళ్లక్రిందటివఱకు ఠాగూరుకవి శాంతినికేతనములో కాలము పుచ్చెను. రెండవబిడ్డ అబ్దుల్ అలీ, మొన్నటిదాఁక డెహరా డూన్‌లో కల్నల్ బ్రౌన్ స్కూలులో చదివి అచ్చట సీనియర్ కేంబ్రిడ్జి పరీక్షలో ఉత్తీర్ణుఁడాయెను. కడగొట్టు బిడ్డ ఇప్పటికిని ఆ స్కూలులో చదువుచున్నాఁడు.

రెవరెండ్ విగ్రామ్ గూర్చి ముందొక ప్రకరణములో ముచ్చటించియుంటిని. ఈ అన్నదమ్ములిరువురు సహృదయుఁడగు ఆ ఫాదరీకి శిష్యులు. ఇప్పటికిని ఈ యిద్దఱు ఆయనను పదేపదే స్మరింతురు. పెరిగి పెద్దలయిన కొలఁదిని వీరికి విగ్రామ్ కుటుంబముతో పరిచితి క్రమముగా మైత్రిగా పరిణమించి అనుస్యూత మాయెను. అప్పుడు లివింగ్‌స్టన్ కాలేజి ప్రిన్సిపాలు అగు రెవరెండు విగ్రామ్ యొక్క సోదరుఁడయిన డాక్టరు విగ్రామ్ సహకారము సమగ్రముగ ఉండుటఁ బట్టియే లండనులో సెంట్‌థామస్ హాస్పిటల్‌లో ప్రవేశము పడయఁగలిగితినని నేఁటికిని డాక్టరు ఖాన్‌సాహేబు కృతజ్ఞతతో మురియుచుండును. అతఁ డానాఁడు 'ఇండియన్ మెడికల్ సర్వీస్'లో ఉండుతఱిని ఏర్పడిన పెక్కుమంది మిత్రులు నేఁటికిని అతఁడన్న నెయ్యము చూపుచునే యున్నారు.

డాక్టరు ఖానుసాహేబు పెషావరుక్లబ్బులో మెంబరు. ఆ క్లబ్బుసభ్యులు ఇంచుమించు అందఱు మిల్టరీ-ఉద్యోగులే. అతఁడు స్కౌటు-కమీషనరుకూడ. ఒకవేళ ఆతఁడు జైలులో పడినపు డేమైన ఆ సభ్యత్వము- ఆ కమీషనరు పదవి తొలఁగింపఁ బడి యుండవచ్చునేమో! జైలువాసము ముందు ఉద్యోగులతోను-

అందును మహోద్యోగులతోను ఆతనికిఁ గల సంబంధములనుగూర్చి ఇంతకుముందే ఉదాహరించియుంటిని. అతఁడు జైలులో ఉండు నపుడు మిస్టరు రాబర్ట్ బ్రౌనుదొర తన అత్తగారి దేశమగు ఆస్ట్రేలియానుండి ఆతనికి వెనుకటిరోజులనాఁటి సౌఖ్యావహములయిన ఆదరాదికములను ఆవిష్కరించుచు, స్నేహపూర్వకమైన ఒక ఉత్తరమును వ్రాసినాఁడు. అందు-ఆతఁడు అబ్దుల్ గఫూర్ ఖానును ఉద్దేశించుచు, 'అబ్దుల్ గఫూర్ ఖాన్ వంటి ఉదారహృదయుని మహోన్నతవ్యక్తిని నేనెన్నఁడు కలసికొనియుండలేదు' — అని వ్రాసెను. ఆ బ్రౌనుదొర స్కాట్లండ్ దేశీయుఁడు. అగ్రికల్చర్ డిపార్టుమెంటులో ఒక ఉన్నతోద్యోగి. తన ఉద్యోగధర్మమునుబట్టి ఆ రాష్ట్రమంతయు కలయఁ దిరిగినవాఁడు. ఇప్పుడు ఆతఁడు రిటైర్ అయినాఁడు. ఈ సోదరులకు ఉన్న ఇంగ్లీషువారితో సంబంధములును, వీరి బిడ్డలకు ఇచ్చు బ్రిటీషు వాతావరణములోని విద్యావ్యాసంగములును 'ఆఫ్గన్ విప్లవవాదులు - సోవియట్ రిపబ్లిక్ - నిర్మాతలు' అనఁబడు వారికిఁ గిట్టనిసంగతులని స్పష్టపఱచుటకే ఈ వ్యక్తిగత వివరములన్నియు ఇంతదాఁక ఇచ్చియుంటిని. మఱొక్కసంగతి:—పంజాబులోని మహమ్మదీయ వార్తాపత్రికలలో మతాంధములగు కొన్ని, హిందూముస్లిముల పొందునుగూర్చి భారమునెత్తిని ఎత్తికొన్నందులకు ఈసోదరులను తిట్టి రాల్చిపోసినవి ; అంతే కాదు—వీరు తమ బిడ్డలను చదువులకయి 'ఇంగ్లండు - అమెరికాల'కు పంపిరను నెపముతో ఇస్లాముమతములో వీరికిఁగల శ్రద్ధాభక్తులను సయితము శంకించువఱకు వచ్చినది !

సోవియట్ రిపబ్లిక్ సంస్థాపకులని వీరియెడ ఆరోపించిన దానినిగూడ మనము గమనింతము. అబ్దుల్ గఫూర్ ఖాను ఉపన్యాసములలో ప్రభుత్వమువారు ప్రకటించినవానియందు 'సోవియట్'

విధానమునుగాని 'రష్యా'ను గూర్చిగాని ఎవ్విధమైన సూచనలును గానరావు. భారతదేశమున - సరిహద్దురాష్ట్రమున అవశ్యము కావలెనని వారుకోరు కోరికలలో 'బోల్షివిజము' లేనేలేదు. బ్రిటీషురాజ్యమన్న, వారికెంత భీతికలదో 'సోవియట్' అన్నను అంత బెదరు. జిల్లాలలోని గ్రామపునరుద్ధరణమనెడి ప్రశాంతమగు కార్యాచరణలో వారి కెక్కువ మక్కువ. వారి హృదయములు అచ్చముగ అందే హత్తుకొని యుండును. ఖాన్‌సాహేబు నాతో ఒకతూరి యిటులు ప్రస్తావించెను:—"మా ప్రాంతాలలో గుడ్డల నేతగాండ్రు పెక్కురున్నారు. అయితే క్రమక్రమముగ వారిసంఖ్య సన్నగిల్లిపోవుచున్నది. మా జిల్లాలలో నేను చరఖాసూత్రమును ప్రచురప్రచారమునకు తేఁగలిగితినేని చరితార్థుఁడ నయ్యెదనని తలంతును." ఆ రాష్ట్రమున అయిదుజిల్లాలలోను సుమారు మూఁడువేల గ్రామము లున్నవి. వానిలో ఖాన్‌సాహేబుచూడని ఊరు ఒక్కటియు ఉండఁబోదు. నేను నూలువడుకుట నేరిచియు, నిత్యము స్వయము వడుకకయే చరఖానుగూర్చి యీమాటలాడుటలో అర్థములేదని యాతఁడు చెప్పుచు, వడుకుటకు దొరఁకొని మూఁడునాలుగు నాళ్లలోనె ఉగ్గులువాఱని బుడుపులు లేని వడిగలిగిన దారమును తీయనేర్చెను.

'సోషలిస్టు' సిద్ధాంతముపై వాదింప సిద్ధపడువానితో—"గాంధిగారికన్న మిన్నయగు సామ్యవాది యెవ్వరో మాకుచూపుఁడు; వానిని మేమనుసరింతుము"—అని యా సోదరులు పలుకుదురు. తమ జిల్లాలలో ఇన్నేండ్లకని అప్పుడప్పుడు జరుగుచు వచ్చెడి భూముల పునర్విభాగములనాఁటి సంగతులనుగూర్చి వారు స్మరించుచుందురు. నాకు సాంగోపాంగముగ బోధపడియుండని ఆ భూముల పునర్విభాగములగూర్చి చర్చించుచు అబ్దుల్‌గఫూర్ ఇటులు వచించెను:—"ఒకవిధమగు జమీందారీకి నామాంతరమగు 'ఖాన్‌పదవి'

బ్రిటీషువారి సొంత సృష్టి. కొంగ్రొత్తగా స్థాపింపఁబడ్డ నవ్యపరిపాలనకు ఊఁతగా ఉండుటకే అట్టి 'ఖాను పదవులు' 'జమీందారీ'లు సృష్టింపఁబడ్డవి. వందలతరబడి ఎకరాలు, ఖానుగా ఉన్న మా పితామహుని చేతికి అందీయఁబడియున్నను నే నీమాట చెప్పుచుంటిని. 1848 లో బ్రిటీషుపరిపాలన నెలకొల్పఁబడిన పదపడి సుమారు పాతికేండ్లపిదప ఇది జరిగినది. అంతకుముందు, మా ఖానులకు 'జిర్గా'లు (తెగలు) ఉండెడివి. అందు సమావేశితులగు ఖానులెల్లరు, గ్రామములను - అందలి భూముల ఖండములను అన్నింటిని లెక్కచూచి లాటులు వేసికొనెడివారు. ప్రతి - ఇరువది యేండ్లకును ఇది జరుగుచుండెడిది. ఖానుతోపాటు అందఱును దరిదాపు ఒకే పరిమితిగల భూవసతిని కలిగి యుండెడివారు. ఈ పునర్విభాగప్రణాళికప్రకారము ఊళ్లూళ్లను ఒక ఊరినుండి మఱొక ఊరికి మార్పుకూర్పులు పొందుచుండెడివి. ఇంతకన్నను సిసలయిన సామ్యవాదము మఱేముండునో నే నెఱుంగను."

## ౮

# ఇంటెల్లపాది జైలులో

ఈ అన్న దమ్ముల కడపటి జైలుశిక్షలో ఇన్నాళ్లవఱకు అను పరిమితి లేదు. అద్దాని వివరములను సంక్షేపముగా ఈయవలసిన విధి నాకు కలదు. సరిహద్దురాష్ట్రముమాట మాత్రమే చూచినను సంధి-భగ్నము కావుటకు బాధ్యులెవరా-అను ప్రశ్నమును సాకల్యముగ పరిశీలించుట విసుగుపని. అనువగు వివరములు అందుపాటులో ఉండుటయు అసంభవము. కాని, ఖానులు తాము చెల్లింపవలసిన సిస్తులు చెల్లించియుండుటఁజేసి పన్నుల నిరాకరణ అన్నది అపుడు లేకున్నను, అది సంధికాలమే అయినను ఖుదాయీఖిద్‌మత్ గారులు ప్రత్యేకబాధలకు లోనుగావలసి వచ్చెనను ఉదంతము మనము మఱువరాదు. వెనుకటి వానిని త్రవ్వుటగానీ దొరతనముమీఁది దోసములు చూపుటగానీ ఈ పుస్తకము ఉద్దేశము కాదు కావున దారుణమైన హింసకు చెందిన పెక్కు విషయములను సూచింపక అట్టె ఉపేక్షించుచున్నాఁడను. కాని వానితో సరిపోల్చి చూచుడు అంత కఠోరము లనిపింపని ఒండు రెండు హింసాఘట్టములను మాత్రము ఉదాహరింపవచ్చును; ఏమందురా, అందు ఒకటి కేవలము ఖానుకుటుంబములో ఒక వ్యక్తికి చెందియున్నది; రెండవది నిర్వివాదమయిన విషయములు కలవానిలో ఒకటిగా నున్నది.

మాజుల్లాఖాన్ విషయము జగమెఱింగిన కథయే. అతఁడు ప్రముఖుఁడగు ఒక జమీందారు; పైఁగా ఖుదాయీఖిద్మత్ గారు. పన్ను చెల్లింపలేదని అధికారులు అతనిని జైలులో నెట్టిరి. పన్ను చెల్లింపమి తన తలంపుకాదనియు, రొక్కము చేతికి చిక్కినదే తడవుగ చెల్లించి వైతుననియు అధికారుల కాతఁడు వ్రాసికొనినాఁడు. అతఁడు బకాయపడిన రెండువేల రూకలకై మోటారు-ఒకటి, టోంగా-గుఱ్ఱము-మూఁడు గేదెలు జప్తుచేయఁబడ్డవి. అతఁడు విడుదల అయిన పదపడి పంట పైరులనేగాదు-తుదకు లక్ష యేఁబదివేల రూప్యముల విలువకు మించిన ఆతని జమీను సయితము జప్తుచేసి వైచిరి. పెద్దసోదరుని రెండవబిడ్డయు, వెనుక మనము వినియున్నట్టియు ఉబేదుల్లాఖాను పేరట ఉన్న భూమికి పెద్ద మొత్తము చెల్లింపవలసియుండెను. అందు హెచ్చుగ చెల్లించివైచిరి. ఇఁక బాకీ కేవలము మూఁడు వందలు. ఇదే నెపము పెట్టి ఆతనిని 'అరెస్టు' చేసి, చెరసద్దాలో జైలులో త్రోసిరి. అచట ఉనికి వర్ణింపరానిది. సహింపరాని ఆ ప్రదేశమున అ పరిస్థితులను సైరించుకన్న తిండితిప్పలు మానివైచుటయే మంచిదనుకొన్నంతవఱకు వచ్చెను. వేసిన శిక్ష ఒకటియు నఱ నెల. పరిస్థితులు బాగుపడుదాఁక ఆతఁడు 38 రోజులు నిరశనవ్రతము పూనవలసివచ్చెను; అంతలో రెన్నాళ్లలోనే ఆతని విడుదల ఆయెను. ఒక నెలపాటు తండ్రిచేతి మీఁదుగా ఒడలు, పాటునకు తెచ్చుకొని పిదప సొంత ఊరు చేరెను. కాని అక్కడ అప్పుడే 'ఆర్డినెన్సు' క్రింద ఆతని అరెస్టుచేసిరి.

ఈ 'ఆర్డినెన్సు'ను సమర్థించుచు ప్రభుత్వప్రకటనలు వెలువడినవి. అందు, ఆఱవప్రకరణమున సంక్షేపముగ నేను వ్రాసియున్న కొన్ని పాపకృత్యములకు ఖానుసోదరులు ఒడిఁగట్టిరని నింద నెత్తికెత్తిరి. ఖానుసోదరులు కావించిన ఈ దోసములే, డిసెంబరు 23 వ

తేదిని దర్బారుపిలుపు నిరాకరించిననాఁటికి అంత భయంకరముగా ఎన్నఁబడియుండలేదు.పిన్నలనక పెద్దలనక ప్రతివ్యక్తిమీఁదనుఅవమాన పరంపరలు క్రుమ్మరింపఁబడుచున్నవని వారు గుఱుతించిననాఁడు, ఆ యాహ్వానమును అట్టె నిరాకరించి యుండుటలో ఆశ్చర్యములేదు. కాని, ఆర్డినెన్సును అమలులో పెట్టి కుటుంబములో ప్రముఖులయిన అందఱితోపాటు ఖానుసోదరులను అరెస్టుచేయుటకు సమయ మాసన్న మాయెనని దొరతనమువారు భావించిరి.

ఆర్డినెన్సును జారీచేయుటలో దర్బారుకు వారు హాజరు కాకుండుట ఒక కారణముగ చెప్పఁబడెను. దర్బారుకే వారు హాజ రయి ఉండురేని ఆర్డినెన్సు అమలులో పెట్టియుండువారు కారా? డిసెంబరు 29 వ తేదిని గాంధిజీ బొంబాయి రావచ్చునని అబ్దుల్ గఫూరుఖాను విని ఆయనను కలసికొనుటకయి పైనమునకు సిద్ధమా యెను. లండనులో చదువులనాఁటి నెయ్యుఁడైన జవహరలాల్ నెహ్రూ పండితుఁడు అలహాబాదులో తనతో పాటు క్రిస్టమస్ పండుగ గడపుటకయి రమ్మని అప్పుడే డాక్టరు ఖానును పిలిచి యుండెను. ఆ ముచ్చట తీరుటకై ఆతఁడును పైనము కట్టెను. కాని దొరతనమువారు వారిరువురికి వేరుగ క్రిస్టమస్ పండుగ ఏర్పఱచి పెట్టిరి. 24 వ తేది ఆరేయి అన్నదమ్ములు అరెస్టుచేయఁబడి అటక్ బ్రిజ్ కె కొంపోవఁబడిరి. అప్పుడే ఇంగ్లండునుండి దేశమువచ్చి, ప్రావిన్షియల్ కాంగ్రెసుకమిటికి కార్యదర్శిగా ఉన్న సాదుల్లాఖాను సయితము (డాక్టరు ఖాన్ పెద్దబిడ్డ) అరెస్టుచేయఁబడి తండ్రుల నెక్కించిన ఆ స్పెషల్ ట్రైనులోనే తానుగూడ ఎక్కింపఁబడియె. నాఁటికి రెన్నాళ్ల క్రిందటనే స్వగ్రామము చేరిన డాక్టరు ఖానుసాహెబుభార్యయు ఆతని కుటుంబ మంతయు ఒకనాఁటి నడు రేయి గాఢనిద్రలో ఉండు తఱిని పోలీసువారు సోదాలకయి వచ్చి,

యిల్లు ఖాళీ చేయవలసినదని అడావుడి చేసిరి. ఇంకను ఒడలు అంతగా కోలుకొనని రెండవబిడ్డయగు ఉబేదుల్లాఖాను అప్పుడే అరెస్టు ఆయెను. తండ్రులు బిడ్డలు ఒకేతూరి అరెస్టు చేయఁబడినను దొరతనమువారు వారిని కలిపి మాత్రము ఉంపరైరి. డాక్టరు ఖాను సాహేబును స్పెషల్ ట్రెయినులో నైనీ- జైలుకుఁ (అలహాబాదు) గొంపోయిరి. తమ్ముఁడు హజారీబాగు జైలుకు తీసికొనిపోఁబడియెను. పెద్దబిడ్డ సాదుల్లాఖానును బెనారసుజైలులో పడవైచిరి. ఈ విషయమున ఆందోళన ఎంతో జరిగియుండుటఁజేసి డాక్టరు ఖానుసాహేబును తమ్మునితోఁ గలసియుండుటకు పదపడి హజారీబాగుజైలుకు బదలాయించిరి. చిన్నవాఁడగు ఉబేదుల్లాఖానుపట్ల ప్రత్యేకతః ఒక కన్ను వేసియుంచిరి. ఆ వివరాలకు ఇప్పుడే దిగవలసియున్నది. ఇంటివద్ద ఇఁక నున్నదంతయు కేవలము డాక్టరు సాహేబు. భార్యలు- వారి మైనరు బిడ్డలును. అబ్దుల్ గఫూర్ భార్య నాఁటికి పదేండ్ల క్రిందటనే కాలము చేసినది. పెక్కుసభలలో హాజరయిన వేలకొలంది పఠాను కాంతలువోలె ఖానుసోదరుల తోఁబుట్టువులు సయితము ఆందోళనలో పాల్గొని యుండిరి. అయితే వారినిమాత్రము జైలులో వేయలేదు. ఇఁక వారిబిడ్డలే గాదు- దాయాదులలో దగ్గఱివారు దూరమువారును జైలు రుచి చూడక తప్పలేదు. ప్రముఖులయిన ఖుదాయీఖిద్మత్ గారులు అందఱు అరెస్టు అయినది ఆ తరువాతనే.


అయితే, అబ్దుల్ గఫూరును బొంబాయి వెడలనిచ్చియుండిరేని జవహరలాల్ నెహ్రూపండితుని త్రోవలో బొంబాయి చేరునపుడు పట్టుకుందురేని గతించిన మూఁడేండ్లనాఁటి చరిత్ర మఱొక విధముగా ఉండెడిది. 'సంధి భగ్నమాయె'- అనుటకు గట్టి కారణములయినట్టియు, దొరతనమువారి విరోధభావమును సూచింపఁజాలినట్టియు ముఖ్యములైన ఈ రెండు 'అరెస్టు'లు జరిగినపిదపనైన

గాంధిజీకి లార్డు విల్లింగ్డన్‌తోడి సమావేశము సమ్మతించి యుండు లేని అప్పుడును బహుశః చరిత్ర అదియొకవిధముగా ఉండెడిది. గాంధిజీ కేవలము సంధిభంగమును గూర్చిన చర్చను మాత్రమే తక్క మ టేదియుఁ గోరలేదు. వీలయ్యేనేని శాంతిని పునరుద్ధరించుకొనుటకే అంతగా ఉత్సుకత చూపినాఁడు. మఱియు శిక్ష విధించిన కొలఁది నాళ్లలోనే గాంధిజీ, జైలునుండి ఖైదుగానైనను తాను దర్శించుట కియ్యకొనుఁడని లార్డు విల్లింగ్డనును వేఁడుకొనుచు ఒక లేఖ వ్రాసెను. కాని వైస్రాయి జవాబు ఇచ్చుటలో సయితము లక్ష్యము చూపఁడాయెను. అది సహేతుకము కానీ కాకపోవనీ, ఉద్యమమును అణఁచుటకే ప్రభుత్వము నిశ్చయించుకొన్నది. అందువలన వారు విప్లవకారులతో నెట్టి సంబంధమును పెట్టుకోఁజాలరైరి.

ధీరుఁడగు ఉబేదుల్లాఖాను 38 రోజుల నిరశనవ్రతముచే అంతకుమున్నే చెడ్డపేరు పొందియుండెను. అతఁడు లూధియానాకు, పిదప ముల్తాన్‌కు, అటనుండి అందటి ఆందోళనచే సియాల్‌కట్ జైలుకు మార్పులు చేయఁబడెను. సియాల్‌కట్‌లోని వాతావరణము ఆతని ఒడలికి సరిపడినటులు కన్పడినది; ఆరోగ్యము కూడ చక్కపడెను. కాని అంతలోనే మఱల ఆతని అసమ్మతి నేమియు సరకుగొనక ముల్తాన్ జైలుకు త్రోసివైచిరి. 1934 ఫిబ్రవరి 1 వ తేదిని ముల్తాన్ జైలుకు ఆతఁడు చేరనదే తడవుగ ప్రభుత్వము తన ఆరోగ్యమునకు అనువగుచోట ఉంచియుండనందులకు నిరశన వ్రతము ప్రకటించెను. ఈ స్వాతంత్ర్యమహోద్యమపు చరిత్రలో ఈ నిరశనవ్రతముయొక్క పరిమితి అభూతపూర్వము. అద్దాన దేశ మందటి దృష్టియు అట్టె ఆకర్షించివైచినది. అది నడచినది 78 రోజులు. జబర్‌దస్తీగా ఆహార మెక్కించుటలో సర్కారువారి సన్నాహములు సఫలములు విఫలములు కూడ ఆయెను. అతఁడు స్మృతితప్పి పడి

యున్నప్పుడు వారిచేఁతలు సఫలములే కావచ్చును; స్ఫూర్తియే తెలిసియుండెనా అన్నియత్నములు ఆఁటడిపోయెడివి. కాని తుట్టతుదకు పఠానుయొక్క దృఢనిశ్చయమునకే ప్రభుత్వము లొంగవలసివచ్చెను. మఱియు ఆ నిరశనవ్రతము ఆతని జీవితమునుగానీ మనఃస్థితినిగానీ కదలింపలేకపోయెను. ఇట్టి పరిస్థితులలో ఇంకొక్కఁడే అయినచో చచ్చునో లేక, ఉన్మత్తుఁడే అవునో! తుదకు 78 రోజుల పదపడి ఆతఁడు కావలెనన్నటులు సియాల్‌కట్ జైలుకే చేర్పఁబడినాఁడు. ఆగష్టు 18 వ తేదీని విడుదల అగునంతదాఁక ఆతఁడు అచ్చోటనే ఉండెను.

ఉబేదుల్లాఖాను ఉపవాసవైఖరి ఉత్తమమైనదే గాని అనుకరించుటకు మాత్రము అనువుకాదు. సత్యాగ్రహముయొక్క సరియైన నిర్వచనములో అది పొసఁగి యుండదు. నిరశనవ్రతము పూనుటకు మున్ను ఆతఁడు సత్యాగ్రహమహోద్యమపు మూలపురుషునే సలహా కోరియుండునేని అనుమతి దొరకియుండుట కల్ల. అయితే ఆతఁడు సత్యమని నమ్మినదానినే ఆచరించినాఁడు. అందలి మహత్త్వము ఆతని దృఢ నిశ్చయములోను-అద్దానికై అసువుల నర్పింపవలెనని ఆతఁడు చూపిన సంసిద్ధతయందును ఇమిడియున్నది. డాక్టరు ఖాన్ సాహెబు, తన బిడ్డసంగతి సగర్వముగ చెప్పుకొనుచు "ఈ కుఱ్ఱవాఁడు అసాధారణములగు ధైర్య సాహసములకు నమూనా అనవచ్చును" అని వచించెను. కాని తండ్రియు పిన తండ్రియు ధీరతకూడ ఇయ్యెడఁ జెప్పఁదగ్గదే. ఆ కుఱ్ఱఁడు ఆ నిరశనవ్రతము పూనిన రోజులలో ఆ అన్న దమ్ములిర్వురు హజారీ బాగు జైలులోనే యుండి, వార్తాపత్రికలలో ఆ వ్రతముగూర్చి, వార్తలు పడినపుడెల్లను తెలిసికొనుచుండెడివారు. ఆ బాలుని ఆరోగ్యమునుగూర్చి వారి కెన్నఁడు ప్రభుత్వము తెలిపినది లేదు.



ఖాన్ అబ్దుల్ గఫూరుఖాన్, డా. ఖాన్‌సాహేబు.
సేఠ్ జమనాలాల్ బజాజ్
(ఖాన్‌సాహేబును అరెస్టుచేయుటకు ముందటిరోజున
1934-12-8 తేదిని తీసినచిత్రము)

వారును, ఆతనిని చూచుటకుఁగానీ, ఆ వ్రతము రద్దుపఱుపఁ జేయుటకుఁగానీ అనుమతికోసము అధికారులను ఆశించినదియు లేదు. ఆనాఁటి కానాఁడు, చావు నిశ్చయమే అని రిపోర్టులు వెలుపలికి వచ్చుచుండ, ఈ అన్నదమ్ము లా శవమును ఏమి చేయవలయునో: ఎచ్చోట ఖననము చేయఁదగునో ఈ సూచనల నీయ నిశ్చయించుకొనిరి. నా జ్ఞాపక మున్నంతవట్టు ఇవి సూచింపుచు ఉత్తరమువ్రాసిన ఒండు రెండు నాళ్లలోనే ఉబేదుల్లా గెలిచినటులు, సియాల్‌కట్ జైలులోనే నిరశనవ్రతము మానినటులు వార్త వచ్చినది. తనయుఁడు - తనయునికంటె హెచ్చుగ తండ్రియు పినతండ్రియు అరుంతుదములగు ఈ బాధలు అనుభవింపవలసివచ్చినను ఖానుసోదరుల మనసులో కష్ట మావంతయు కలుగలేదని చెప్పుటలో తప్పులేదు. ఆ కథ వక్కాణించుతఱిని గర్వితుఁడగు ఆ తండ్రిమొగము మీఁద నగవు తొనఁకుచునే యుండెను. అతఁడు నా కా వివరములు ఇచ్చునపుడు కష్టముగానీ ఏవగింపుగానీ చూపలేదు. చివరికాతఁ డన్నది యిది:—"కాని యీ ప్రభుత్వములో ఒక విశేషమున్నది. నిరశనవ్రతము ముగిసినపిదప ఆతనిని ఎంతో ఆశ్చర్యమగునటులు అంతగా చూచిరి. ఆ చూపిన శ్రద్ధలో వేఱేమియు కావలెనను కోరిక యేదియు నిలువలేదు. ఈ తరువాతి శ్రద్ధకే యేను చాల కృతజ్ఞుఁడను; అదియే ఆతని అసువులను నిలుపఁజాలియుండెను."

ఇఁక, డాక్టరు ఖానుసాహేబు కడగొట్టు బిడ్డనుగూర్చి ఒక్క మాట. పేరు హిదాయతుల్లాఖాను. అతఁడు బొంబాయి గ్రాంటు మెడికల్ కాలేజిలో చదువు కున్నాఁడు. సెలవురోజులు గడుపుటకే ఉత్‌మాంజయీకి వెళ్లెను. ఉద్యమములో ఆతని పాలు లవలేశము లేదు. కాలేజికి వెళ్లవలెనని తిరుగుమొగము పెట్టెను. అంతలో ఆఁతడుకూడ 'ఆర్డినెన్సు' పాలఁబడి ఆఱుమాసములు జైలుశిక్ష అనుభవించిచూచెను.

# ౬

# అన్నదమ్ముల విశిష్ట గుణములు

ఈ సోదరు లీనాఁడు హిందూదేశముయొక్క 'సార్వజనిక శత్రువు'లని—అనుటలో ఈ అమెరికన్ శబ్దముయొక్క అర్థ మేమైనఁ గానిండు ; వీరు అనుపమానమైన త్యాగమును జూప నేర్చిన గొప్ప వ్యక్తులు. ఇట్టి కష్టపరంపరలు ఏ కొలఁది మందియో అనుభవించి యుందురు. ఇంక, ముందు వీరు సేవ చేయవలసిన యేండ్లును గలవు. అట్టి భావికాలమున వీరి శాశ్వత నిర్బంధమును - విశేషించి వీరి స్వేచ్ఛాప్రవృత్తియు వీరి అనుయాయుల కెల్లరకు స్వాతంత్ర్యము సంపాదింప ప్రోత్సాహముగా నుండును. ఎన్నఁడైన వారు దౌర్జన్యమును బోధించిరని గానీ దానికి సాక్షాత్తు సుముఖముగ ఉన్నారని గానీ అణుమాత్రము సాక్ష్యము దొరకినను వారినట్టె కాల్చివేయుటకు సంకోచింపని బ్రిటీషుదొరతనమును బెదరఁ గొట్టినది అదియే; వారి ప్రజలమీఁద వారకున్న స్వాతంత్ర్యపు కీలకము వారి కష్టాలలోను చూపిన త్యాగములలోను నిశ్చయముగా గర్భితమై యున్నది. అయితే అంతకన్న మిక్కిలిగ వారి నిత్య జీవితములోనే కానిపించును. అబ్దుల్ గఫూర్ ఖాను దైవచింత కల మానిసి. అగ్రజుఁడు అవక్రమగు వ్యవహార కౌశల్యము గల యోధుఁడు. అసత్యము, కృత్రిమము, పైపటారము, తళుకుబెళుకులు—ఇవి యున్నచో వారి కెంతో రోఁత. ఆగర్భ శ్రీమంతులుగా ఆవిర్భవించి ఆ అన్నదమ్ములు కడపెడి నిరాడంబర జీవితము మఱేరికిని మించఁ దరము కాదు.

1931 లో అబ్దుల్ గఫ్ఫార్ ఖాను బార్డోలీ వెళ్లినపుడు ఆతనికి స్వాగత మీయ అరుదెంచిన సర్దారు వల్లభభాయిపటేలు మఱి యితరులును రైల్వేస్టేషనులో సెకండు క్లాసు-పెట్టెలు పరిశీలింపఁ దొడఁగిరి. అంతలో ఆతఁడు మూఁడవతరగతి పెట్టెనుండి చిన్న చేసంచి తాను తయారు. ఆ సంచిలో రైల్వేగైడు-జోడు గుడ్డలు మాత్రమే ఉన్నవి. అతఁడు సాక్షాత్తు సిసలయిన ఫకీరుగ కన్పట్టెను. నిజముగా ఆతఁడు ఫకీరే.* పేదలలో నిఱుపేదలు వినీతులలో అంతటి వినీతులునగు పఠాను అనుయాయుల నడుమ ఆతనిని వేఱుగ గుఱుతించుట దుస్సాధము. ఆతని జీవితములోని నిరవధికమగు పరిశుద్ధత—అత్యంతము వినమ్రత - నిరుపమాన మగు నిస్స్వార్థత ఒరులను ఆకట్టఁజాలిన దొడ్డ గొనములు. అవి ఆతనికి శంకింపరాని అకుంఠిత భక్తిని ప్రసాదింపఁగల శక్తిని సమకూర్చుచున్నయవి. అతఁడు నాతో ఒకప్పు డిటులనియెను:—"పంజాబులోని కొన్ని ఉర్దూ-పత్రికలలో నాయెడ అన్నివిధములను దూషణలు చెలరేఁగి యున్నవి. ఒక వార్తాపత్రిక ఇస్లామునకు విరుద్ధముగా నన్ను ప్రదర్శించుటలో ఏమాత్రము అవకాశము ఉన్నను జారవిడువ లేదు." కాని

* ఫకీరు అన్నది (భిక్షువు) ప్రపంచమునుండి విరక్తిపొంది ఆధ్యాత్మిక జీవితమున కాలము పుచ్చువారికి అన్వయించు శబ్దము. పఠానుశబ్దమునకు దీనికి అర్థములో కేవలము ఎంతో వ్యతిరేకము. సంసార సంపత్తి కలిగి లోకులలో లెక్కవేయఁబడు మానిసికి ఈ పఠాను శబ్దము అనువర్తించును. "పఠాను శబ్దమునకు వ్యుత్పత్త్యర్థము ఒకప్పు డేదైన యుండినను ప్రకృతముమాత్ర మయ్యది కేవలము జాతిని సూచించునట్టిది కాదు. నేఁ డయ్యది మనుజుని సాంఘిక ప్రతిపత్తిని తెలుపుచున్నది. 'స్వాత్' లోను— 'దీర్' లోను సరిహద్దు జమీలలో హిస్సా ఉండి, తన్మూలమున గ్రామములోను పంచాయతీసంఘములోను హక్కు ఉన్నవానికి ఇది వర్తించునని వ్యవహారము. ఇఁక తన భాగము పోఁగొట్టుకొన్నవానికి ఫకీరు అని వాడుక. అట్టివానికి పైసంఘాలలో హక్కు ఉండనేరదు"—ఇంపీరియల్ గజెటియర్ (వాల్యూము 26). అబ్దుల్ గఫూర్ ఈ అర్థములో పఠాను కానేరఁడు. కేవలము అసలు ఫకీరు అనవచ్చును.

ఆతఁడు ఈ దూషణ పరంపరలచే చలింపని జీవితమునే గడుప నేర్చి నాఁడు. జైలుకు వెలుపల ఉన్నను విశ్రాంతి అన్నది యెఱుఁగఁడు. ఆతఁ డెప్పుడును కార్యవ్యాపృతుఁడయి యుండి సాంఘిక పునరుద్ధరణకై సాధనములు సమకూర్ప వెదకుచుండును. నడువఁగలిగిన దూరములో ఆతఁడు బండిగిండి వాడుటలేదు. తప్పని సరియే ఆయెనా చవుకరకముగ ప్రైనము సేయును. సర్వభోగములు త్యజించి సాధారణ భోజనమునే సరిపెట్టుకొనును. ఎచ్చోటి కేఁగినను లాఁతివారికాతని ఆదర్శములు సోఁకు ననుటలో చోద్యము లేదు.

లోకము ఆతనియెడ అఖండమైన విధేయత చూపును; వెనుక ముందు లరయక ఆతని ఆజ్ఞలను మన్నించును; ఆతఁడు అట్టి దొడ్డ గొనములకు మేలుబంతి కావుటను అది సహజమే అగును. 1934లో కాంగ్రెసు ప్రెసిడెంటుగా ఆతనిని ఎన్నుకొన ఉద్దేశించినపుడు అది నిరాకరించుచు, "నేను జన్మనా సిపాయిని; సిపాయిగానే చత్తును" అని వచించెను. కాని ఆతఁడు, అడుగులకు మడుగు లొత్తి తన ఆజ్ఞలకు కిమ్మనని వేలకొలంది సిపాయిలను కలిగియున్న సిపాయి. ఎంతైనను దంభము కపటము అన్న ఆతనికి చిటచిట. అత్యధిక సేవ అని కాక వేఱు అర్థము స్ఫురించు నాయకత్వము ఆతనికి అవగతము కానేరదు. నిర్మాణ కార్యక్రమములో అతఁడు నేఁడే మతము పుచ్చుకొన్నవాఁడు కాదు. ఆడంబరములు దొరలునట్టి కార్యక్రమము లాతనికి సుతరాము కిట్టవు.

ఆంగ్లేయుల సద్భావములో ఆతని కుండు విశ్వాసమునకు ఆతని జీవిత మంతటను ఆఘాతములు చవి చూడఁబడినవి. "విభజించి పాలించు" వైఖరిలో అంతటను చెప్పఁదరము గాని కష్టనష్టముల నాఁతడు కనుగొని యున్నాఁడు. అందుచే ఆతనిని ఎంతో కష్టము మీఁదఁగాని ఆంగ్లేయోద్యోగిమాటను నమ్మింపఁజాలము. కాని

బ్రిటీషువానియెడ ఆతనికి వ్యక్తిగతముగా ద్వేష మేదియు లేదు. బ్రిటీషుప్రజల యెడల మనకు ఉండఁదగ్గ దృక్పథమును గూర్చి గాంధిజీ ఏమని చెప్పెనో ఎయ్యది వ్రాసెనో అది యంతయు అక్షరాల ఆతఁడు అనుమతించును. సర్కారు ఉద్యోగులలో అన్నగారికి మిత్రులగువారు ఆతనికిని మిత్రులే. ఆ కుటుంబమును గూర్చి ఎంతో తెలిసియుండి, ఆతని అగ్రజునకు అతిథియై మిత్రుఁడై అప్పుడప్పుడు వచ్చి పోవుచుండు అప్పటి గవర్నరు, ఆతనిని ఆతని యాశయములను గూర్చి చేయఁబడ్డ అపార్థములను ఖండన సేయక అట్టె పోనిచ్చుట వింతలలో వింత.

కాని నా ఉద్దేశమున, ఆతని ఆధ్యాత్మికత-అంతకు మించిన ఆతని సత్యమగు ఇస్లాముతత్త్వము— ఇవియే ఆతనిలోని మహోన్నత విషయములు. అనఁగా పరమేశ్వరుని యెడ ఆత్మార్పణభావమని యర్థము. అతఁడు ఆదినుండియు గాంధిజీ జీవితమును ఈ కొలత కఱ్ఱతోనే కొలిచియున్నాఁడు. సర్వథా ఆతఁడు గాంధీజీని అంటియుండుటలో మఱే కారణమును చూపలేము. గాంధీజీ అన్న ఆతఁడు మక్కువ పడునది ఆయన పేరు ప్రతిష్ఠలను ఆలోకించి కాదు; ఆయన రాజకీయసేవలు గమనించి కాదు; ఆయన విప్లవ తత్త్వము గుఱుతించి కాదు. కేవలము ఆ మహాత్ముని అద్భుతమగు సంయమము-ఆత్మశుద్ధిలో ఆయనకున్న యట్టి అభినివేశము—ఇవియే ఆతనిని లెస్సగా ఆకట్టినవి.

1919 కి పిదప ఆతని జీవిత మంతయు ఆత్మశుద్ధికోసమే అనుస్యూతముగ కడంగినది. హిందూ—ముస్లిముల పొందునకు, మాతృభూమిసంసేవకు తమ సర్వస్వము సమర్పింప సిద్ధముగా ఉండి అకుంఠిత సత్ప్రవర్తనము ఏమఱనట్టి పెక్కుమంది ముస్లిమువ్యక్తుల స్నేహభాగ్యము నాకబ్బినది. అయితే అట్టి అద్భుతమగు ఆత్మపరిశుద్ధి

లోను—సంయమముతో నిండియున్న ఆ కఠోర జీవితములోను అత్యంత కోమలమైన అట్టి ప్రకృతిలోను—నిరుపమానమైన అట్టి దైవచింతలోను ఖాన్ అబ్దుల్ గఫూర్ ఖానుకు ఉద్దియగువాని గానీ పెద్దయగువాని గానీ నే నింతవట్టు చూచియే యెఱుంగను. ఒకప్పు డా తఁడు నాతో నిటులు పలికెను—"గాంధిజీ జీవితములో ఎన్నఁడైన ఒకానొక విశిష్టమైన గొప్ప సమస్య కలిగి అద్దానియెడ ఆయన గట్టి నిర్ణయమే చేయవలసి వచ్చినపుడు తలవని తలంపుగ నే నిటు లనుకొందును- 'అది ఈశ్వరుని యెడ ఆత్మార్పణము చేసికొన్నవాని నిర్ణయమే అగును. పరమేశ్వరుఁ డెన్నఁడును తప్పు త్రోవ త్రొక్కింపఁడు' గాంధిజీ ఉపవాసము లన్నియు దైవ ప్రేరితములే అని నేను నిస్సందేహముగ నెంతును." రాజకీయములనుండి గాంధిజీ విరమించు సంకల్పమును గూర్చి ప్రశ్నించినపుడు ఆతఁ డిట్లని చెప్పెను.— "గాంధిజీ ఈ నిశ్చయమునకు వచ్చుట నా కేమియు అబ్బురము కొలుపలేదు. ఆయన నిర్ణయములను అనుమానించి చూచుట నాకు తల దాఁటిన విషయమని తలంతును. ఏమందురా, ఆయన తన సమస్య లన్నింటను పరమేశ్వరునియందే భార ముంచి ఆయన ఆదేశములకే ఎదురు చూచుచుండును. ప్రతి-గొప్ప సంస్కర్త సంగతియు ఇంతే.. ప్రతిసంస్కర్తకును ఆతని జీవితములో అనుయాయులను అట్టె ఉంచి వారిలోపములకు దౌర్బల్యములకు అందక పైకి పోవలసిన దశ పట్టి తీరును. కాని ఆతఁ డట్లాచరించుటలో తన సేవకుల మేరను తగ్గింపఁ బోఁడు; ప్రత్యుత గొప్పదిగనే చేసి యుంచును. నా కున్న దంతయు ఒకే కొలతపద్ధతి; అది యిది:—ఒకఁడు తా నెంతవఱకు ఆత్మను పరమాత్మకు అర్పణ చేసికొన్నాఁడు అని." మానవులను విషయములను ఆతఁడు నిర్ణయించునది ఇట్లే. తన్ను నిర్ణయింపఁగోరునదియు ఇంతే.

అన్నగారి వైఖరి అదొక తీరు. అతఁడు పెక్కు దేశములు తిరిగి చూచినవాఁడు. వివిధ ప్రకృతులు గల మానవులను కలసి కొన్నాఁడు. తమ్ముఁడు ఎంతఁగా ఆత్మపరీక్ష చేసికొనునో ఈతఁ డంతగా ప్రపంచమును పరిశీలించి చూచెను. తమ్ముఁడు అప్పుడప్పుడు అంతరాత్మకు సంబంధించుదానినే మెచ్చుకొనుచుండును. అగ్రజుఁడు లోకములోని క్రొంగ్రొత్తలను స్థాపింపఁ జూచును. అనుజుఁడు విశేషించి ఆత్మనిగ్రహమందే బద్ధశ్రద్ధ కలిగి యుండును. అగ్రజుఁడు జీవితమును స్వాభావిక గతిలోనే నడపుచుండును; మఱియు మానవ స్వభావమునకు మించిన ఫలితమును అందుకొన నుంకింపఁడు. ఇతఁడు జన్మనా ఆటల రాయఁడు (స్పోర్ట్స్‌మెన్). తన కాలేజిలో ఈతఁడు క్రికెట్-టీమునకు నాయకుఁడు. లండనులో ఉండు నాఁడు క్రికెట్ ఆటలోనే కాక సాక్కర్ ఆటలో సయితము మొనకాఁడని పేరు. ఇతఁ డీతీరుగ జీవితమును ఆటలలో జమకట్టినాఁడు.తమ్ముఁడు 29 వ యేఁటనే అట్టి దీక్షవూని నీటిలో చేఁపవోలె రాజకీయము లందు చొచ్చుటలో అనుభవించిన కష్టాలకంటె, ఈతఁడు కొన్నేండ్లదాఁక సుఖజీవనమును గడిపిన పదపడి అంత ఆలస్యముగా 1931-32 లో ప్రియతరములగు వినోదములను వదలివైచి కష్టతరము లగు రాజకీయములను స్వీకరించుటలో బహుశః మిక్కిలి కష్టాలే అనుభవించి యుండవచ్చును. అయితే డాక్టరు వీని నన్నిటిని క్రీడా తత్త్వములోనే గ్రహించియున్నాఁడు. జీవయాత్రలో మధురములగు సౌఖ్యములే కాక కష్టాలుకూడఁగలవని ఆతఁ డెఱుంగును. తమ్ముఁడు కేవలము జీవితమున కష్టపరంపరలోని ఆనందమును అనుభవించుటకే ఉవ్విళు లూరుచుండును.

అనుజుఁడు ఆత్మసంయమమంటే అత్యంతము ప్రాముఖ్య మొసఁగును; మఱియు అందే ఆతని చిత్తము హత్తుకొని పోవును.

అగ్రజుని వైఖరి అది కాదు; అతఁడు అదనెఱిఁగి నగవుమొగముతోనే అది స్వీకరించును. ఒకప్పుడు డాక్టరు సాహేబు సిగరెట్ల ప్రస్తావనలో, వెనుక తాను విశేషముగా కాల్చెడి వాఁడ ననియు, నిచ్చలు ఏఁబది సిగరెట్లకు హెచ్చుగ అయ్యెడివనియు, కాని 1931 లో ఎచ్చటఁజూచిన జైలు శిక్షలు కోకొల్లలుగ చెలరేఁగిననాఁడు తనకుఁ గూడ అవి ప్రాప్తించునేమో అని అవి త్రావరాదని నిశ్చయించుకొంటిననియు నాతో చెప్పెను. నాఁటినుండి అతఁడు పొగాకును ముట్టనే లేదు. ఇఁక అబ్దుల్ గఫూరో అది యెన్నఁడు ఎఱుఁగనే ఎఱుఁగఁడు.

డాక్టరు ఖాన్‌సాహేబు నాకు వివరించిన ఒక కథను ఇట ప్రస్తావింపక తప్పదు. క్వెట్టాలో పేరువొందిన కల్‌నల్ సర్ రాబర్ట్ సాండిమెన్ పుత్రుఁడగు కల్‌నల్ సాండిమెన్, సంధికాలములో తన అనుచరులతో పాటు (గైడ్స్‌తో) పెషావరు వెళ్లెను. సంధినిగూర్చి అధికారవర్గములో ఒడలు కంపరముగ ఉండెడిది. తన నెయ్యుఁడగు డాక్టరు ఖాను సన్నిధిని కల్‌నల్ సాండిమెన్ ఈ భావమునే అణఁచి యుంచుకొన లేకపోయెను..అపుడు డాక్టరు సాహేబు ఆతనితో ఈ మాటలు పలికెను:— "అదిగాదు కల్‌నల్ సాండిమెన్; పరాజితుల మయితి మను భావమును పూర్తిగా పాఱఁద్రోలుము. రాజకీయ జీవనమనఁగా అది ఒక ఆట. అందు ఓడిన వారు-ఓడించినవారు, ఫుట్‌బాలు-క్రికెట్టులలోఁ బోలె ఒండొరులు అభినందించుకోవలెను. అయినను ఇప్పట్ల గెలుపు అన్నదే లేదే. ఓడినవారు గెలిచినవారు లేని సందర్భమిది." ఈ తీరుగ ఆ యుద్యోగీయుని చిక్కు తీర్చివైచెను. పరస్పరము ఎడఁబాయు నపుడు కల్‌నల్-ఇటులనెను:— 'మంచిది మంచిది. లెస్సగా మనము అన్యోన్యము అర్థము చేసికొంటిమి. చెరసద్దాలో మా అనుచరులకు

(గైడ్స్) మీకును ఏమియు కలఁతలు పొసఁగకుండుఁగాక యని ఆశింతును.'

అనుజుఁడు ప్రతిస్పర్థులను మతతత్వములో ఎదుర్కొనును. అగ్రజుఁడు కేవలము వ్యావహారికముగ వివదించును. అగ్రజుఁ డీతీరుగ బద్ధవిరోధము కల ప్రతిస్పర్థులను సయితము ఓరిమితో చూడఁగలిగి యుండ, అనుజుఁడు అట్టివారితో నిర్ణీతమైన మేరకు మించి ప్రస్తావించుటయే కంటకముగా ఎంచును. అగ్రజుఁడు విద్యార్థులతో వేళాకోళముగ నగుమొగముతో ముచ్చటింప నిచ్చగించును. సార్థకము గాని చదువులకొసమయి సమయము వ్యర్థపుచ్చు బాలురతో మురిపము చూపుట అనుజునకు ఇంపితముకాదు. అతనికి ప్రత్యేకము వ్యక్తిగత లక్షణములు కొన్ని ఉన్నవి. అగ్రజున కా బాధ యేదియు లేనటులు తోఁచుచున్నది. అయితే అబ్దుల్ గఫూర్ ఖానుకన్న తనలో లోపములు తెలిసికోఁగల నేర్పరి మఱెవ్వఁడు లేఁడు. పెషావరునుండి ఢిల్లీ-ఎసంబ్లీ-సీటుకు పోటీచేయుటలో డాక్టరు ఖాన్ సాహేబును ఒప్పించుట అంత కష్ట మనిపింపలేదు. ఇఁక అనుజునివద్ద అట్టిది ప్రస్తావించుటకు సయితము ఎవ్వరికి తేఁకువ ఉండఁదు.

అగ్రజుఁడు రాజకీయఘట్టముల రాయబారము నెఱపవలెనన్న వెనుకంజ వేయఁడు. అనుజుఁడు అట్టి వన్నచో స్వభావతః సంకోచించును. ఒకరి యెడ లేనివి మఱొకరి పట్ల పూరింపఁబడి ఇర్వురు ఏకమయి అనుపమానమగు జంటగా అగుట అద్భుతము. ఒండొరులలో ఇట్టి విభిన్నప్రకృతు లున్నను, ఆ అపూర్వ సత్యప్రవర్తన—అకుంఠితము గాఢము అగు భక్తిప్రపత్తి—కార్యాభినివేశము— అన్యోన్యానురాగము—ఇట్టివి పెక్కింట ఇర్వురు నొక్కటే. ఖుదాయీ ఖిద్మత్ గారులు—ఈశ్వరసేవకులు, అని పిలువఁబడుటకు ఇర్వురు మురిపపడుదురు; దుర్లభమయిన ఆ నామమునకు అర్హులు కావలెననియే వారు తమ జీవిత మంతయు ప్రయత్నపడుచున్నారు.

## ౧౦

# మరల అసలు ఇంటిలో

ఇంతకు ముందు వ్రాసి అచ్చున కిచ్చిన అధ్యాయముల కిది పరిశిష్ట భాగము. రాజద్రోహపునేరము ఎంచి అబ్దుల్ గఫూర్ ఖానును అరెస్టు చేయుట - ఈ గ్రంథమును కొంగ్రొత్తదిగాఁ గావించుటలో నన్ను రెచ్చఁగొట్టినది.

హజారీబాగు జైలునుండి విడుదల పొందిన నాఁటినుండియు ఆ అన్నదమ్ములు సేఠ్ జమునాలాల్ బజాజ్ యొక్క హృదయపూర్వకామంత్రణమును మన్నించి వార్ధాలో ఆయన యింటిని తమ యింటినిగాఁ జేసికొనిరి. సహృదయుఁడగు సేఠ్జీకి అతిథిగా గాంధిజీ అప్పటికే వార్ధాలో ఉండుట కూడ వారి ఉనికికి ఊఁత మిచ్చినది. అసలు జైలునుండి వెలికి వచ్చునపుడే వారు గాంధిజీ ఆజ్ఞానువర్తులయి ఆయన సలహాలలో మెలఁగుటకు నిశ్చయించుకొనిరి. విశ్రాంతివేళలో వారు మధ్యపరగణాలలో కొన్ని ప్రాంతములను - బెంగాలును - సంయుక్తప్రాంతము కొంతవట్టును తిరిగి చూచిరి. అయితే యించుమించుగా ఆ పర్యటనక్రమ మంతయు గాంధిజీ చేతిమీఁదిగా ఏర్పడినదే. అబ్దుల్ గఫూర్ వార్ధానుండి ఎచ్చటెచ్చటికి పోవునో అచ్చటచ్చట తానేమి చెప్పవలెనో, అది యెటులు చెప్పవలెనో ఇట్టి సలహాలు సమగ్రముగ గాంధిజీనుండి కైకొనకుండ ఉండువాఁడు కాఁడని నేననుటలో పరమరహస్య మేమియు లేదు. పెద్ద సోదరుఁడు గాంధిజీ సలహాయే లేనిచో అసెంబ్లీసీటుకు పోటీమాటయే తలపెట్టెడివాఁడు కాఁడు. ఆ ఎన్నికల అడావుడిలో కేవలము ఆ ప్రచారముకోసమే

సరిహద్దురాష్ట్రమునకు డాక్టరు ఖానుసాహేబును పోనిచ్చుటలో
ప్రభుత్వపుటనుమతి అడుగవచ్చునని అన్నదమ్ములలో ఒక రనుకొ
నఁగా గాంధిజీ సలహామూలముననే ఆ యోచన మానివేయఁబడినది.
గాంధిజీ అనుమోదింపనిది అఖిలభారత స్వదేశీప్రదర్శనము తెఱచుట
కయి ఖాన్‌సాహేబు ఒప్పుకొనఁడాయెను. అపుడు బొంబాయి
మిత్రు లాతనిని ఒప్పించుటలో మహాత్మాజీకి మనవి చేసికో వలసి
వచ్చెను. గాంధిజీ పట్టుదలయే లేనిచో ఖానుసాహేబు కాంగ్రెస్ -
వర్కింగ్ కమిటీసభ్యత్వము సమ్మతించెడివాఁడు కాఁడని కూడ
నుడువవచ్చును. తాను పదవులకు- రాచకార్యములకు పనికిరాననియు,
సామాన్యసేవకుఁడుగా ఉండుటయే తనకు సంతృప్తియనియు ఆతఁడు
పదేపదే చెప్పుటలో ఎన్నఁడు విసుగు గిసుగు లేదు. పాట్నాలో
వర్కింగ్ కమిటి సమావేశితము కానున్నపుడు హాజరగుటకు వీలయి
యుండియు ఆ 'ఎజెండా'ను చూడ తన ఆవశ్యక మెద్దియు లేదని
అని అపుడు హాజరే కాలేదు. ప్రశాంతమై వాక్శూరత పొడగట్టని
గ్రామసేవయే ఆతనికి అల్లారుబెల్లము. అఖిలభారత గ్రామపరిశ్రమ
సంఘములో కార్యనిర్వాహకవర్గ సభ్యుఁడుగా ఆతనిని ఉండవలెనని
గాంధిజీ నిశ్చయించినపుడు నిరాతంకముగ దానిని శిరసావహించెను.

ఇఁక అన్నగారి సంగతి. కఠోరమైన సంయమముకల తమ్ము
నికి ఇంచుమించుగా విపరీతముగాఁ దోఁచునట్టి ఆ క్రీడాతత్వము—
ఆ సముత్సాహము- ఆ కలుపుఁగోలుతనము ఉండుటఁజేసి బహుశః
ఆతనికి పెక్కుమంది మిత్రులు ఏర్పడియుండురు. గాంధిజీని సంద
ర్శించుటకు వివిధసభలలో పాల్గొనుటకు విచ్చేయు అసంఖ్యాకులగు
మిత్రులకు బజాజ్ గారి యిల్లు విడిది అయ్యెడిది. అట్టి ఆ యింట
నిత్యము డాక్టరు ఖానుసాహేబు అదొక పెద్ద అంశముగా నిరూ
పింపక- రోగుల సేవలు లోనగు భారము తలఁ దాల్చి యుండెడి

వాఁడు. వార్ధాలోని బాలికలయు మహిళామండలియు ఆశ్రమములు ఆతని సేవలను కృతజ్ఞతతో అందుకొనుచుండెడివి. ఇటీవల పరిసర గ్రామములకు వైద్యము - పారిశుద్ధ్యము- ఈ పనులకై పోవుచు రోజుకు పదియు పదునైదు మైళ్ళదాఁక నడక కూడ సాగించుచుండును. ఈ 'ఎక్స్- ఐ. యమ్. యస్'—ఆఫీసరుకు ఏ పనియు నీచముగా తోఁచినది లేదు. ఆతఁడు రోగుల ప్రక్కగాఁ గూరుచుండి వారికి స్వయము కాపు కాయుట, ఒక్కొక్కతఱి తాను వారికి పథ్యముగా నిర్ణయించిన కాయగూరలను తానే తఱుగుచుండుట నేను కనులారఁ గాంచియుంటిని. ఉదయపు షికారుకై గాంధిజీని కలియుట కాతఁడు వేకువనే లేచి ఆశ్రమము చేరుచుండును. మఱియు మాటాడక నిశ్శబ్దముగ ఆయనవెంట నడచి వచ్చి ఆశ్రమములో ఏరైన రోగు లుందురేని వారిం జూచి మఱి యింటికి చేరుచుండును.

కాంగ్రెసుచరిత్రలో స్థిరమైన భక్తికి స్వేచ్ఛాపూర్ణమగు విశ్వాస వైఖరికి ఇంతకన్న మహోన్నతములయిన నిదర్శనములు రెండిటిని మఱి చూచుట కష్టము.

ఈ సోదరులు తమ యింటి అక్కలందు సయితము గాంధిజీయందే సంపూర్ణ విశ్వాస ముంచుటలో సంకోచింపరైరి. జమనాలాల్‌జీ అతిథిగా వార్ధాలో ఉన్న ఆ అలఁతికాలములో అబ్దుల్ గఫూర్‌ఖాను మహిళామండలియు బాలికలయు ఆశ్రమములు చూచుటకు అవకాశము కలిగెను. అచ్చటి నిరాడంబర జీవితము—ప్రశాంతవాతావరణము - శుద్ధతాగరిమ - స్వాతంత్ర్యధోరణి - శారీరక పరిశ్రమ ప్రాముఖ్యము ఇవి ఆతనిని ముగ్ధునిగాఁ జేసివైచినవి. మఱియు, లండనులో పెత్తల్లి (డాక్టరు ఖానుయొక్క ఆంగ్లపత్ని) సాఁకుచున్న తన అనుంగుఁగూఁతును మెహరతాజ్‌ను దేశమునకు

రావించి వార్ధాలోని కన్యాశ్రమములో శిక్షణపొందింపవలెనని కోరెక వెల్లడించెను. అది సాహసపూర్ణము మహోన్నతము అగు నిర్ణయము. కాని,పఠానుబాలిక ఇంగ్లండు పంపఁబడి అట ఇంగ్లీషు-స్కూలులో చదివించుటకు వీలుండఁగా వార్ధా కన్యాశ్రమమును సొంతస్కూలుగా చేసికొనుటలో ఎందులకు కష్టము కన్పింపవలెను ? ఆశ్రమము - ప్రధానాధ్యాపిక అగు మీరాబెన్ను కన్న బిడ్డపట్ల దొడ్డ శ్రద్ధ తీసికోఁ గలవారిని తండ్రి యెక్కడ చూడఁగలఁడు ? ఈ విధముగ ఖాన్ సాహేబు వాదము చేయును. "నీతో పాటు మెహరతాజ్ ను తీసికొని రమ్మ"ని మీరాబెన్ను కు తంతి యిచ్చుటలో మహాత్మాజీ వెనుకాడ లేదు. మీరాబెన్ను మెహరతాజు ఒక ఇటాలియన్ ఓడలో డెక్కు మీఁద పయనము చేసి 1934 నవంబరు 22 వ తేదిని వార్ధా చేరెరి.

ఏణ్ణర్ధమునకు నేఁడే ఆ బిడ్డ మెహరతాజ్ తండ్రిని చూడఁ గలిగెను. అయితే డెహరాడూన్ లో కల్ నల్ బ్రౌను- స్కూలులో ఉన్న ఈమె తమ్ముగుట్టి నేఁటికి నాలుగేండ్లుగ తండ్రిని చూడనే లేదు. సంయుక్తరాష్ట్రములో తండ్రిగారు సంచారము చేయునపుడు ఆ చిన్నిబిడ్డఁడు (అబ్దుల్ ఆలీ) ఆతనిని గలసికొనెను. అంత ఆతనితో 1934 డిసెంబరు 4 వ తేదిని వార్ధాకు విచ్చేసెను. డిసెంబరు 7వ తేదిని మాపటి వేళ తమ తండ్రి అరెస్టు ఆయెనన్న వార్త చెవులఁ బడినపుడు ఈ పసిపాపల లేత డెందములు ఎంత అటమట చెందెనో అభివర్ణింప అలవి కాదు. జమనాలాల్ జీ తన కీ వార్త యెఱింగించినపుడు-ఆ పండ్రెండేండ్ల కుఱ్ఱఁడు ఆయనను ఇటులడిగెను:— 'అయితే, మీరు మహాత్మాజీ- తక్కినవారు ఎల్లరు స్వేచ్ఛగా ఉండ మానాయనను ఎందులకు అరెస్టు చేసినారు?' వెక్కి వెక్కి యేడ్చు ఆ పసికాయను ఊరడించుచు జమనాలాల్ జీ, 'బాబూ, బొంబాయిలో ఆయన రాజద్రోహకరమగు ఉపన్యాసమొసఁగినాఁడని చెప్పఁ

బహుటచేత' అని ప్రత్యుత్తరించెను. కాని అది 'రాజద్రోహ మననేమి' అను ఆబాలకుని జిజ్ఞాసకు వివరింప వలసిన ధోరణికి దించినది.

కాని, ఆ బిడ్డల కన్నీటిలోఁ గలియుటకు తండ్రికి కన్నీరే లేక పోయెను. కఠోరమగు పరీక్షలు పెచ్చుపెరిగిన కొలఁదియు హెచ్చి పోవునదియు, ఎన్నఁడు తఱుగనిదియు అగు ఆ స్నేహభాగ్యము గాంధిజీ-జమనాలాల్ జీలతో తనకుఁ గలదని ఆత డెఱుంగును. వారికి తన బిడ్డలను నిర్విచారముగ అప్పగింపనచ్చునని ఆతఁడెంచెను. వార్ధాలో ఈ కొద్దిరోజులు ఆ అన్నదమ్ముల నిర్వరను వారి సెయ్యురగు గాంధిజీ - జమనాలాల్ జీలను పరస్పరము ఆధ్యాత్మిక సంబంధమును సౌభ్రాత్రమును అందునంత దగ్గఱగా ఒండొరులను చేర్చివైచినవి. ఎన్నఁడు వారికి రాజకీయ సంభాషణలు ఉండెడివి కావు. కేవలము ప్రార్థనాపూరితములు మానభరితములు అగు ఆధ్యాత్మిక చర్చలే చాలఁగా నడచెడివి. ప్రత్యహము గాంధిజీ ఒనర్చు తులసీరామాయణ పారాయణమునకును- రేపు మాపుల ప్రార్థనలకును హాజరు కావలెనని ఖాన్ సాహెబు నిచ్చలు ఆశ్రమమునకు విచ్చేయుట ఎల్లరకు ప్రోత్సాహముగ ఉండెడిది. ఒకనాఁడు ప్యారీలాల్ తో ఖాన్ సాహెబు ఇటులు పలికెను;—"ఆ భజనలోని సంగీతపు కత్తు నా ఆత్మను తనుపుచున్నది; దయచేసి ఆ మాటలను ఉర్దూలో అనువదించి పెట్టుఁడు." ఏకాంత ప్రియుఁడు కావుటను, శాంతిపూర్వక ప్రార్థనము—ప్రశాంత కార్య కలాపము తక్క— తక్కిన దేనిని అంతగా ఆతఁడు ప్రేమింపఁడు. ఈ రెండింటికోసమే ఆతఁడు బెంగాలులోని గ్రామములలో ఉండవలెనని నిశ్చయించుకొనెను. బెంగాలులో—ఆ నిఱుపేదలగు ముసల్ మాను రైతులను— జీర్ణములగు, వారి కుటీరములను రెన్నెల్లనాఁడు చూచినపుడు ఆతనికి 'ఖాదీ'మహత్త్వము దృగ్గోచర మాయెను. గ్రామపరిశ్రమల పునరుద్ధరణముగూర్చి వారికి సందేశము అందఁజేయఁ

దలంచెను. అతఁడు డిసెంబరు 9 వ తేదిని బెంగాలు వెళ్లవలసి యుండెను. కాని, కొలఁదినాళ్లలోనే తాను తలపెట్టుచున్న గ్రామ పరిశ్రమసంఘముయొక్క తొలి సమావేశమునకు ఉండి తీరవలెనని జమనాలాల్‌జీ పట్టుపట్టెను. అద్దాన ఆతని పైనపుమాట 15 వ తేది వఱకు ఆపివేయఁబడెను. ఆతఁడు, బెంగాలు వెళ్లి అట చేయఁదగ్గ కార్యకలాపములను గూర్చి మేము ముచ్చటించుకొనుచుండు తఱిని 7 వ తేది సాయంసమయమున అరెస్టువారంటు పట్టుకొని జిల్లా పోలీసు — సూపరెంటెండెంట్ ప్రత్యక్ష మాయెను. ఇట్టి వారంటులకు ఎప్పుడు సిద్ధపడువాఁడు అగుటఁజేసి అది వచ్చిన ఆ క్షణమే 'అందులకు సిద్ధమే' అని ఆ గొప్పపఠాను పలికెను. కాని ఆతఁడు తన నేస్తులను- అన్నను బిడ్డలను గలసికొనుటకయి కొంత వ్యవధి ఈయఁబడెను. ఆతఁడు పోఁబోవుచుండ గాంధిజీ యిటులు పలికెను— "సరే మంచిది, ఖానుసాహెబూ, ఈసారి వెనుకటివలెఁగాక మేము 'డిఫెన్సు' పెట్టఁబోవుచుంటిమి". అది విని ఖాన్‌సాహెబు ఆశ్చర్యచకితుఁ డాయెను. 1919 నుండియు తాను అవలంబించిన పద్ధతికి వేఱుగ ఈ త్రోవ త్రొక్కుట ఆతనికి కంటకముగ ఉండెను. 'ఇత్తఱి నీ తలంపు గుర్తించితిని. కాని యిది యదను గాదు; తప్పనిసరి అయినచో మాత్రమే మన మిపుడు జైలు త్రొక్కవలయును—' అని మహాత్మాజీ అనెను. అయితే మీయిష్టమే కానిండు అని అప్పుడే సమాధానము వచ్చెను. ఆతఁడు గాంధిజీయందు చూప నేర్చిన మనోహరమయిన భక్తిప్రపత్తులకు ఇది మఱొక్క తార్కాణ.

మూఁడేండ్లకు పైఁగా, ఆ జైళ్లలోను నియమిత స్వేచ్ఛయొసఁగిన ఆ నాలు రోజులలోను తన కష్టసుఖములను పంచుకొన్న ఆ తమ్ముని ఎడఁబాటు అన్నగారి యెడందఁ గలంచివైచెను. కాని యిట్టి తఱి తమ్మునికి వ్యక్తిగతముగ తిలమాత్రమేని చింత కలుగదాయెను. తన బిడ్డలతో ఆతఁ డపుడు ఇది మాత్ర మనెను—'ధీరచిత్తులయి మీరు పెంపుడు తండ్రులగు, గాంధిజీ-జమనాలాల్‌జీల సాకతమున నిరాడంబర జీవితము-ఆత్మనియంత్రణము నేర్చుకొండు.'

అయితే ఒకటి మాత్రము ఆతనిని కలంచినది. అతఁడిటులు తలపోసెను:—'బెంగాలు గ్రామములలో దరిద్రులగు ఆ ముసల్మానులకు నా చేసిన వాగ్దానము సఫలము కాఁగలిగినచో ఎంత చక్కఁగా ఉండెడిది? నేను వారిలో ఒకఁడనయి ఆ పని చేసెదనని మాట యిచ్చి వచ్చితిని. కాని ఆ అలంతి సేవయు నే నిపుడు చేయఁ నోఁచుకొన నైతిని'. కొంత తడవు అట్టె యుండి గంభీర ముద్రాంకితుఁడయి విషాదయుక్త స్వరముతో మఱల నిటులు పలికెను:—"సరిహద్దు రాష్ట్రవిషయమై నే నేమి చెప్పవలెనో నాకుఁ దెలియదు. నా 'అరెస్టు' నా ప్రజలను తీవ్రమైన సాహసములకు ప్రేరేపింపకుండుఁగాక. దీనిని ప్రశాంతముగ ఎంచుకొని పరస్పరము అంతఃకలహములు అంతరింపఁజేసికొని ఏకమయి శాంతకార్యములలో ధైర్యముగా చొచ్చుదురు గాక. అన్ని విధములగు నిందలు మన నెత్తిని ఎత్తుచున్నపుడు అవి తప్పని మనము ఒప్పించుటకు ఏ అవకాశము మన కీకుండుట అది నాకుఁ జాల విచారకరము. దొరతనమువారి ఒక రిపోర్టు నారాష్ట్రమును 'ఖూనీల రాష్ట్రము'గ వర్ణించుచున్నది. కాని ఆడంబరములు నేర్పుకూర్పులు లేని పఠానులలో విద్యావిషయమున సంఘ సంస్కరణమున రాజకీయము మాట అటుని సేవలు సయితము చేయుటకు వారు మాకేమి అవకాశ మొసంగిరి?"

కాని బొంబాయికి తరలవలసిన తరుణ మేతెంచినపుడు ఈ కొందలము కూడ నిజమగు ఆ ఈశ్వరసేవకుని డెందమునుండి మాయమాయెను. ఆతఁడు జమనాలాల్ జీ, ఆతని ధర్మపత్ని జానకీదేవి-వీరి కడ సెలవు గైకొనుచు ఇటులు పలికెను:—"ఇది అంతయు దైవ ఘటన అనియే గాటమగు నా నమ్మిక. దైవము నన్నెంతదాఁక వెలుపల ఉపయోగించుకోఁ దలంచెనో అన్నాళ్లే నన్ను వెలుపల ఉంచి వైచినాఁడు. ఇప్పుడు నేను లోపల నుండియే సేవ చేయవలెనని ఆయన సంకల్పము. ఆయన కెయ్యది ప్రియమో అదియే నాకును ఆనందదాయకము."

సంపూర్ణము

# భాషాపోషక గ్రంథమండలి

అమృతలూరు
గుంటూరు మండలము

సంపాదకుఁడు
సత్యనారాయణ చౌదరి

ఆంధ్రభాషాపోషకు నసియగు బలువు నాకాంక్షించి యీ గ్రంథమండలిని వెడలించితిమి. ఏతన్మూలమున, అతివిశాలమగు సంస్కృతవాఙ్మయముపైని పాశ్చాత్య పండితులు వెలయించిన విమర్శనములను ప్రదర్శింతుము. స్మృతులు పురాణములు లోనగు వానిలో విశిష్టములగు వానిని అందఱ కవగాహమగునటులు తేటతెలుఁగున వివరింతుము. సరసములగు సంస్కృతాంగ్ల గ్రంథములను ఆంధ్ర బాలుర కుపయుక్తమగు వానిని బయలుపఱతుము. బాలికా బాలకులకు సాహాయ్యపడు పద్యగద్యకావ్యములను బ్రకటింతుము.

ఆంధ్రలోకపు టాదరాభిమానములను అర్థించుచుంటిమని మనవి.

# విక్రేయములగు పుస్తకములు

## ౧ వైదికవాఙ్మయ చరిత్రము

ఇది వేదములను, బ్రాహ్మణములను, ఆరణ్యకములను, ఉపనిషత్తులను, సూత్రగ్రంథములను గూర్చి విమర్శించిన గొప్ప గ్రంథము. మహోన్నతదశలోనున్న ఆ నాఁటి భారతీయుల విజ్ఞానప్రాభవము పాశ్చాత్యులు కొండాడిన తీరు ఇందు తెల్లమగును. విద్వచ్ఛిరోమణి కక్ష్యలకు పాఠ్యగ్రంథముగా నుపకరించునది. లైబ్రరీ - బుక్కుగా 'అప్రూవ్' కాఁబడినది. తొమ్మిది అధ్యాయములు. దరిదాపు ఐదువందలపుటలు.

వెల రెండున్నరమాత్రము

## ౨ కామశాస్త్రము

ఇది తృతీయపురుషార్థమునుగూరిచి సర్వతోముఖముగఁ జర్చించిన వాత్స్యాయనసూత్రములకుఁ దేటతెల్లమగు తెలుఁగుసేఁత. వాత్స్యాయనసూత్రములు, జర్మని - హిందీ - బెంగాలీ - ఇంగ్లీషు- మున్నగు భాషలలోఁ బరివర్తింపఁబడి వేలకువేలు ప్రతులు ప్రపంచవ్యాప్తమగుటయే దీని యౌత్కృష్ట్యమును సూచించుచున్నది. కామశబ్ద శ్రవణమాత్రానఁ గలవరపడని యోగ్యులగు పాఠకులకు మాత్రమే యియ్యది పఠింపఁదగియున్నది. ఆపాతతః చదివి ఆవలఁబెట్టవలసిన తీరులో - ఇయ్యది నిబద్ధము కాలేదు. ఏడు అధ్యాయములు. ముచ్చట నిచ్చు నచ్చు. శైలి లలితము. విషయము అమూల్యము.

వెల ఒక్క రూపాయి

## ౩ ధర్మశాస్త్రము

సర్వవిధములగు విధులు సమగ్రముగఁ జర్చింపఁబడ్డ ప్రామాణికమగు ప్రాచీన స్మృతి. మనుమహర్షిప్రోక్తమగు నిందలి విషయములను ఖండనమునకైన, మండనమునకైన అక్షరాస్యులగు వారెల్లరు నధ్యయనము సేయఁదగును. అస్పృశ్యత - ఆహారాది విషయములందు కలవరపాటుచెందిన అధునాతనలోకము ముఖ్యముగఁ గాంచఁదగును. ఆదర్శభూతులగు అర్వాచీనుల అభిప్రాయములను ఆధారముగాఁ గొని అభివర్ణించిన విపులమగు పీఠిక కలదు. సర్వాంగ సుందరమగు ముద్రణావిధానము. వెల రెండు రూపాయలు

## ౪ సతీసప్తతి

ఉచితమగు రీతిని హృద్యములగు ఉపదేశములను ఉపదేశించిన గ్రంథము. పద్యములు సరసములు. విశిష్య-బాలికల కత్యంతోపయుక్తము. 'టెక్స్టు-బుక్కు'గా 'అప్రూవ్' అయినది.

వెల రెండు అణాలు

## ౫ కథావింశతి

ఇరువదికథలు. నీతి - లోకతంత్రము - విద్యాభిలాషము - వినయప్రవర్తనము లోనగు సుగుణములను సులభముగ బోధపఱుపఁజాలు కథలు. ప్రారంభవిద్యాభిలాషులకు అత్యంతము ఉపకరించునది. 'టెక్స్టు బుక్కుగా' అప్రూవ్-అయినది.

వెల అయిదణాలు

## ౬ సుభాషితము

సంస్కృతవాఙ్మయమహోదధినుండి యేర్చికూర్చిన నీతిరత్నములు. సర్వకాలము సర్వ మానవు లాదరింప నను వగు నీతి వాక్య

ములె యిందుఁగలవు. సరసమగు వచన రచన. 'లైబ్రరీ-బుక్కు-గా' అప్రూవ్ అయినది. వెల నాలుగణాలు

## ౭ కావ్యమాల (రెండు భాగములు)

ప్రాచీనార్వాచీనములగు ఆంధ్ర గ్రంథములనుండి యేర్చికూర్చిన సరసములగు గద్య పద్యముల సంపుటి. టెక్స్టు బుక్కు-గా అప్రూవ్ అయినది. ఒక్కొక్కటియు పంద్రెండణాలు

## ౮ కవుల కథలు

కవిత్వ ప్రతిష్ఠ—చరిత్ర ప్రసిద్ధత నంది కలకాలము ఆంధ్రులు నోటపాటగా పాడుకోఁదగ్గ కవిసార్వభౌముల చరిత్రాత్మక కథలు. 'టెక్స్టు బుక్కు-గా' అప్రూవ్ అయినది.

వెల అయిదణాలు

## ౯ వరరుచి

వ్యాకరణ శాస్త్రమున వంద్యులగు మునిత్రయమువారిలో చేరిన 'వరరుచి' అను దివ్యపురుషుని మనోహరమయిన చరిత్ర. అతని శబ్దశాస్త్ర ప్రావీణ్యము- లౌకిక వ్యవహార విజ్ఞానము ఇందు వర్ణితములు. ఈతనికే కాత్యాయనుఁడని నామాంతరము. మధురమగు వచనము. 'అప్రూవ్'అయినది. వెల ఆఱణాలు

వలయువారు:—

మేనేజరు,

**భాషాపోషక గ్రంథమండలి**

అమృతలూరు-గుంటూరుజిల్లా